కరీంనగర్ సోమవారం 9.3.2020 మన రాష్ట్రం • మన పత్రిక


# నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

• వెల. రూ. 6.50 • సంపుటి 9 • సంచిక 254 • పేజీలు : 14 + 16

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







# షహర్‌కీ షాన్

## 1,82,914 కోట్లతో భారీ బడ్జెట్

50 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధి

కేసీఆర్ సర్కారు మరో మెగా ప్రాజెక్టు

ఈ ఏడాది 10 వేల కోట్లు కేటాయింపు

విశ్వనగరంగా మారనున్న భాగ్యనగరి

**మందగమనానికి** లొంగకుండా, జాతీయ ఆర్థిక కష్టాలకు తలొగ్గకుండా, కేంద్ర నిధుల్లో కోత పడ్డా బెదరకుండా, అభివృద్ధి- సంక్షేమం జోడెడ్లుగా, తెలంగాణ ప్రగతి రథం మరోసారి పరుగులు తీసేందుకు సిద్ధమైంది. నిరుపేదల నిన్నటి కష్టాలను సైతం తీరుస్తూ, రైతన్నల నేటి నష్టాలను సాంతం పూడుస్తూ, తెలంగాణ రేపటి అవసరాలను గుర్తిస్తూ జమా ఖర్చుల లెక్కను తీర్చిదిద్దుకున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసనమండలిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్‌ను సమర్పించారు. కేంద్రం నుంచి తగినంత సహకారం లభించకున్నా వెరవకుండా, ఆశావహ దృక్పథంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దారు. తొలి ఐదేండ్ల హయాంలో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును చేపట్టి విజయవంతంగా పూర్తిచేస్తున్న ప్రభుత్వం, మలి దశకు హైదరాబాద్ మెగా సిటీ అభివృద్ధిని ప్రధాన ఎజెండాగా ఎంచుకున్నది. జాతీయ స్థాయి వలసలతో నానాటికీ విస్తరిస్తున్న హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు వచ్చే ఐదేండ్లలో 50 వేల కోట్లు ఖర్చు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా భాగ్యనగరికి ఈ ఏడాది 10 వేల కోట్ల రూపాయలు కేటాయించింది.



### సంతులిత బడ్జెట్

**ఆర్థికమంత్రి** హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి సమతుల్యతతో ఉన్నది. ఇది సంక్షేమ తెలంగాణ కోసం రచించిన ప్రగతిశీల బడ్జెట్. తెలంగాణ ఆదాయ వనరులు, ప్రజల అవసరాలకు మధ్య సమతుల్యత సాధించిన వాస్తవిక బడ్జెట్. అన్నివర్గాల సంక్షేమం, అన్నిరంగాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు ఉన్నాయి.

- కే చంద్రశేఖర్‌రావు, ముఖ్యమంత్రి

### ఆర్థిక మంత్రికి ఆశీర్వచనం



ఆదివారం బడ్జెట్ ప్రసంగానికి ముందు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నుంచి ఆశీస్సులు అందుకుంటున్న ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు కూడా ఉన్నారు.

- కల్యాణలక్ష్మికి రూ.2,240 కోట్లు
- ఎంబీసీలకు సాయం కోసం 500 కోట్లు
- 38 పట్టణాల్లో 800 కోట్లతో మిషన్ భగీరథ
- ఎమ్మెల్యేలకు మూడేసి కోట్ల నియోజకవర్గ నిధులు
- ఆలయాల అభివృద్ధికి 500 కోట్లు
- ధూపదీపాలకు 50 కోట్లు
- గ్రామాల్లో సిమెంటు రోడ్లకు రూ.600 కోట్లు
- గోదావరి టూరిజం సర్క్యూట్‌కు రూ.300 కోట్లు
- పాఠశాలవిద్యకు రూ.10,421 కోట్లు
- అందరికీ విద్య అందించేందుకు వంద కోట్లు
- రాష్ట్రమంతా హెల్త్ చెకప్‌లు
- దేశంలో సింగిల్ డిజిట్.. రాష్ట్రంలో రెండంకెల వృద్ధి

| | |
|---|---|
| ప్రగతి పద్దు | రూ. 1,04,612.62 కోట్లు |
| నిర్వహణ పద్దు | రూ. 78,301.80 కోట్లు |
| మొత్తం రాబడుల అంచనా | రూ. 1,82,701.94 కోట్లు |
| రెవెన్యూ మిగులు | రూ. 4,482.12 కోట్లు |
| ద్రవ్యలోటు | రూ. 33,191.25 కోట్లు |
| రెవెన్యూ వ్యయం | రూ. 1,38,669.82 కోట్లు |
| పెట్టుబడి వ్యయం | రూ. 22, 061.18 కోట్లు |

### రైతు బంధువుగా సర్కారు నిరుపేదకు పెరిగిన ఆసరా

- సంక్షేమ పథకాలకు రూ. 40,000 కోట్లు
- రూ. 11,758 కోట్లకు చేరిన పింఛన్ల పద్దు
- సొంత జాగాలోనూ డబుల్ బెడ్‌రూం ఇల్లు
- రూ.10,500 కోట్లతో పథకం.. లక్ష మందికి లబ్ధి
- రుణమాఫీకి 6,225 కోట్లు.. 6 లక్షల మందికి లబ్ధి
- రూ.25 వేల లోపు బాకీలన్నీ ఏకమొత్తంగా మాఫ్
- మిగతా రైతులకు 4 వాయిదాల్లో సొమ్ము చెల్లింపు
- మద్దతు ధరకు భరోసా.. వెయ్యి కోట్లతో మార్కెట్ నిధి
- రైతు బంధుకు 14 వేల కోట్లు.. బీమాకు 1,141 కోట్లు
- ప్రజల కొనుగోలుశక్తి పెంచడమే లక్ష్యం
- మాంద్యమున్నా సంక్షేమరంగానికి భారీగా నిధులు
- ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధి రూ.16,534 కోట్లు
- ఎస్టీల ప్రత్యేక ప్రగతి నిధి 9,771 కోట్లు
- అసెంబ్లీకి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు బడ్జెట్ ప్రతిపాదన

› బడ్జెట్ సమగ్ర కథనాలు 2,3,4,5 పేజీల్లో
› సామాజిక ఆర్థిక సర్వే కథనాలు 6,7 పేజీల్లో

### ప్రభుత్వ నిబద్ధతకు అద్దం



సీఎం కేసీఆర్ నాయకత్వంలో విశ్వనగరం స్థాయికి రాజధాని

హైదరాబాద్‌కు బడ్జెట్ కేటాయింపులపై మంత్రి కేటీఆర్ హర్షం

2

### యెస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు అరెస్ట్

ఈ నెల 11దాకా రాణా కపూర్‌కు కస్టడీ

2వేల కోట్ల ఆస్తులు పోగేసిన కుటుంబం

రంగంలోకి సీబీఐ

8

### మారుతీరావు బలవన్మరణం

ప్రణయ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు

కేసు విచారణకు రావడంతో ఒత్తిడి

తోడైన సుపారీ గ్యాంగ్ బ్లాక్‌మెయిల్!

9

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 37.00 | రిటైల్ లైవ్ | 59.00 |
| డ్రెస్డ్ | 86.00 | స్కిన్‌లెస్ | 97.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 285.00 | రంగారెడ్డి | 285.00 |
| మెదక్ | 285.00 | కరీంనగర్ | 288.00 |
| వరంగల్ | 288.00 | డజన్ ధర | 54.00 |





“ గతంలో మా బాధలను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పంటపెట్టుబడికి రూ.10 వేలు.. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ.5లక్షల బీమా ఇస్తున్న డు. ఇప్పుడు రుణాలుమాఫీ చేసి దేవుడయ్యిండు.

- గుగులోత్ దేవానాయక్, రైతు మల్లంపల్లి, పాలకుర్తి మండలం, జనగామ జిల్లా

## పెద్ద పద్దు

“ ఆర్థిక మాంద్యానికి విరుగుడు కొనుగోలు శక్తిని పెంచడమే. సంక్షేమానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా జీవన ప్రమాణాలనుమెరుగుపరుస్తున్నాం. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, పెట్టుబడి వ్యయానికి నిధులు వినియోగించడమనే ద్విముఖ వ్యూహంతో ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాం.

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



# ప్రజలే కేంద్రం.. ప్రగతిశీలం

- ఆర్థిక మాంద్యమున్నా అభివృద్ధిబాట
- సబ్బండ వర్ణాల సంక్షేమమే లక్ష్యం
- ద్విముఖవ్యూహంతో పురోగమనం
- చిత్తశుద్ధితో హామీల అమలు
- శాసనసభలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- అసెంబ్లీలో తొలిసారి బడ్జెట్ ప్రసంగం



ఆదివారం అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థికమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

'ఈ బడ్జెట్ కేవలం వార్షిక బడ్జెట్ అన్న దృక్పథంతో కాకుండా, వచ్చే నాలుగేండ్ల రాష్ట్ర భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికారచన జరిగింది. ప్రజల అవసరాలు, ప్రాధాన్యాలపై స్పష్టమైన అవగాహనతో ఈ బడ్జెట్ రూపకల్పన జరిగింది. సంక్షేమ కార్యక్రమాల నిధుల్లో ఎక్కడా కోతవిధించ లేదు. పైగా సంక్షేమపథకాల లబ్ధిదారులను పెంచే నిర్ణ యాలను ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం పేదప్రజల అభ్యున్నతికోసం ఎంతటి నిబద్ధతతో ఉన్నదో ఈ బడ్జెట్ చాటి చెప్పుతు న్నది. ఇది పూర్తిగా ప్రజలే కేంద్రంగా రూపొందిన ప్రగ తిశీల బడ్జెట్' అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్ రావు పేర్కొన్నారు. సబ్బండవర్ణాల సంక్షేమంతోనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు అధికప్రాధాన్యమిచ్చారు. 61 నిమిషాలు సాగిన హరీశ్ బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

### సామాజిక విలువల స్వరూపం

స్వరాష్ట్ర ఉద్యమనాయకుడు, దార్శనిక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సారథ్యంలో తెలంగాణ ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకొన్నది. అన్నివర్గాల సంక్షేమం.. అన్నిరంగాల అభివృద్ధి లక్ష్యంగా పూర్తి వాస్తవికదృక్పథంతో 2020-21 వార్షిక బడ్జెట్ రూపొందింది.

### ప్రజల కొనుగోలుశక్తి పెంపు

ఆర్థిక మాంద్యానికి విరుగుడు ప్రజల కొనుగోలుశక్తిని పెంచడమే. సంక్షేమానికి అధిక ప్రాధాన్యమివ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నది. ప్రజల కొనుగోలుశక్తిని అంతకంతకూ పెంచడం, పెట్టుబడివ్యయానికి నిధులు వినియోగించడం అనే ద్విముఖవ్యూహంతో ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నది.

### చిత్తశుద్ధితో హామీల అమలు

మ్యానిఫెస్టో లక్ష్యం కేవలం బ్యాలెట్ బాక్సులే కాకూడదు, ప్రజల బతుకు నిలబెట్టడం కావాలి. ఇది సీఎం కేసీఆర్ నమ్మిన సిద్ధాంతం. అందుకే టీఆర్‌ఎస్ సర్కార్ తన మ్యానిఫెస్టోలో ఆచరణసాధ్యమైన హామీలనే ఇచ్చి అమలుకు శ్రీకారం చుడుతున్నది.

### మాంద్యమున్నా ముందంజ

కేంద్రం నుంచి రావలసిన పన్నుల వాటా, గ్రాంట్లలో కోతపడినప్పటికీ ఆ లోటును స్వీయ ఆదాయవృద్ధి ద్వారా పూడ్చుకోగలిగాము. బడ్జెట్ అంచనాల మేరకు ఖర్చు చేసుకోగలుగుతున్నాం. మన రాష్ట్ర తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే చాలా ఎక్కువ. ఇది మన ప్రగతికి స్పష్టమైన సంకేతం.

### తెలంగాణ.. కోటి ఎకరాల మాగాణం

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని మహా కవి దాశ రథి నినదిస్తే... నా తెలంగాణం కోటి ఎకరాల మాగాణం కావాలని సీఎం కేసీఆర్ స్వప్నించారు. ఈ కల నెరవేరేందుకు అహరహం పరిశ్రమిస్తున్నారు. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు లభించే నీటిని సమగ్రంగా వినియోగించుకునేందుకు సీఎం కేసీఆర్ గారు స్వయంగా పూనుకుని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాజెక్టులను రీడిజైన్ చేశారు.

### తీరిన ఫ్లోరైడ్ గోస

ఉమ్మడి రాష్ట్రంలో ఫ్లోరైడ్ విషం నిండిన నీటిని తాగడం వల్ల ఎముకలు బలహీనపడి, నడుములు వంగి తెలంగాణ బిడ్డలు దురవస్థలను అనుభవించారు. ఈ పరిస్థితిని మార్చితీరాలని సీఎం కేసీఆర్ అకుంఠిత దీక్షతో మిషన్ భగీరథ పథకానికి రూపుదిద్దారు. దీని ద్వారా సురక్షితమైన తాగునీరు లభిస్తుండటంతో గత ఆరేండ్లలో ఏ ఒక్కరూ ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడలేదని ఇండియన్ నేచురల్ రిసోర్సెస్ ఎకనమిక్ అండ్ మేనేజ్ మెంట్ ఫౌండేషన్ ఇటీవల ప్రకటించింది. ఇది రాష్ట్ర సాధన వల్ల దక్కిన సార్థకతకు నిదర్శనం.

### ప్రగతిశీల బడ్జెట్

ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి సమతుల్యతతో ఉన్నది. ఇది సంక్షేమ తెలంగాణ కోసం రచించిన ప్రగతిశీల బడ్జెట్. రాష్ట్ర ఆదాయ వనరులు, ప్రజల అవసరాలకు మధ్య సమతుల్యత సాధించిన వాస్తవిక బడ్జెట్. అన్నివర్గాల సంక్షేమం, అన్నిరంగాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు ఉన్నాయి. దేశంలో ఆర్థిక మాంద్యం వల్ల రాబడులు, కేంద్రంనుంచి వచ్చే నిధులు తగ్గినప్పటికీ రాష్ట్రాభివృద్ధి కుంటుపడకుండా బడ్జెట్‌ను రూపొందించడం అభినందనీయం. గ్రామాలు, పట్టణాల వికాసం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు, సంక్షేమ పథకాల్లో మరింతమంది పేదలకు అవకాశం కల్పించాలనే సంకల్పానికి, ఎన్నికల హామీల అమలుకు అనుగుణమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి హరీశ్‌రావును అభినందిస్తున్నా. మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి, బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావుకు, ఇతర అధికారులకు నా శుభాకాంక్షలు.

- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

### ముందుగా కేసీఆర్ ఆశీర్వాదం..

శాసనసభలో తొలిసారిగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు బడ్జెట్ ప్రతులతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి ఆయన కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకొన్నారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి బడ్జెట్ ప్రతులను చూపించారు. అసెంబ్లీలో మొదటిసారిగా బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి హరీశ్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

### భుజం తట్టిన కేసీఆర్.. ఆలింగనంతో కేటీఆర్

బడ్జెట్ ప్రసంగాన్ని ముగించిన అనంతరం హరీశ్‌రావును సీఎం కేసీఆర్ భుజం తట్టి అభినందించారు. శాసనసభ ప్రారంభానికి ముందు మంత్రి కేటీఆర్ సహచరమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్‌తో మాట్లాడుతుండగా హరీశ్‌రావు సభలోకి వచ్చారు. హరీశ్‌రావును చూడగానే మంత్రి కేటీఆర్.. ఆయనను ఆలింగనంచేసుకొని అభినందనలు తెలిపారు.


### ప్రాధాన్యరంగాలు.. ప్రగతి సోపానాలు

- రైతుబంధు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, గొర్రెలు, బర్రెల పంపిణీ, చెరువుల్లో చేపల పెంపకం వంటి పథకాలు రైతుల సంక్షేమానికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికితోడ్పడుతున్నాయి.
- ఎస్సీ, ఎస్టీల విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసానికి ప్రణాళికా బద్ధంగా కృషిచేస్తున్న ప్రభుత్వం.. దేశానికే ఆదర్శంగా నిలిచేలా ప్రత్యేక ప్రగతినిధి చట్టాన్ని తెచ్చింది.
- సమైక్య రాష్ట్రంలో నత్త నడకన సాగిన పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేస్తున్నది.
- కుల వృత్తులు, చేతి వృత్తులపై ఆధారపడిన బీసీలకు ప్రత్యేక ఆర్థిక ప్రేరణ అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను చేపట్టింది.
- మహిళలపై జరిగే లైంగికదాడులు, అకృత్యాలను అరికట్టేందుకు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, షీటీమ్స్ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.

### అతివలకు అసెంబ్లీ శుభాకాంక్షలు

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలకు శాసనసభ తరపున స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు శాసనసభ కొలువుదీరగానే స్పీకర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు.

### రాష్ట్ర ఆదాయం, వ్యయం (రూ.కోట్లలో)




# హైదరాబాద్‌కు 10 వేల కోట్లు

- ఐదేండ్లలో రూ.50 వేల కోట్లతో అభివృద్ధి
- విశ్వనగరానికి మరిన్ని మెరుగులు
- పట్టణాభివృద్ధికి రూ.14,809 కోట్లు కేటాయింపు



హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, నగర ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రపంచస్థాయి నగరాలకు దీటుగా హైదరాబాద్‌కు మరిన్ని సొబగులు అద్దేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇప్పటికే అనేక ఐటీ సంస్థలు, పరిశ్రమలు ఇక్కడలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుండటంతో మరిన్ని సౌకర్యాల కల్పనకు పూనుకొన్నది. ఇందులో భాగంగా హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించింది. ఇలా ఐదేండ్ల పాటు రూ.50వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధితోపాటు మూసీ నది ప్రక్షాళన, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అమలుకు ఈ నిధులను కేటాయించింది. రాష్ట్ర రాజధానితో పాటు ఇతర పట్టణాల అభివృద్ధికి కూడా భారీగా నిధులు ప్రకటించింది. గత బడ్జెట్‌లో పట్టణాభివృద్ధికి రూ.3,284 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.14,809 కోట్లు కేటాయించింది. ఇందులో నిర్వహణ వ్యయం రూ.1,261.98 కోట్లు కాగా, ప్రగతిపద్దు నిమిత్తం రూ.13,546.97 కోట్లను ప్రకటించింది. పట్టణాల్లో పచ్చదనం పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని అలవాటు చేయడానికి ప్రభుత్వం పట్టణప్రగతిని చేపట్టింది. పట్టణాల్లో ప్రజా మరుగుదొడ్లను ప్రభుత్వ స్థలాల్లోనే వీటిని మూడునెలల్లోపు నిర్మించాలని నిర్ణయించింది. ఘనవ్యర్థాల నిర్వహణను సమర్థంగా చేపట్టడానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. పలు పట్టణాల్లో డంపింగ్ యార్డు కోసం స్థలాల గుర్తింపు పూర్తయ్యింది. సమీకృత మార్కెట్లు, పార్కులు, వీధి వ్యాపారులు, ఓపెన్ జిమ్‌లు, ఆటస్థలాల నిర్మాణం వంటివాటి కోసం ప్రతినెలా ప్రభుత్వం రూ.148 కోట్లను విడుదలచేస్తుంది. పట్టణ మిషన్ భగీరథ కింద 38 మున్సిపాలిటీల నిమిత్తం రూ.800 కోట్లను తాజా బడ్జెట్‌లో కేటాయించింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయస్థాయి ఖ్యాతిని మెట్రో రైలు తీసుకొచ్చింది. ఈ క్రమంలో మెట్రో రైలుకు సంబంధించి పాత బస్తీలో మిగిలిన ఐదు కిలోమీటర్ల మార్గం త్వరలోనే పూర్తిచేయనున్నారు. రెండోదశలో భాగంగా రాయదుర్గం నుంచి శంషాబాద్, బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్‌వరకు మెట్రోరైలు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.



పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు

## ప్రభుత్వ నిబద్ధతకు అద్దం

**సీఎం కేసీఆర్ నాయకత్వంలో విశ్వనగరం స్థాయికి రాజధాని**

**హైదరాబాద్‌కు బడ్జెట్ కేటాయింపులపై మంత్రి కేటీఆర్ హర్షం**



బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ నిబద్ధతకు కేటాయింపులు అద్దంపడుతున్నాయన్నారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినందున నగరాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. రానున్న ఐదేండ్లలో రూ.50వేల కోట్లు ఖర్చుచేయనున్నట్టు వెల్లడించారు. ప్రపంచం అబ్బురపడేలా కాళేశ్వరం వంటి అతి భారీ ప్రాజెక్టును స్వల్పకాలంలో పూర్తిచేసిన సీఎం నాయకత్వంలో హైదరాబాద్ వేగంగా విశ్వనగరం స్థాయికి చేరుకోగలదన్న ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా నిలబెట్టే ప్రయత్నం నిరంతరం కొనసాగుతుందన్నారు. మొదటినుంచి హైదరాబాద్ అభివృద్ధికి కృషిచేస్తున్నట్టు వివరించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ) కింద మౌలిక వసతుల కోసం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో భాగంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్‌రద్దీని తగ్గించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మించినట్టు పేర్కొన్నారు. రెండోదశ మెట్రో రైలు కోసం వేగంగా ప్రణాళికలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ సహకారంతో అవి త్వరలోనే కార్యరూపం దాలుస్తాయన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

## లోకం పోకడ



పాపం, లోపల వుండి ఏం మాట్లాడాలో తెలియక బయటికి రావడానికే అరిచారట!

### ముహూర్తం

సూర్యోదయం: 6.28 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణ మాసం, శుక్లపక్షం పూర్ణిమ రాత్రి 11.18 వరకు, తదుపరి కృష్ణపక్షం పాడ్యమి, నక్షత్రం: పుబ్బ రాత్రి 1.09 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: రాత్రి 7.34 నుంచి 8.57 వరకు, రాహుకాలం: ఉదయం 7.57 నుంచి 9.26 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.00 నుంచి 12.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.09 నుంచి 3.56 వరకు, వర్జ్యం: ఉదయం 11.10 నుంచి మధ్యాహ్నం 12.34 వరకు.

## నేతల మాటలు



### ఇది రైతు బడ్జెట్

ఇది రైతు బడ్జెట్. వ్యవసాయం, దాని అనుబంధరంగాలకు ఎక్కువ నిధులు కేటాయించడం సంతోషకరం. కోటి ఎకరాల మాగాణం సీఎం కేసీఆర్ లక్ష్యం, చిత్తశుద్ధి, పట్టుదలకు బడ్జెట్ కేటాయింపులు అద్దం పడుతున్నాయి. ఆరేండ్లలో సీఎం కేసీఆర్ నిర్ణయాలతో తెలంగాణ పచ్చబడుతున్నది.

- నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి



### సంక్షేమానికి పెద్దపీట

ఆర్థికమాంద్యం ఉన్నా, కేంద్రం సహకరించకపోయినా బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేయడం గొప్ప విషయం. పేదలు, రైతుల పక్షాన నిలిచినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. కేసీఆర్ రైతు కాబట్టే వారి బాగు కోసం భారీగా కేటాయింపులు చేశారు.

- వేముల ప్రశాంత్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి



### గ్రామీణాభివృద్ధికి భారీ నిధులు

వార్షిక బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కోసం రూ. 23,005 కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఈ నిధులతో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చు.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి



### మరింత సుందరంగా భాగ్యనగరం

భాగ్యనగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నగర సమగ్ర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఐదేండ్లలో రూ.50 వేల కోట్లతో అభివృద్ధిచేస్తాం.

- తలసాని శ్రీనివాస్ యాదవ్, మంత్రి



### అన్నదాతకు ప్రాధాన్యం

రైతులు, నీటిపారుదలరంగం, సంక్షేమానికి పెద్దపీట వేశారు. రూ.25 వేల లోపు రుణాలున్న రైతులకు ఈ నెలలోనే చెక్కులు ఇస్తామనడం సంతోషకరం. సీఎం కేసీఆర్ సామాజిక ఇంజినీర్‌లా ఆలోచించి, బడుగుజీవులకు భరోసా ఇచ్చారు. మాంద్యంలోనూ కోత విధించలేదు.

- నామా నాగేశ్వరరావు, లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత



“ ఆర్థిక శాస్త్రంలో చెప్పిన గోల్డెన్ రూల్ ప్రకారం వివిధ సంస్థల నుంచి తెస్తున్న రుణాలన్నింటినీ పెట్టుబడి వ్యయం కోసమే వినియోగిస్తున్నాం. రాజీవ్ స్వగృహ తరహాలో నిరర్థక ఆస్తులను పారదర్శకంగా విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

# పెద్ద పద్దు ₹ం₹ం



“ మహిళా వికాసానికి, భద్రతకు ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఆరోగ్యలక్ష్మి ద్వారా గర్భిణులు, బాలింతలు, శిశువులకు ప్రతిరోజూ పోషకాహారం అందిస్తున్నది. కేసీఆర్ కిట్స్‌తో ఆర్థికసహాయం అందిస్తున్నది. మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో కోట్లు కేటాయించడం హర్షణీయం.

- సారిక, గృహిణి, ఎల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా

## నేతల మాటలు



### సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

హైదరాబాద్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు, ఆర్థికమంత్రి హరీశ్‌రావు, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్క ప్రాంతాల అభివృద్ధికోసం దాదాపు రూ.50వేల కోట్లు ఖర్చు చేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. హైదరాబాద్ విశ్వనగరంగా రూపాంతరం చెందడానికి మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నాం.

- బొంతు రామ్మోహన్, హైదరాబాద్ నగర మేయర్

# 1.83 లక్షల కోట్ల బడ్జెట్

- ప్రగతి పద్దు రూ.1,04,612.62 కోట్లు
- నిర్వహణ పద్దు రూ.78,301.80 కోట్లు
- అసెంబ్లీకి సమర్పించిన ఆర్థికమంత్రి హరీశ్‌రావు



ఆదివారం ఉదయం అసెంబ్లీలోని చాంబర్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు బడ్జెట్ పత్రాలను అందజేస్తున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు కూడా ఉన్నారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజాసంక్షేమానికి పెద్దపీటవేస్తూ.. రైతన్నకు మరింత భరోసాను కల్పిస్తూ.. సబ్బండవర్ణాల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 2020-21 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రూ.1,82,914 కోట్ల భారీ అంచనాలతో బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు ఆదివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దేశంలో ఆర్థిక మాంద్యం నీడలు, అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధత, ఇతర ప్రతికూల ప్రభావాలతో రాబడులు తగ్గినప్పటికీ.. సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారు. రైతన్నకు ఆపన్న హస్తాన్నందించారు. అదేసమయంలో సాగునీటిరంగానికి నిధులు అధికంగా కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమాల మధ్య సంతులనాన్ని సాధిస్తూ వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) బడ్జెట్ 1,46,492.30 కోట్లు కాగా రానున్న ఏడాదికి ప్రతిపాదించిన బడ్జెట్ రూ.36,422 కోట్లు అధికం కావడం విశేషం. సొంత రాబడులు భారీగా పెరుగుతాయని అంచనావేసిన సర్కార్.. ఆ మేరకు బడ్జెట్ పరిమాణాన్ని పెంచింది. మొత్తం పద్దులో ప్రగతి పద్దు రూ.1,04,612 కోట్లుగా, నిర్వహణ వ్యయం రూ.78,301.80 కోట్లుగా పేర్కొన్నది. నిర్వహణ ఖర్చులకంటే అభివృద్ధి, సంక్షేమానికి కేటాయింపులు రూ.26,310 వేల కోట్లు అధికంగా ఉండటం గమనార్హం. వచ్చే ఏడాది రాబడులు రూ.1,82,701.94 కోట్లకు పెరుగుతాయని అంచనావేయగా రెవెన్యూ మిగులును రూ.4,482.12 కోట్లుగా, ద్రవ్యలోటును రూ.33,191.25గా చూపింది. ద్రవ్యలోటు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి లోబడి మొత్తం జీఎస్డీపీలో 3% మేరకే ఉన్నదని ప్రకటించింది. ఈసారి రాష్ట్ర సంపద ప్రస్తుత ధరల వద్ద రూ.8,61,031కోట్ల నుంచి రూ.9,69,604 కోట్లకు పెరుగుతుందని ప్రణాళికావిభాగం లెక్కల్లో తేలింది.

### సామాజిక సేవారంగాలకు నిధులు

సామాజిక సేవారంగాలకు నిధుల కేటాయింపును భారీగా పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.42,197 కోట్లు కేటాయించిన ప్రభుత్వం దానిని అమాంతంగా రూ.60,905 కోట్లకు పెంచి ప్రజాసంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యమని తేల్చిచెప్పింది. ఆసరా వంటి పథకాలకు నిధులను పెంచింది. బీసీ,ఎస్సీ, మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌ను పెంచింది. విద్య, వైద్యం, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, కార్మిక సంక్షేమం, గృహనిర్మాణాలకు చాలినన్ని నిధులను కేటాయించింది. మొత్తానికి సామాజిక రంగానికి రూ.60,905.76 కోట్లు కేటాయించిన ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులకు.. అంటే ఎకనామిక్ సర్వీసెస్‌కు రూ.43,988.89 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇక సాధారణ సర్వీసులు, పరిపాలనకు గతంలో మాదిరిగానే రూ.33,765.07 కోట్లను కేటాయించింది.

### క్లస్టర్‌కు ఒక రైతు వేదిక

రైతులు పరస్పరం చర్చించుకోవడానికి వీలుగా ఐదువేల ఎకరాల క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతువేదికలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిషన్ భగీరథ కారణంగా రాష్ట్రమంతటా సురక్షితమైన తాగునీరు లభిస్తున్నదని మంత్రి హరీశ్‌రావు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. గత ఆరేండ్లలో రాష్ట్రంలో ఒక్కరు కూడా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడలేదని భారత సహజవనరులు, ఆర్థిక నిర్వహణ ఫౌండేషన్ ప్రకటించిందని వెల్లడించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా తాటి, ఈత వనాలను పెంచుతున్నామని తెలిపారు. నీరాను శీతల పానీయంగా అమ్మటంద్వారా గీత కార్మికుల ఆదాయం పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చింది. కంటివెలుగు తరహాలోనే చెవిముక్కుగొంతు, దంత సంబంధమైన వ్యాధుల నిర్ధారణకు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించనున్నట్లు హరీశ్ తెలిపారు. తెలంగాణలోని ప్రతి పౌరుడికి వైద్య పరీక్షలు నిర్వహించి తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని ప్రకటించారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని వెల్ల డించారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 1896 యూనిట్లు కాగా, దేశంలో 1181 యూనిట్లని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నియోజక అభివృద్ధి నిధుల కింద ఒక్కొకరికి రూ.3 కోట్లు కేటాయిస్తున్నామన్నారు.

### త్వరలోనే టీఎస్ బీపాస్

ప్రణాళికాబద్ధంగా పట్టణాల విస్తరణ జరగాలన్న లక్ష్యంతో నూతన మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సులభ పద్ధతుల్లో భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు టీఎస్‌బీపాస్‌ను ప్రభుత్వం త్వరలోనే అమలుచేయనున్నదని పేర్కొన్నారు.

### 33శాతం పచ్చదనం

రాష్ట్రంలో పచ్చదనాన్ని 33శాతానికి పెంచడం కోసం.. తద్వారా వాతావరణ సమతుల్యం కాపాడేందుకు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి హరీశ్ అన్నారు. మొక్కలను సంరక్షించే బాధ్యతను ప్రజాప్రతినిధులు, అధికారులకు తప్పనిసరిచేస్తూ చట్టం చేశామని చెప్పారు.

### వరుసగా మిగులును సాధిస్తున్న రాష్ట్రం

వచ్చే ఆర్థిక సంవత్సరం రాబడులను భారీగా పెంచడానికి పక్కా వ్యూహాన్ని అనుసరించనున్నట్లు ప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రకటించింది. ప్రస్తుత సంవత్సరంలో రూ.71 వేల కోట్ల వరకు ఉన్న సొంతపన్నుల రాబడిని వచ్చే ఏడాది చివరినాటికి రూ.85 వేల కోట్లకు పెంచడానికి అవసరమైన ప్రణాళికను బడ్జెట్‌లో వెల్లడించింది. 2018-19లో పన్నుల రాబడిలో 14.4% వృద్ధిరేటు నమోదుకాగా ఈ ఆర్థిక సంవత్సరంలో అది కాస్తా 9.7 శాతానికి పడిపోయింది. సవరించిన అంచనాల ప్రకారం రాష్ట్ర రాబడులు రూ.71,327.57 కోట్లుగా లెక్కగట్టారు. ఈ సొంత రాబడులను వచ్చే సంవత్సరానికి రూ.85,300 కోట్లకు పెంచుతామని సర్కార్ ధీమా వ్యక్తంచేసింది. భూములు, నిరర్థక అస్తుల అమ్మకాలతోపాటు జీఎస్టీ, వ్యాట్, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లల రాబడులలో లీకేజీని పూర్తిగా అరికట్టి రాబడులను మరింత పెంచుతామని ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్థిరాస్తి వ్యాపారం మరింత పుంజుకుని సొంత రాబడులు పెరుగుతాయని అంచనా వేసింది. ఈ కారణంగానే బడ్జెట్‌ను పెంచినట్లు ప్రకటించింది. పన్నేతర రాబడిని రూ.12 వేల కోట్ల నుంచి 30వేల కోట్లకు పెంచడానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

### కేంద్రంపై ఆశలు లేవు

కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.18,560 కోట్లుగా ఉన్న కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా ఈ నెలాఖరుకు రూ.15,987 కోట్లు మాత్రమే రావచ్చని అంచనావేశారు. వచ్చే ఆర్థి క సంవత్సరంలో ఇది నామమాత్రంగా పెరిగి రూ.16,726 కోట్లకు పరిమితమవుతుందని లెక్కగట్టారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి రెవెన్యూ మిగులు సాధిస్తున్న రాష్ట్రం వచ్చే ఏడాది ఆ మిగులు రూ.4,482 కోట్లుగా ఉండవచ్చని అంచనావేసింది. 2017-18లో రూ. 3,459 కోట్లుగా ఉన్న మిగులు ఈసారి రూ. 100 కోట్లకు తగ్గింది. వచ్చే ఆర్థిక సంవత్సరం పరిస్థితులు మెరుగ్గా ఉంటాయి కాబట్టి మిగులు అంచనాను పెంచినట్లు అధికారులు వెల్లడించారు.



## ధూప దీప నైవేద్యం విస్తరణ

- దేవాదాయశాఖకు రూ.550 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఆయా దేవాలయాల అభివృద్ధికి 2020-21 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పలు దేవాలయాలను ఆధునీకరించనున్నారు. మరోవైపు దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యపథకాన్ని యథాతథంగా కొనసాగించనున్నారు. ప్రస్తుతం 3,654 దేవాలయాలకు ఇప్పటివరకు ధీప, దూప నైవేద్య పథకం అమలు చేస్తుండగా.. మరో 1200 దేవాలయాలకు దీనిని విస్తరించనున్నారు. ఇప్పటివరకు 3,654 దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు రూ.27 కోట్లు ఖర్చు చేస్తుండగా.. ఆ అర్హత ఉన్న అన్ని దేవాలయాలకు దీనిని వర్తింపజేసేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఇందులోభాగంగా ఏడాదికి రూ.50 కోట్లు కేటాయించారు. దీంతో కలిపి దేవాదాయశాఖకు ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.550 కోట్లు కేటాయింపులు చేశారు.




ములుగు నుంచి గోటి తలంబ్రాలతో బస్సులో భద్రాచలానికి బయలుదేరిన మహిళా భక్తులు

## గోటి తలంబ్రాలతో భద్రాచలానికి

**ములుగుటౌన్:** ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయ మహిళా భక్తమండలి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో తయారుచేసిన గోటి తలంబ్రాల కార్యక్రమం శనివారం పూర్తయింది. గోటి తలంబ్రాలతో ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించిన అనంతరం 45 మంది మహిళా భక్తులు ప్రత్యేక బస్సులో భద్రాచలం బయలుదేరారు. శ్రీరామనవమి వేడుకలో భాగంగా భద్రాచలంలోని సీతారాముల కల్యాణంలో ఉపయోగించేందుకు గాను గోటి తలంబ్రాలను వీరు ఆలయంలో అప్పగించనున్నారు.

## అయ్యో, ఎవరి బిడ్డో..

- దవాఖానలో 15 రోజుల పసికందు శిశువిహార్‌కు తరలింపు



కల్వకుర్తి దవాఖానా ఆవరణలో వదిలిన పసిపాప

**కల్వకుర్తి రూరల్:** గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి 15 రోజుల పసికందును నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ప్రభుత్వం దవాఖానలో వదిలివెళ్లారు. ఏడ్పులు విన్న దవాఖాన సిబ్బంది శిశువును గుర్తించారు. ఈ శిశువు ఎవరి తాలుకో తెలుసుకునే ప్రయత్నం చేసినా ఆచూకీ లభించలేదు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ చిన్నారిని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి ఆదివారం సాయంత్రం పాలమూరు జిల్లా కేంద్రంలోని శిశువిహార్‌కు తరలించారు.

## 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

**హుజూరాబాద్, నమస్తేతెలంగాణ:** కరీంనగర్ జిల్లాలో 16 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంతోపాటు మరికొన్ని కారణాలతో వీరిని విధుల నుంచి తొలగించారు.





**ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

టెండరు పొడిగింపు ప్రకటన

2020-2021 సంవత్సరం కొరకు కార్పొరేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, TS ట్రాన్స్‌కో, GTS కాలనీ, ఎర్రగడ్డ, హైదరాబాద్-45 వద్ద బోర్డింగ్ ఫెసిలిటీస్ ఏర్పాటు చేయుట కొరకు అర్హతగల బిడ్డర్ల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి. టెండరు స్పెసిఫికేషన్లను TS ట్రాన్స్‌కో వెబ్‌సైట్: **www.tstransco.in** నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. **టెండర్ల దాఖలు కొరకు చివరి తేది/సమయం: 16-03-2020 (సోమవారం)న మ॥ 3.00 గం.**

సం/- చీఫ్ ఇంజినీర్ (ట్రైనింగ్)
CTI::TS ట్రాన్స్‌కో

R.O. No. 56/19




శాసనమండలిలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో హోంమంత్రి మహమూద్‌అలీ తదితరులు

## శాసనమండలిలో బడ్జెట్ పద్దు

- ప్రవేశపెట్టిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనమండలిలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అనుమతించగా, మంత్రి వేముల ప్రతిపాదించారు. ప్రశాంత్‌రెడ్డి తన బడ్జెట్ ప్రసంగాన్ని 11.33 గంటలకు ప్రారంభించి 12.38 గంటలకు ముగించారు. ఆయన ప్రసంగం చేస్తున్నపుడు పలువురు ఎమ్మెల్సీలు బల్లలు చరిచి హర్షం వెలిబుచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వచ్చిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఎమ్మెల్సీలు స్వాగతించారు. మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఎంపీ సంతోష్‌కుమార్‌తోపాటు పలువురు శాసనమండలి సభ్యులు అభినందించారు.

## విద్యుత్‌కు 10,415 కోట్లు

- గతేడాది కంటే రూ.2 వేల కోట్లు అధిక కేటాయింపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రాభివృద్ధిలో కీలకాంశంగా ఉన్న విద్యుత్‌రంగానికి తాజా బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చారు. వార్షిక బడ్జెట్‌లో విద్యుత్‌రంగానికి రూ.10,415.88 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ ఖర్చు కింద రూ.320.88 కోట్లు, పథకాల ఖర్చుకు రూ.10,095 కోట్లుగా ఉన్నాయి. గతేడాది మొత్తం రూ.8,299.45 కోట్ల నిధులు ఇవ్వగా.. ప్రస్తుత బడ్జెట్‌లో దాదాపు రూ. 2,180 కోట్లు అదనంగా నిధులు అందించారు. 4,000 మెగావాట్ల యాదాద్రి, 1,080 మెగావాట్ల భద్రాద్రితోపాటు విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు వీలుగా భారీగా నిధులు కేటాయించారు.






“ బడ్జెట్‌లో అన్నిరంగాలకు ప్రాధాన్యమివ్వడం హర్షణీయం. గత బడ్జెట్ కంటే ఈసారి 25 శాతం పెంచారు. అక్షరాస్యత పెంపుకోసం రూ.100కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

- కొప్పుల అంజిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్రం, ఎంజీయూ, నల్లగొండ

## పెద్ద పద్దు ₹౦₹౦

“ తెలంగాణలోని దేవాలయాలకు పునర్వైభవం తేవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నది. యాదాద్రి క్షేత్రాన్ని ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నది. వివిధ దేవాలయాల పూజారులకు అర్చక నిధి ద్వారా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నది.

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు




# ఇండ్ల బడ్జెట్ పదింతలు

- రూ.11,917 కోట్లు కేటాయింపు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- నిర్మాణంలో ఉన్న ఇండ్లన్నీ త్వరలోనే పూర్తి
- లక్షమందికి సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి సాయం
- ఇప్పటివరకు లబ్ధిదారులకు అందిన 38,740 ఇండ్లు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి ఈసారి బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. నిలువ నీడలేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారంచేసేందుకు నిధులను ఎవరూ ఊహించని విధంగా గణనీయంగా కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.1,277 కోట్లు కేటాయించగా, ఈసారి పదింతలు పెంచి ఏకంగా రూ.11,917 కోట్లు ప్రకటించింది. పథకం ప్రారంభంనుంచి ఇప్పటివరకు రూ.7,394.54 కోట్లు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి ఖర్చుచేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇండ్లతోపాటు సొంత స్థలం ఉండి ఇంటిని నిర్మించుకోవాలనుకొనేవారికి కూడా ఆర్థిక సాయం చేయనున్నది. ప్రస్తుతం నిర్మాణాలు చివరి దశకు చేరిన 1.09 లక్షల ఇండ్లతోపాటు వివిధదశల్లో ఉన్న లక్షన్నర ఇండ్లను కూడా త్వరలోనే పూర్తిచేసి నిరుపేదలకు అందజేయనున్నది. టెండర్లు ఖరారు చేసి నిర్మాణాలు మొదలుపెట్టినవాటితోపాటు నిర్మించ సంకల్పించినవాటిని సైతం పూర్తిచేసేలా నిధులు కేటాయించింది. దీంతో తొలిదశలో నిర్మిస్తున్న 2.83 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లు వచ్చే సంవత్సరంలో పూర్తిచేయనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడుతగా రూ.18,663 కోట్లతో ఈ బృహత్తర ప్రాజెక్టును చేపట్టింది. మొత్తం 2,83,401 ఇండ్లు నిర్మించాలని పరిపాలనా అనుమతులు జారీచేసి, 2,72,763 ఇండ్ల నిర్మాణాలను మొదలుపెట్టింది. ఇప్పటికిప్పుడు పంపిణీ చేసేందుకు 95శాతం పనులు పూర్తిచేసుకున్న 1.09 లక్షల ఇండ్లు సిద్ధంగా ఉన్నాయి. మరో 32 వేల ఇండ్ల నిర్మాణాలు 80శాతం పూర్తవగా, మిగతా ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకు 38,740 ఇండ్లను లబ్ధిదారులకు అందజేసింది. ఒక్కో ఇంటికి రూ.6.29 లక్షలు వెచ్చిస్తుండగా, వీటిలో రూ.5.04 లక్షలు ఇంటి నిర్మాణానికి, రూ.1.25 లక్షలు మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చుచేస్తున్నది.




### లక్ష మందికి ఆర్థికసాయం

ఎన్నికల మ్యానిఫెస్టోలో టీఆర్‌ఎస్ ఇచ్చిన హామీని నెరవేర్చుకొంటున్నది. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం చేయనున్నది. తొలిదశలో లక్ష మందికి ఈ సాయం అందించనున్నది. దీంతో సొంతింటి కల నెరవేరనున్నది.



## గోదావరి.. పర్యాటక దరి

- గోదావరి టూరిజం ప్రాజెక్టుకు 300 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం రూ.300 కోట్లతో గోదావరి టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేయబోతున్నది. గోదావరి నదీజలాల వినియోగంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న సర్కారు.. దేశం మెచ్చుకొనే రీతిలో ప్రాజెక్టులను నిర్మించింది. ఆయా ప్రాజెక్టులు, రిజర్వాయర్లు గోదావరి నీటితో కళకళలాడుతూ పర్యాటకుల మనసుదోచేలా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీన్ని ఆధారంగా చేసుకొని రాష్ట్రంలో పర్యాటకరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త ఆలోచనకు శ్రీకారంచుట్టారు. రూ.300 కోట్లతో గోదావరి టూరిజం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటికే దీనిపై పర్యాటకశాఖ అధికారులతో సమీక్షించారు. సాధ్యాసాధ్యాలు, ఇతర అంశాలపై పలుశాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## ఆటలకు ప్రోత్సాహం

- పర్యాటకం, క్రీడలకు రూ.385 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకం, క్రీడలు, యువజన సర్వీసులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పర్యాటకం, క్రీడలు, యువజన సర్వీసులశాఖలకు బడ్జెట్‌లో రూ.385.62 కోట్లు కేటాయించింది. ఇందులో ప్రగతిపద్దు కింద 297.96 కోట్లు, నిర్వహణ పద్దు కింద 87.66 కోట్లు. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన (రూ.107 కోట్లు) కంటే ఈసారి దాదాపు రూ.278 కోట్లు పెంచింది. పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటకులను ఆకర్షించడం ద్వారా పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న చర్యలు చేపడుతున్నది.

# పల్లెకు రాజయోగం

**బడ్జెట్‌లో రూ.23 వేల కోట్ల కేటాయింపు.. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.600 కోట్లు**

**ఉపాధి హామీ సామగ్రికి రూ.65 కోట్లు.. కర్మచారులకు రూ.2 లక్షల బీమా**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏండ్లకేండ్లుగా వెనుకబడిన గ్రామాలకు స్వరాష్ట్రంలో రాజయోగం మొదలైంది. వివిధ రూపాల్లో గ్రామాలకు ఏటా సగటున రూ.8 వేల కోట్ల నిధులు అందుబాటులోకి తీసుకొస్తామన్న సీఎం కేసీఆర్ హామీ బడ్జెట్‌లో ప్రతిఫలించింది. ఈ బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌శాఖకు భారీగా రూ.23 వేల కోట్లు కేటాయించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.600 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఎల్‌ఈడీ వీధిదీపాలతో ఈ ఖర్చు సగానికి తగ్గుతుంది. మరోవైపు మిషన్ భగీరథ నుంచి గ్రామాలకు మంచినీరు అందుతుండటంతో తాగునీటికి వెచ్చిస్తున్న నిధులు కూడా ఆదా కానున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్‌శాఖ రూ.23,005 కోట్లు ఖర్చు చేయనుండటంతో జనాభా ప్రాతిపదికన చిన్న గ్రామాలకు కూడా ఏటా రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల మేరకు నిధులు వస్తాయి. వీటికి ఉపాధి హామీ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అదనం. గ్రామాల్లో పనిచేసే పారిశుద్ధ్య కర్మచారులకు ప్రభుత్వం రూ.8,500 గౌరవ వేతనంతోపాటు రూ.2 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నది. ఈ ప్రీమియంను పంచాయతీరాజ్‌శాఖే చెల్లించనున్నది. ఉపాధి హామీ పథకం పనులకు అవసరమయ్యే వస్తు, సామగ్రి కొనుగోళ్లకు ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.65 కోట్లు వెచ్చించనున్నది.

### శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు

| రంగం | నిర్వహణ పద్దు (రూ.కోట్లలో) | ప్రగతి పద్దు (రూ.కోట్లలో) | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| వ్యవసాయ, సహకారం | 895.42 | 23,221.15 | 24,116.57 |
| వ్యవసాయ మార్కెటింగ్, సహకారం | 101.41 | 7.42 | 108.83 |
| పశుసంవర్ధక, మత్స్య | 1,409.38 | 177.00 | 1,586.38 |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | 453.24 | 3,903.59 | 4,356.82 |
| మహిళా, శిశు, వికలాంగుల, వయోజనుల సంక్షేమం | 827.37 | 720.82 | 1,548.20 |
| విద్యుత్ | 320.88 | 10,095.00 | 10,415.88 |
| పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతికత | 781.15 | 10.32 | 791.47 |
| ఆర్థికం | 31,503.68 | 60.00 | 31,563.68 |
| ఆహార, పౌరసరఫరాలు | 68.47 | 2,294.36 | 2,362.83 |
| సాధారణ పరిపాలన | 298.41 | 214.53 | 512.93 |
| వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 3,824.16 | 2,361.81 | 6,185.96 |
| ఉన్నత విద్య | 1,638.04 | 85.24 | 1,723.27 |
| హోం | 5,179.22 | 672.74 | 5,851.96 |
| గృహ నిర్మాణం | 1,416.59 | 10,500.00 | 11,916.59 |
| పరిశ్రమలు, వాణిజ్యం | 329.98 | 1,668.21 | 1,998.19 |
| సమాచార సాంకేతికం | 2.78 | 25.30 | 28.08 |
| నీటి పారుదల | 7,446.97 | 3,606.58 | 11,053.55 |
| కార్మిక, ఉపాధి కల్పన | 289.26 | 107.78 | 397.05 |
| న్యాయ | 807.73 | 115.70 | 923.44 |
| అసెంబ్లీ నిర్వహణ | 148.21 | 0.00 | 148.21 |
| మైనార్టీ సంక్షేమం | 379.60 | 1,138.45 | 1,518.06 |
| పురపాలక, పట్టణాభివృద్ధి | 1,261.98 | 13,546.97 | 14,808.95 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 4,701.04 | 18,304.31 | 23,005.35 |
| ప్రణాళిక | 71.41 | 4,158.13 | 4,229.53 |
| ప్రభుత్వ రంగ సంస్థలు | 1.27 | 0.00 | 1.27 |
| వర్షాభావ ప్రాంతాల అభివృద్ధి | 0.54 | 0.00 | 0.54 |
| రెవెన్యూ | 2,348.28 | 215.88 | 2,564.17 |
| ఎస్సీ అభివృద్ధి | 237.91 | 2,372.28 | 2,610.19 |
| మాధ్యమిక విద్య | 9,113.11 | 1,307.83 | 10,420.94 |
| రవాణా, రోడ్లు, భవనాలు | 1,930.39 | 1,563.27 | 3,493.67 |
| గిరిజన సంక్షేమం | 426.26 | 1,859.98 | 2,286.24 |
| యువజనసర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక | 87.66 | 297.95 | 385.62 |
| మొత్తం | 78.301.80 | 1,04,612.62 | 1,82,914.42 |



## రవాణాకు రాచబాట

- రవాణా, రోడ్లు భవనాల శాఖకు రూ.3,494 కోట్లు
- గత బడ్జెట్‌కన్నా రెండువేల కోట్లకుపైగా పెంపు

రవాణా, రోడ్లు భవనాలశాఖకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో రూ.3,494 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన (రూ.1,411 కోట్లు) మొత్తం కంటే రూ.2,000 కోట్లకు పైగా పెంచింది. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర విధానాన్ని అమలుచేస్తున్నది. రహదారుల నిర్మాణం, నిర్వహణకు రూ.750 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాకేంద్రాల్లో సమీకృత కలెక్టరేట్లు, జిల్లా పోలీసు కార్యాలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. ఇప్పటికే చాలా జిల్లాల్లో నిర్మాణాలు పూర్తికాగా, మరి కొన్నిచోట్ల చివరిదశలో ఉన్నాయి. త్వరలోనే ఈ నిర్మాణాలన్నీ పూర్తిచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. కలెక్టరేట్లు, డీపీవోలు, పోలీసు కమాండ్‌కంట్రోల్ సెంటర్ నిర్మాణాలను ఈ ఏడాదిలో పూర్తిచేయడానికి బడ్జెట్‌లో రూ.550 కోట్లు ప్రతిపాదించారు.



శాసనమండలిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమర్పించే బడ్జెట్‌ను వీక్షించేందుకు వచ్చి విజిటర్స్ గ్యాలరీలో కూర్చున్న ఆయన కుటుంబసభ్యులు, ఎంపీ సంతోష్‌కుమార్



అసెంబ్లీలో బడ్జెట్ పత్రాలను చదువుతున్న మంత్రులు కే తారకరామారావు, జీ జగదీశ్‌రెడ్డి

## పౌరసరఫరాలకు ప్రాధాన్యం

- రూ.2,362 కోట్లు కేటాయింపు

ప్రభుత్వం బడ్జెట్‌లో పౌరసరఫరాలశాఖకు ప్రాధాన్యం కల్పించింది. రూ.2,362.83 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.2,294.36 కోట్లు ప్రగతి పద్దు కాగా, రూ.68.47 కోట్లు నిర్వహణ పద్దు. గతేడాది బడ్జెట్‌లో పౌరసరఫరాలశాఖకు రూ.2,355.84 కోట్లు కేటాయించగా, ఇందులో 2,291.65 కోట్లు ప్రగతి పద్దు, 64.19 కోట్లు నిర్వహణ పద్దుగా ఉన్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క రూపాయికే కిలో చొప్పున ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది రేషన్ లబ్ధిదారులకు (ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున) బియ్యం అందిస్తున్నది. తెలంగాణలో 2.8 కోట్లమంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. ఇందుకోసం ప్రతినెలా 1.79 లక్షల మెట్రిక్ టన్నులను పీడీఎస్ కింద ప్రభుత్వం సరఫరాచేస్తున్నది. అంత్యోదయ అన్నయోజన కింద రూపాయికి కిలో చొప్పున లబ్ధిదారులకు 35 కిలోల బియ్యం అందజేస్తున్నది. దీంతోపాటు ఇతర లబ్ధిదారులకు కూడా సరుకులను అందిస్తున్నది.

# బలహీనవర్గాలకు భరోసా

- బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రగతికి రూ.30,663 కోట్లు
- ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 500 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 2020-21 వార్షిక బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి రూ.30,663.06 కోట్లు కేటాయించారు. ఇందులో కల్యాణలక్ష్మి పథకానికి రూ.2,240 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమం, విద్యాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అంశాలకు ఐదేండ్లుగా (2019-20 ఆర్థిక సంవత్సరం ఆరునెలల బడ్జెట్‌తోపాటు) కేటాయించిన బడ్జెట్, 2020-21 సంవత్సరానికి కేటాయించిన బడ్జెట్ వివరాలు..

### కేటాయింపులు ఇవీ..

| శాఖలవారిగా | 2016-17 రూ.కోట్లల్లో | 2017-18 రూ.కోట్లల్లో | 2018-19 రూ.కోట్లల్లో | 2019-20 రూ.కోట్లల్లో | 2020-21 రూ.కోట్లల్లో |
|---|---|---|---|---|---|
| బీసీ సంక్షేమం | 2,537.51 | 5070.36 | 5,919.83 | 3,267.40 | 4,356.82 |
| ఎస్సీ ప్రత్యేక అభివృద్ధినిధి | 7,122.21 | 14,375.12 | 16452.79 | 2,753.88 | 16,534.97 |
| ఎస్టీ ప్రత్యేక అభివృద్ధినిధి | 3752.37 | 8,165.88 | 9693.11 | 1,898.68 | 9,771.27 |
| మొత్తం | 13,412.09 | 27,611.36 | 32,065.73 | 7,919.96 | 30,663.06 |

**2020-21 వార్షిక బడ్జెట్లో సంక్షేమశాఖలకు కేటాయించిన బడ్జెట్లో ప్రధానాంశాలు**

- ఎస్సీల అభివృద్ధి నిధి కోసం రూ.16,534.97 కోట్లు
- ఎస్టీల అభివృద్ధి నిధి కోసం రూ.9,771.27 కోట్లు
- బీసీల సంక్షేమానికి రూ.4,356.82 కోట్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూ.2,650కోట్లు
- కల్యాణలక్ష్మి పథకానికి రూ.2,240కోట్లు
- ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.500కోట్లు
- ఎస్సీ అభివృద్ధిశాఖకు రూ.2,610.19కోట్లు
- గిరిజన సంక్షేమశాఖ రూ.2,286కోట్లు
- ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్ కోసం రూ.338కోట్లు

## ఆర్టీసీకి అందలం

- రూ.1,000 కోట్లు కేటాయింపు




బడ్జెట్ కేటాయింపుల్లో ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం అందలం వేసింది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాలబాటలో నడిపించేందుకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించి భరోసా కల్పించింది. బడ్జెట్‌లో రూ.1000 కోట్లు ప్రతిపాదించింది. గత బడ్జెట్‌లో ఆర్టీసీ అభివృద్ధి, నిర్వహణ వ్యయం కోసం రూ.630 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో అదనంగా రూ.370 కోట్లు పెంచింది. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏండ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చే ఆర్టీసీ.. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన చర్యలతో లాభాలబాటలోకి వస్తున్నది. కార్గో, సర్వీసులను సైతం ప్రారంభించింది. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ఎంప్లాయీస్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నది.




## వైద్యరంగానికి రూ.6,185.96 కోట్లు

**గతేడాదితో పోలిస్తే రూ.491.79 కోట్లు అధికం**

**కేసీఆర్ కిట్ల పథకం అమలుకు రూ.480 కోట్లు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజారోగ్య పరిరక్షణలో తెలంగాణ ప్రగతి సాధిస్తున్నది. వైద్యరంగంలో అనూహ్యమైన మార్పులు తీసుకొస్తున్నది. అధునాతన సౌకర్యాలు కల్పిస్తూ వైద్యసేవలు అందిస్తున్నది. సర్కారు వైద్యం పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచిన ప్రభుత్వం.. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో వైద్యరంగానికి భారీగా నిధులు కేటాయించింది. గతేడాది రూ.5,694.17 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.6,185.96 కోట్లు ప్రతిపాదించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు 491.79 కోట్లు అధికంగా ప్రతిపాదించారు. దీంతో మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ల పథకం అమలు కోసం ప్రస్తుత బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.480 కోట్లు కేటాయించారు.

### 25వేలలోపు రుణాలు

# నెలాఖరులోగా మాఫీ

**ఎమ్మెల్యేల చేతుల మీదుగా 5.85లక్షల మందికి చెక్కుల పంపిణీ**

**మిగిలిన రుణమాఫీ నాలుగు విడుతలుగా విడుదల**

**కేంద్రం నిధులు ఇవ్వకున్నా సంక్షేమానికి కోత విధించలేదు**

**ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోనే అప్పులు ● ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు వెల్లడి**



ఆదివారం అసెంబ్లీ కమిటీహాల్‌లో సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను విడుదలచేస్తున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి రొనాల్డ్ రాస్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతు రుణమాఫీకి సంబంధించి ముందుగా రూ.25వేలలోపు వారికి ఈ నెలాఖరులోగా చెక్కులు అందజేయనున్నట్టు ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేల ద్వారా ఈ చెక్కులను పంపిణీచేస్తామని చెప్పారు. అసెంబ్లీలో ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం కమిటీహాల్‌లో ఆయన 'సామాజిక, ఆర్థిక సర్వే - 2020'ని విడుదల చేశారు.

చట్టప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడంలేదని హరీశ్‌రావు చెప్పారు. 2019-20 సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి నాటికి రూ.3196కోట్లు రావాల్సి ఉందని, కానీ రూ.2263కోట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. పన్నుల వాటా బదలాయింపులో రూ.4595కోట్లు తగ్గాయన్నారు. 15వ ఆర్థికసంఘం సిఫారసుల ద్వారా రూ.2384కోట్లు తగ్గుతాయని అంచనా వేశామన్నారు. ఆర్థికసంఘం రూ.730కోట్లు గ్రాంట్‌గా రాష్ట్రానికి ఇవ్వాలని సిఫారసు చేసిందని, వాటిని కేంద్రం విడుదల చేయడం లేదని తెలిపారు.

**జీఎస్టీ బకాయిలు రావాలి**

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రూ.25వేలలోపు రుణమాఫీకి అర్హులైన రైతులు 5.86 లక్షలమంది ఉన్నారని చెప్పారు. రుణమాఫీపై ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలుచేయాలని సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. మిగిలిన రుణమాఫీని నాలుగు విడుతలుగా చెక్కులు అందజేస్తామని చెప్పారు. వ్యాట్‌కు సంబంధించిన పలు కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిని వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరిస్తే నిధులు వస్తాయని చెప్పారు. అంతర్గత ఆదాయాన్ని పెంచుకోవాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోనే అప్పులు తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి రూ.50 వేలకోట్లు అవసరమని, ఇందుకు సాయంచేయాలని కేంద్రాన్ని కోరినా స్పందనరాలేదని చెప్పారు. దీంతో రాష్ట్రప్రభుత్వమే నిధులు వెచ్చించాలని నిర్ణయించిందన్నారు.

### సంక్షేమానికి కోత విధించలేదు

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలకు నిధులను భారీగా కేటాయించామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. నిధుల విడుదలలో కేంద్రం కోతవిధించినా, తాము సంక్షేమరంగానికి ఒక్కపైసా కోతపెట్టలేదని చెప్పారు. ఆసరా పింఛన్లకు గత సంవత్సరం కంటే 25 శాతం అధికంగా నిధులు కేటాయించామన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.553 కోట్లు అదనంగా కేటాయించామని, ఆర్థికమాంద్యం నేపథ్యంలో పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రూ.1500 కోట్లు కేటాయించామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు ఖాళీస్థలాలు ఉన్న పేదలు ఇండ్లు కట్టుకుంటే ఆర్థిక సాయమందించడానికి లక్షమందికి బడ్జెట్‌లో 10,500 కోట్లు కేటాయించామన్నారు.

### జోరుమీదున్న రియల్ ఎస్టేట్

రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం పెద్ద పరిశ్రమగా విస్తరించిందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. నిరర్థక ఆస్తులను విక్రయించాలని నిర్ణయించామని, రాజీవ్‌స్వగృహ, హౌసింగ్‌బోర్డు ఇండ్లు, భూములు, దిల్ భూముల విక్రయం ద్వారా నిధులు సమకూర్చుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవడానికి కేసులు వేసి గెలిచామని, ఆ భూములను విక్రయిస్తామన్నారు. సమావేశంలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్థిక సలహాదారు జీఆర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శులు రొనాల్డ్ రాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీలకు మరింత భరోసా

- **సంక్షేమం కోసం రూ.1,518 కోట్లు కేటాయింపు**
- **గతంలోకంటే రూ.150 కోట్లు అదనం**

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** మైనార్టీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. వారి సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.1518.06 కోట్లు కేటాయించింది. క్రితంసారితో పోలిస్తే ఈసారి రూ.150 కోట్లు అదనం. మైనార్టీ విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించేందుకు 204 గురుకులాలను ఏర్పాటుచేసింది. ఈ ఏడాది నుంచి గురుకులాలను జూనియర్‌కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసింది. మసీదుల్లో ప్రార్థనలు జరిపే ఇమాం, మౌజన్‌లకు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవభృతిని అందిస్తున్నది. రంజాన్, క్రిస్మస్ పండుగలకు కొత్తబట్టలు పంపిణీచేసి వారిలో ఆనందాన్ని నింపుతున్నది. మైనార్టీ యువత స్వయంఉపాధికోసం అనేక ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టింది. అనాథ మైనార్టీ పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు నాంపల్లిలో అనీస్ ఉల్ గుర్బా భవనాన్ని నిర్మిస్తున్నది. ప్రతి ఏడాది హజ్‌యాత్ర కోసం కోట్ల రూపాయలను కేటాయిస్తున్నది.



## కల్యాణలక్ష్మికి 50% అదనంగా నిధులు

**గత ఏడాది కంటే 700 కోట్లు ఎక్కువ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కల్యాణలక్ష్మి పథకానికి 2020-21 ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కంటే 50 శాతం అదనంగా నిధులు కేటాయించారు. దీంతో అదనంగా 70 వేల మందికి లబ్ధి చేకూరనున్నది. ఈ పథకానికి గత ఏడాది రూ.1,540 కోట్లు కేటాయించగా... ఈసారి బడ్జెట్లో రూ. 2,240కోట్లు ప్రతిపాదించారు. గత ఏడాది కంటే రూ.700కోట్లు అదనంగా కేటాయించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆడపిల్లల పెండ్లిళ్లు చేసేందుకు ఇబ్బంది పడుతుండటంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాల కింద రూ.51వేల ఆర్థిక సాయం చేసేవారు. 2017లో రూ. 75,116కు, 2018లో రూ.1,00,116కు పెంచారు




వరంగల్‌లో టెక్ మహీంద్రా ఐటీ కంపెనీ శాఖను ప్రారంభిస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్ (ఫైల్)

## పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం

**రాయితీలు, ప్రోత్సాహకాలకు రూ.1,500 కోట్లు**

**మొత్తం రూ.1,998 కోట్లు కేటాయింపు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిశ్రమలశాఖకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1998.19 కోట్లు కేటాయింపులు చేసింది. రూ.329.98 కోట్లు నిర్వహణ పద్దుకు, రూ.1,668.21 కోట్లు ప్రగతి పద్దులకు కేటాయించింది. ప్రగతి పద్దులో రూ.1,500 కోట్లు ప్రోత్సాహకాలను అందించనున్నది. పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలకు గత ఏడాది రూ.75 కోట్లు ప్రకటించింది. ఆర్థికమాంద్యం నేపథ్యంలో పరిశ్రమల స్థాపన తగ్గితే ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రోత్సాహకాలను అందించాలని నిర్ణయించింది. ప్రగతి పద్దులో గనులశాఖకు రూ.76.29 కోట్లు, గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహించడానికి రూ.1,132 కోట్లు కేటాయించింది. గనులశాఖ ప్రగతి పద్దులకు రూ.52 కోట్లు, నాన్ ఫెర్రాయిస్ మైనింగ్, మెటలర్జికల్ ఇండస్ట్రీస్‌కు రూ.76.29 కోట్లు కేటాయించింది. పరిశ్రమలశాఖకు దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని ఎఫ్‌టీసీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు రమాకాంత్ ఇనాని అన్నారు. ఈ నిర్ణయంతో పరిశ్రమవర్గాలకు భారీ ఊరట లభించినట్టయిందని చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.10 కోట్లు ఖర్చుచేయడం పరిశ్రమలవర్గాలకు పరోక్షంగా ఉపయోగపడుతుందన్నారు. బడ్జెట్‌లో పరిశ్రమలకు పెద్దఎత్తున నిధులు కేటాయించినందుకు ప్రభుత్వానికి టీఐఎఫ్ అధ్యక్షుడు కే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. టీఎస్‌ఐపాస్ ద్వారా పురోగమన దశలో ఉన్న పారిశ్రామికరంగానికి ఈ కేటాయింపులు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయని చెప్పారు.

# నిర్వహణ నిధుల ఎత్తిపోత

**సాగునీటి బడ్జెట్‌లో పెరిగిన నిర్వహణ పద్దు**

**పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా ప్రాజెక్టుల ఫలాలు**

**నీటిపారుదలరంగానికి రూ.11,053.55 కోట్లు**

**రుణాల ద్వారా మరో రూ.20 వేల కోట్ల సమీకరణ**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాగునీటి ప్రాజెక్టులపై వెచ్చించే మొత్తం ఖర్చుకిందకు రాదు.. అది భావితరాల కోసం మనం పెట్టే పెట్టుబడి వ్యయమంటూ సీఎం కేసీఆర్ చెప్పే మాటలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గత ఆరేండ్లుగా సాగునీటిరంగానికి పెద్దపీట వేస్తూ వస్తున్నది. సంక్షేమంతోపాటు, ఇతరరంగాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే.. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం తగ్గకుండా నిధులను సమీకరిస్తూనే ఉన్నది. ప్రస్తుతం పలు ప్రాజెక్టులు పూర్తికావడంతోపాటు, మరికొన్ని చివరిదశలో ఉండటంతో వాటి నిర్వహణపై ప్రధానంగా దృష్టి సారించింది. కీలకమైన కాళేశ్వరం ఎత్తిపోతలు సహా పలు ప్రాజెక్టులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వాటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవకుండా ముందుచూపు ప్రదర్శించింది. సాగునీటిరంగ కేటాయింపుల్లో తొలిసారిగా ప్రగతిపద్దు కంటే నిర్వహణపద్దుకే అధిక ప్రాధాన్యమిచ్చింది. మరోవైపు ఆర్థికసంస్థల ద్వారా రుణాల సమీకరణతో ప్రాజెక్టు పనులను కొనసాగించాలని ప్రణాళిక రూపొందించింది. ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ. 11,053.55 కోట్లు కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ.7,446.97 కోట్లు ఉండగా.. ప్రగతి పద్దు కింద రూ.3,606.58 కోట్లుగా చూపింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, భక్త రామదాసు, దేవాదుల, ఏఎమ్మార్పీతోపాటు పలు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటివిడుదల కొనసాగుతున్నది. గతేడాది కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కూడా అందుబాటులోకి వచ్చి రైతులకు ఫలాలు అందిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సీతారామ తర్వాత పాలమూరు-రంగారెడ్డి, డిండి తదితర ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టుల నిర్వహణ అత్యంత కీలకంగా మారనున్నది. దీనిని దృష్టిలో పెట్టుకుని సాగునీటి కేటాయింపుల్లో ప్రభుత్వం నిర్వహణ పద్దుకు ప్రాధాన్యమిచ్చింది.

**ప్రాజెక్టులకు కేటాయింపులు** (రూ.కోట్లల్లో...)

| | |
|---|---|
| కాళేశ్వరం | 805.47 |
| పాలమూరు-రంగారెడ్డి | 368.58 |
| సీతారామ ప్రాజెక్టు | 910.62 |
| దేవాదుల | 292.38 |
| ఎస్సారెస్పీ వరద కాల్వ | 131.37 |
| ఎస్సారెస్పీ రెండోదశ | 94.81 |
| తుపాకులగూడెం | 73.83 |
| దిగువ పెన్‌గంగ | 72.08 |
| డిండి | 56.05 |
| ఎల్లంపల్లి | 28.06 |
| ఎస్సారెస్పీ-1 | 25.52 |
| ఆర్డీఎస్ | 19.35 |

### రుణాలతో 'భారీ' మొత్తమే..

తాజా బడ్జెట్‌లో సాగునీటిరంగానికి రూ.11,053.55 కోట్లు కేటాయింపులు చేపట్టగా... 2020-21 ఆర్థిక సంవత్సరంలో వివిధ కార్పొరేషన్ల రుణాల ద్వారా మరో రూ.20 వేల కోట్ల వరకు నిధుల సమీకరణకు నీటిపారుదలశాఖ ప్రణాళిక రూపొందించినట్టు తెలిసింది. వాస్తవంగా 2019-20 బడ్జెట్‌లో సాగునీటిరంగానికి ప్రభుత్వం రూ.8,476.17 కోట్లు కేటాయించింది. కానీ, కార్పొరేషన్ల ద్వారా ఈ ఏడాది జనవరి వరకే పది వేలకోట్ల రూపాయలకుపైగా రుణాలను సమీకరించింది. బడ్జెట్ కేటాయింపుల్లోని రూ.8079.83 కోట్లల్లో రూ.6670.05 కోట్లు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకే వెచ్చించగా.. రుణాల ద్వారా రీడిజైనింగ్ ప్రాజెక్టుల పనులకు ప్రాధాన్యమిచ్చింది. అటు బడ్జెట్, ఇటు రుణాలను సమతూకం చేసుకుంటూ ముందుకెళుతుండటంతో ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వచ్చి సాగుభూముల విస్తీర్ణం నానాటికీ పెరుగుతున్నది. ఈ ఏడాది కూడా సేకరించిన రుణాలతో ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మూ డోటీఎంసీ తరలింపునకు పనులు చేపట్టడంతోపాటు, మల్లన్నసాగర్ తదితర రిజర్వాయర్లు కూడా పూర్తి చేయాల్సి ఉన్నది. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.13వేల నుంచి 15 వేలకోట్ల మేర రుణా లు తీసుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం. పాలమూరు-రంగారెడ్డి పథకం ద్వారా త్వరితగతిన ఒక టీఎంసీ తరలింపు లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. ఇలా ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కార్పొరేషన్లద్వారా మరో రూ.5వేల కోట్ల వరకు రుణాలను సేకరించాలని చూస్తున్నారు.




## శాంతిభద్రతలు మరింత పక్కాగా

- **పోలీస్‌శాఖకు రూ.5,851.96 కోట్లు**
- **గతంకంటే రూ.862 కోట్లు అదనం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ, పోలీస్‌శాఖ బలోపేతానికి ఊతమిచ్చేలా బడ్జెట్‌లో కేటాయింపులను పెంచారు. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే పోలీస్‌శాఖకు ఈ బడ్జెట్‌లో రూ.862.29 కోట్ల నిధులు పెరిగాయి. గత బడ్జెట్‌లో రూ.4,989.67 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో రూ.5,851.96 కోట్లకు పెరిగాయి. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ.5,179.22 కోట్లు, ప్రగతిపద్దు కింద రూ.672.74 కోట్లు ఇచ్చారు. గత బడ్జెట్‌లో కేటాయింపుల్లోనూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. పోలీస్‌శాఖ ఆధునీకరణ, శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చుచేసింది. శాంతిభద్రతల నిర్వహణ మరింత సమర్థంగా ఉండేందుకు అంతర్జాతీయస్థాయిలో హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు.



ప్రగతిభవన్‌లో తనను కలిసిన మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీతారెడ్డి, హరిప్రియానాయక్, రేఖానాయక్, టీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణిలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్

## మహిళలు రాణిస్తేనే సమాజాభివృద్ధి

**సీఎం కేసీఆర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలకు సీఎం కేసీఆర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. మహిళలు స్వయంసమృద్ధి సాధించి, పురోగమించాలని ఆకాంక్షించారు. మహిళలకు యావత్ సమాజం అండగా నిలవాలని కోరారు.

## ఎర్త్‌లింగ్స్ ఎన్జీవోకు మంత్రి కేటీఆర్ అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎకోఫ్రెండ్లీ ప్రొడక్టుల ప్రచారంలో భాగంగా ఎర్త్‌లింగ్స్ ఎన్జీవో ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఎర్త్‌లింగ్స్ ఎన్జీవో చేసిన మంచిపనిని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శనివారం ట్విట్టర్‌లో అభినందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం చాలాగొప్ప కార్యక్రమం చేశారని కేటీఆర్ ప్రశంసించారు.

# విద్యకు భారీగా నిధులు

**రూ.12,144.27 కోట్లు కేటాయింపు**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యాశాఖకు భారీగా నిధులు పెంచారు. బడ్జెట్‌లో పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖలకు కలిపి రూ.12,144.27 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌లో విద్యాశాఖకు 9,899.79 కోట్లు కేటాయించారు. ఈసారి అదనంగా 2,244.96 కోట్లు పెంచారు. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ రూసా పథకానికి రూ.14.73 కోట్లు ప్రతిపాదించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి రూ.365.55 కోట్లు కేటాయించారు. వారంలో మూడ్రోజులు విద్యార్థులకు కోడిగుడ్ల కోసం రూ.63.63 కోట్లు ప్రతిపాదించారు. తెలంగాణ గురుకుల విద్యాలయాలకు రూ.135.99 కోట్లు, సమగ్రశిక్ష అభియాన్ పథకానికి రూ.623.48 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షఅభియాన్ కింద రూ.300 కోట్లు ప్రతిపాదించారు.

**వర్సిటీలవారీగా నిధుల కేటాయింపు ప్రతిపాదనలు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| ఉస్మానియా యూనివర్సిటీ | రూ.343.58 |
| కాకతీయ యూనివర్సిటీ | రూ.88.28 |
| తెలంగాణ యూనివర్సిటీ | రూ.26.38 |
| మహాత్మాగాంధీ యూనివర్సిటీ | రూ.21.63 |
| శాతవాహన యూనివర్సిటీ | రూ.9.66 |
| పాలమూరు యూనివర్సిటీ | రూ.7.36 |
| జేఎన్టీయూహెచ్ | రూ. 33.02 |
| జేఎన్‌యూ ఎఫ్‌ఏ | రూ.18.02 |
| బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ | రూ.11.59 |
| పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ | రూ.27.88 |
| జేఎన్టీయూ కాలేజీ కరీంనగర్ (కొత్తది) | రూ.5.59 |
| జేఎన్టీయూ సుల్తాన్‌పూర్ | రూ.5.16 |

**విద్యాశాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)**

| శాఖ | నిర్వహణ పద్దు | ప్రగతి పద్దు | మొత్తం నిధులు కేటాయింపు |
|---|---|---|---|
| పాఠశాల విద్యాశాఖ | 9,113.10 | 1,292.19 | 10,405.29 |
| ఉన్నత విద్యాశాఖ | 1,372.95 | 79.08 | 1,452.03 |
| సాంకేతిక విద్యాశాఖ | 265.08 | 5.15 | 270.23 |
| | 10,751.13 | 1,376.42 | 12,127.55 |



“ ప్రభుత్వం ఆర్టీసీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించటం సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్ ఆర్టీసీ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులతో డిపోల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయి. కండక్టర్లు, డ్రైవర్లకు మరింత లబ్ధి చేకూరుతుంది.

- అంకది మల్లేశ్, డ్రైవర్, మహబూబాబాద్ డిపో

# ఆర్థిక సర్వే ₹O₹O

“ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని మహా కవి దాశరథి నినదిస్తే... నా తెలంగాణం కోటి ఎకరాల మాగాణం కావాలని కేసీఆర్ స్వప్నించారు. ఈ కల నెరవేరేందుకు అహరహం శ్రమిస్తున్నారు. కృష్ణా గోదావరిలో నీటిని సమగ్రంగా వినియోగించుకునేందుకు ప్రాజెక్టులను రీడిజైన్ చేశారు.

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



# వృద్ధిరేటులో టాప్

## రూ.9,69,604 కోట్లకు పెరిగిన రాష్ట్ర సంపద

- తలసరి ఆదాయం రూ.2.28లక్షలు
- జీడీపీలో పెరిగిన తెలంగాణ వాటా
- సామాజిక, ఆర్థిక సర్వే గణాంకాలు వెల్లడి

**2012-13 నుంచి 2019-20 వరకు తెలంగాణ జీఎస్డీపీ, కేంద్ర జీడీపీ వృద్ధిరేటు వివరాలు**

| సంవత్సరం | ప్రస్తుత ధరల వద్ద వృద్ధిరేటు శాతం | | స్థిరధరల వద్ద వృద్ధిరేటు శాతం | | దేశ సంపదలో రాష్ట్ర వాటా |
|---|---|---|---|---|---|
| | తెలంగాణ | కేంద్రం | తెలంగాణ | కేంద్రం | |
| 2012-13 | 11.7 | 13.8 | 3.0 | 5.5 | 4.11 |
| 2013-14 | 12.4 | 13.0 | 5.4 | 6.4 | 4.02 |
| 2014-15 | 12.0 | 11.0 | 6.8 | 7.4 | 3.98 |
| 2015-16 | 14.2 | 10.5 | 11.6 | 8.0 | 3.95 |
| 2016-17 | 13.9 | 11.8 | 9.4 | 8.2 | 4.09 |
| 2017-18 | 14.4 | 11.1 | 10.2 | 7.2 | 4.13 |
| 2018-19 | 14.3 | 11.0 | 10.5 | 6.8 | 4.38 |
| 2019-20 | 12.6 | 7.5 | 8.2 | 5.0 | 4.52 |




**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సంపద ఈ ఏడాది కూడా గణనీయంగా పెరిగింది. దేశంలో అగ్రభాగాన నిలుస్తున్న తెలంగాణలో తలసరి ఆదాయం కూడా వేగంగా పెరుగుతున్నది. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన ఐదేండ్లలోనే తెలంగాణ మొత్తం సంపద లేదా జీఎస్డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.9,69,604 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో తెలంగాణ మొత్తం సంపద ప్రస్తుత ధరల వద్ద రూ.8,61,031 కోట్లుగా ఉన్నది. గతేడాది తెలంగాణలో 14.3 శాతంగా నమోదైన జీఎస్డీపీ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో 12.6 శాతానికి తగ్గినప్పటికీ రాష్ట్ర సంపద మరో రూ.1,08,573 కోట్ల మేరకు పెరిగింది. ఇదే సమయంలో జాతీయ సగటు వృద్ధిరేటు 11 శాతం నుంచి 7.5 శాతానికి తగ్గడం గమనార్హం. స్థిర ధరల ప్రకారంగా చూస్తే మన రాష్ట్ర సంపద రూ.6,12,828 కోట్ల నుంచి రూ.6,63,258 కోట్లకు పెరిగింది. కానీ, గతేడాది 9.5 శాతంగా జీఎస్డీపీ వృద్ధిరేటు ఈసారి 8.2 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో కేంద్ర జీడీపీ 6.1 శాతం నుంచి 5 శాతానికి పడిపోయింది. అంటే తెలంగాణ వృద్ధిరేటు దేశ సగటు కంటే 3.2 శాతం ఎక్కువగా ఉండటం విశేషం.


### తలసరి ఆదాయం 11.6 శాతం వృద్ధి

మరోవైపు రాష్ట్ర తలసరి ఆదాయం వేగంగా వృద్ధి చెందతున్నది. గతేడాది రూ.2,04,488గా ఉన్న తెలంగాణ తలసరి ఆదాయం ఈ ఏడాది 11.6 శాతం వృద్ధిరేటుతో రూ.2,28,216కు పెరిగింది. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం రూ.1,35,050కి, వృద్ధిరేటు 6.4 శాతానికి పరిమితమైంది. గత కొన్నేండ్ల నుంచి తెలంగాణ సంపద అంచనాలను మించి పెరుగుతున్నట్టు తాజాగా వెలువడిన ఆర్థిక, సామాజిక సర్వే నివేదిక-2020 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ టాప్

ప్రస్తుత ధరల వద్ద మొత్తం సంపద వృద్ధిరేటులో తెలంగాణ మిగిలిన పెద్ద రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలిచింది. ఐదేండ్లుగా మన రాష్ట్రం 14.2 శాతం సగటు వృద్ధిరేటును సాధించింది. తెలంగాణ తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్, కర్ణాటక, హర్యానా నిలిచాయి. ఈ రాష్ట్రాల వృద్ధిరేటు 13 శాతం లోపే ఉన్నది. చిన్న రాష్ట్రాలైన సిక్కిం, త్రిపుర 14.4 శాతం వృద్ధిరేటుతో తెలంగాణ కంటే కాస్త ముందున్నాయి. స్థిర ధరల ప్రకారంగా చూస్తే.. గత ఐదేండ్లలో మన రాష్ట్రం 10.2 శాతం వృద్ధిరేటుతో పెద్ద రాష్ట్రాల్లో ద్వితీయ స్థానంలో ఉన్నది. ఈ జాబితాలో ఒక్క కర్ణాటక మాత్రమే 11 శాతం వృద్ధిరేటుతో తెలంగాణ కంటే ముందున్నది. మరోవైపు జాతీయ సంపదలో తెలంగాణ వాటా క్రమంగా పెరుగుతున్నది. గతంలో 3 నుంచి 4 శాతం లోపే ఉన్న తెలంగాణ వాటా గతేడాది 4.29 శాతానికి, ఈ ఏడాది 4.52 శాతానికి పెరుగడం విశేషం.




## బాలరక్షతో భరోసా

**తెలిసీ** తెలియని వయస్సులో నేరంచేసిన చిన్నారుల భవిష్యత్ అంధకారం కాకుండా సర్కారు చూస్తున్నది. బాలరక్ష భవన్ల పేరుతో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో వారిని తీర్చిదిద్దుతున్నది. జువెనైల్‌హోంలలో ఉన్నవారికి కౌన్సెలింగ్‌తోపాటు న్యాయ, వైద్య సా యం ఒకేచోట అందేలా రాష్ట్ర ప్రభుత్వం బాలరక్ష భవన్లు ఏర్పాటుచేసింది. వీటిద్వారా గతేడాది 1,044 మందికి సాయం అందించినట్టు సామాజిక ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించింది. ఈ చిన్నారులు భవిష్యత్తులో తమకాళ్లపై తాము నిలబడేందుకు వృత్తివిద్యలోనూ శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే 111 మంది చిన్నారులకు గ్యాస్ వెల్డింగ్, ఆటోమొబైల్ రిపేరింగ్, డ్రైవింగ్, కంప్యూటర్‌సహా పలు కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగం గా ‘నేను సైతం’ ప్రాజెక్టు కింద మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 5.44 లక్షల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసినట్టు సామాజిక ఆర్థికసర్వే నివేదిక వెల్లడించింది. మహిళల భద్రతలో భాగంగా రాచకొండ సీపీ పరిధిలో ‘షీ ఫర్ హర్’ పేరిట వెయ్యిమంది వలంటీర్లను షీటీమ్స్ సిబ్బంది సహకారంతో ఏర్పాటుచేశారు.



## లక్షకోట్లు దాటిన ఐటీ ఎగుమతులు

**తెలంగాణ** 2018-19లో ఐటీ ఎగుమతుల్లో రూ.1.09 లక్షల కోట్ల ఎగుమతులతో 17% వృద్ధిరేటు సాధించిం ది. ఐటీ ఎగుమతుల్లో జాతీయ వృద్ధి రేటు 7.8% ఉండగా.. తెలంగాణ వృ ద్ధిరేటు దానికి రెట్టింపు కన్నా ఎక్కువ గా ఉన్నదని ‘సామాజిక ఆర్థిక సర్వే’ నివేదిక స్పష్టంచేసింది. మొత్తం ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 11 శాతంగా ఉన్నదని తెలిపింది. ఐటీరంగం ద్వారా పెద్దమొత్తంలో ఆదా యం పొందుతున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2014-15లో రూ.60 వేల కోట్ల ఐటీ ఎగుమతులను సాధించగా, 2018-19 కల్లా రూ.1.09 కోట్లకు చేరుకొన్నది. ఐదేండ్లలో ఐటీరంగం ద్వారా ఉపాధి కల్పనలో 9.9% వృద్ధి రేటు సాధించింది. స్టార్టప్‌లకు చేయూత అందించేందుకు టీ హబ్‌ను, మహిళలను పారిశ్రామికరంగంవైపు ప్రోత్సహించేలా వీహబ్‌ను ప్రారంభించి ఆ దిశగా కృషిచేస్తున్నది. ద్వితీయ శ్రేణినగరాలకు ఐటీని విస్తరించడంలో భాగంగా వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో సంస్థల ఏర్పాటుకు కృషి జరుగుతున్నది.



ఆదివారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

# పట్టణాభివృద్ధిలో జోరు

- సాక్షాత్కరిస్తున్న ఆధునిక సంస్కరణల ఫలితం
- మెరుగ్గా మౌలిక సదుపాయాల అభివృద్ధి
- రాష్ట్రంలో పట్టణ జనాభా 41.20 శాతం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణ ప్రాంతాల ప్రాముఖ్యతను ముందే గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టి, అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నదని సామాజిక, ఆర్థిక సర్వే- 2020 వెల్లడించింది. పట్టణాల్లో ప్రజలు నివసించడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రశాంత వాతావరణాన్ని కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందని పేర్కొన్నది. దేశంలో అతి వేగంగా పట్టణాలు అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల సరసన తెలంగాణ ప్రముఖంగా నిలుస్తున్నదని తెలియజేసింది. హైదరాబాద్‌తోపాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ వంటి నగరాలు తెలంగాణ పట్టణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. రాష్ట్రంలో పట్టణ జనాభా 41.20శాతానికి చేరుకున్నది.

### పట్టణాల్లో ఆధునిక ఆవిష్కరణలు

పట్టణాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు ఆధునిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, వరద నీటి కాల్వలు, ఘనవ్యర్థాల నిర్వహణ, వాటి రవాణాను చేపట్టడానికి ప్రణాళికలు రచించింది. దాదాపు రూ.980.16 కోట్లతో 32 ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో రూ.730.28 కోట్లతో చేపట్టిన 27 ప్రాజెక్టులు పూర్తిచేసింది. స్మార్ట్ సిటీలో భాగంగా జీహెచ్‌ఎంసీ, వరంగల్‌లో రూ.4,135 కోట్లతో 140 ప్రాజెక్టులకు ప్రణాళికలు రచించారు. ఇవి వివిధస్థాయిల్లో ఉన్నాయి. అమృత్‌లో భాగంగా రూ.1,666 కోట్లతో 66 ప్రాజెక్టులు మంజూరు కాగా, 25 పూర్తయ్యాయి. 40 నిర్మాణదశలో ఉన్నాయి. యువకులకు నైపుణ్య శిక్షణ, వడ్డీలేని రుణాలను అందజేస్తున్నది. 2018-19నాటికి రూ.2.45 కోట్లను కేటాయించింది. మూసీ తీర ప్రాంతం అభివృద్ధికి పనులను మొదలుపెట్టింది. వర్షాకాలంలో నీరు సులువుగా ప్రవహించేందుకు ముస్లిం జంగ్ బ్రిడ్జి వద్ద 3,900 క్యూబిక్ మీటర్ల మట్టిని, 130 క్యూబిక్ మీటర్ల చెత్తచెదారాన్ని తొలగించింది. యాదాద్రి, వేములవాడ ఆలయ పట్టణ ప్రాంతాలను వృద్ధి చేయడానికి నడుం బిగించింది.

## పల్లెలకు కొత్తందాలు

**పల్లెప్రగతిలో విస్తృతమైన ప్రజాభాగస్వామ్యం • ఊరికోసం ముందుకొచ్చిన దాతలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రెండువిడుతల్లో నిర్వహించిన పల్లెప్రగతి గ్రామాల రూపురేఖలు మార్చిందని సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక- 2020 స్పష్టమైంది. పల్లెప్రగతిలో విస్తృతమైన ప్రజాభాగస్వామ్యం కల్పించారని ప్రశంసించింది. దీంతో గ్రామాలు శుభ్రంగా మారాయని, ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉండటం అభినందనీయమని పేర్కొన్నది. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు శుభ్రంగామారాయని, నిరంతర బ్లీచింగ్‌తో మురుగు కాల్వలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయని తెలిపింది. 12,751 గ్రామాల్లో 8,01,619 మంది శ్రమదానం చేశారని ప్రశంసించింది. పల్లెప్రగతి సందర్భంగా చేపట్టిన ప్రధానమైన నర్సరీలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు తుదిదశకు చేరుతున్నాయి. 11,438 గ్రామాల్లో నర్సరీలు పూర్తయ్యాయి. ఈ నర్సరీలలో 12.86 కోట్ల మొక్కలు పెరుగుతున్నాయి. మొత్తం 19,057 రహదారులుండగా.. 55,446 కిలోమీటర్ల పరిధిలో 84.40 లక్షల మొక్కలు నాటారు.

### ప్రణాళికా సైన్యం భాగస్వామ్యం

గ్రామాల్లో ఏర్పాటుచేసిన స్టాండింగ్ కమిటీలు మంచి ఫలితాలు ఇచ్చాయని సర్వే పేర్కొన్నది. ప్రతి గ్రామంలో 60 నుంచి 80 మందితో ప్రణాళిక సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు ప్రత్యేక కమిటీలను నియమించుకున్నారు. ఈ సైన్యం గ్రామాల్లో శ్రమదానం చేస్తూ పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకున్న తీరును సర్వే అభినందించింది.

# సర్కారు వైద్యం సూపర్

- అన్ని అంశాల్లో గణనీయమైన పురోగతి
- సర్జరీ, ఇన్, ఔట్ పేషంట్ల సేవల్లో 100శాతానికి పైగా ఫలితాలు
- నవజాత శిశువుల సంరక్షణకు న్యూ బార్న్ కేర్ యూనిట్లు
- సామాజిక, ఆర్థిక సర్వే ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ, రాష్ట్రాల పరిధిలో వాస్తవ లెక్కలతో నిర్వహించే సామాజిక, ఆర్థిక సర్వే.. తెలంగాణ సర్కారు వైద్యరంగంలో చేపట్టిన చర్యలను ప్రశంసించింది. ఐదేండ్లుగా సర్కారు దవాఖానలు అందిస్తున్న వైద్యసేవల్లో పురోగతి సాధించినట్టు పేర్కొన్నది. ప్రధానంగా మాతాశిశు సంరక్షణకు కల్పించిన వైద్యసౌకర్యాలు, ప్రత్యేక కార్యక్రమాలను అభినందించింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) దవాఖానల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుతున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని తెలిపింది. మందుల పంపిణీ, శస్త్రచికిత్సల నిర్వహణ, సోలార్ విద్యుత్ వంటి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించడాన్ని మెచ్చుకున్నది.


### నిర్దేశించిన లక్ష్యానికి మించి సేవలు



‘2017-18 ఆర్థిక సంవత్సరంలో టీవీవీపీ దవాఖానల్లో 1,33,64,950 మంది ఔట్‌పేషంట్లకు సేవలు అందించాలని లక్ష్యం నిర్దేశించుకోగా.. 1,61,07,491 మంది సేవలు అందించి 121 శాతం ఫలితాన్ని సాధించారు. 11,93, 400 మంది ఇన్‌పేషంట్లకుగాను.. 13,55,653 మంది సేవలు అందించి 114 శాతం ఫలితాన్ని సాధించారు. 66,960 మందికి సర్జరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని 1,08,962 మందితో 163 శాతం లక్ష్యాన్ని చేరారు. 2018-19లో 1,28,82,550 మంది ఔట్ పేషంట్లకు1,63,70,246 మందికి సేవలు అందించి 127 శాతం ఫలితాన్ని పొందారు. ఇన్‌పేషెంట్లు 11,30,280 మంది లక్ష్యం కాగా, 14,22,149 మందికి సేవలు అందించి 126 శాతం ఫలితం సాధించారు. 60,720 సర్జీలు లక్ష్యంగా పెట్టుకోగా 1,19,454 పూర్తిచేసి 197 శాతం లక్ష్యం సాధించారు’ అని సర్వే ప్రశంసించింది.

### కంటివెలుగును కీర్తించిన సర్వే

అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ 2018 ఆగస్టు 15న ప్రారంభించిన ‘కంటి వెలుగు’ అమలుతీరును సర్వే ప్రత్యేకంగా కీర్తించింది. ఈ పథకం కింద 1.54 కోట్ల మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని, 22.93 లక్షల మంది రీడింగ్ అద్దాలు పొందారని, 18.14 లక్షల మంది ప్రత్యేక కంటి అద్దాలు తీసుకున్నారని తెలిపింది. 9.30 లక్షల మందిని కంటి ఆపరేషన్లకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నది.



### నవజాత శిశువుల కోసం

మాతాశిశు సంరక్షణ కోసం చేపట్టిన చర్యలను సోషియో ఎకనామిక్ సర్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. కేసీఆర్ కిట్ల పథకం అమలు ద్వారా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరుగడం, మాతా, శిశు మరణాల రేటు తగ్గించడాన్ని అభినందించింది. పుట్టిన శిశువులకు అనారోగ్య సమస్యలుంటే వారిని సంరక్షించేందుకు ప్రభుత్వ దవాఖానల్లో ఏర్పాటుచేసిన స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ల (ఎస్‌ఎన్‌సీయూ) అంశాన్ని ప్రస్తావించింది. ‘2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌ఎన్‌సీయూలలో 31,310 మంది శిశువులను అడ్మిట్‌చేసుకొని 23,550 సేవలు అందించి డిశ్చార్జిచేశారు. 3,824 మంది శిశువులను ఇతర దవాఖానలకు రెఫరల్‌చేశారు. 2019-20లో సెప్టెంబర్ 15 వరకు 15,273 మంది శిశువులను అడ్మిట్‌చేసుకొని 11,803 సేవలు అందించి డిశ్చార్జిచేశారు. 1,848 మంది శిశువులను ఇతర దవాఖానలకు రెఫరల్‌చేశారు’ అని వెల్లడించింది. సర్కారు దవాఖానకు వచ్చే రోగులకు అందించే మందుల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వినూత్నమని సర్వే ప్రశంసించింది.

# వ్యవసాయానికి ప్రాధాన్యం

- 25,811 కోట్లు కేటాయింపు
- రైతుబంధుకు అదనంగా రెండువేల కోట్లు
- వెయ్యికోట్లతో మార్కెట్ ఫండ్
- బడ్జెట్ ప్రసంగంలో హరీశ్‌రావు



**ఇవి కేటాయింపులు (రూ. కోట్లలో..)**

| కేటాయింపు | రూ. కోట్లలో |
|---|---|
| మొత్తం | 25,811 |
| రైతు బీమా | 1,141 |
| రైతుబంధు | 14,000 |
| రుణమాఫీ | 6,225 |
| డ్రిప్‌ఇరిగేషన్ | 600 |
| రైతువేదికలు | 350 |
| వ్యవసాయ మార్కెటింగ్ స్కీం | 1000 |
| పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖలు | 1586 |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయానికి ప్రాధాన్యం.. అన్నదాతకే అగ్రస్థానం దక్కింది. 2020-21 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధరంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. బడ్జెట్‌లో రూ. 25,811.78 కోట్లు కేటాయించింది. రైతుబంధు పథకానికి రూ. 14వేల కోట్లు కేటాయింగా, గతేడాదితో పోల్చితే ఇది రూ.2వేల కోట్లు అధికం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావడం, పంటల సాగువిస్తీర్ణం పెరుగడంతోపాటు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు కొత్త పాస్‌పుస్తకాల మంజూరు వల్ల రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య వచ్చే ఏడాది పెరుగనున్నదని గుర్తించిన ప్రభు త్వం.. అందుకనుగుణంగా ఈ పథకానికి ఈసారి కేటాయింపులు పెంచింది. రైతుబీమా పథకానికి ప్రభుత్వం రూ. 1,141 కోట్లు కేటాయించింది. 18 నుంచి 60 ఏండ్ల మధ్య వయసు ఉండి.. గుంట భూమి ఉన్నా ఒక్కో రైతుకు బీమా ప్రీమియం కోసం రూ. 2,271.50 చొప్పున ఎల్‌ఐసీకి జమచేయనున్నారు. మృతిచెందిన రైతు కుటుంబానికి పదిరోజుల్లోనే రైతుబీమా కింద రూ.5 లక్షల పరిహారం అందుతుంది. ఆర్థికమాంద్యం ఉన్నప్పటికీ రైతురుణమాఫీ అమలు చేసి తీరుతామని స్పష్టంచేసిన ప్రభు త్వం.. లక్ష లోపు రుణాలను నాలుగు విడుతలుగా మాఫీచేయనున్నట్టు పేర్కొన్నది. 2014లో రూ.16,124 కోట్ల రుణాలను మాఫీచేసిన ప్రభుత్వం.. ప్రస్తుతం బడ్జెట్‌లో రూ. 6,225 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.25 వేల లోపు రుణాలు ఒకే విడుతలో మాఫీచేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెలలోనే రూ.1,198 కోట్లు విడుదల చేయనున్నట్టు హరీశ్‌రావు తెలిపారు.

### పంటల కొనుగోలుకు అత్యవసర ఫండ్

వరి, పత్తి, మక్కజొన్న, కందులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకం గా మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ స్కీంను ప్రవేశపెట్టింది. కేంద్రప్రభుత్వం పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయడంలో పరిమితి వి ధిస్తుండటంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించింది. ఈ స్కీం ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులకు ధరల స్థిరీకరణ కల్పిస్తారు. మైక్రో ఇరిగేషన్ ప్రోత్సాహానికి రూ.600 కోట్లు, రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాల సరఫరాకు రూ.142 కోట్లు కేటాయించారు. వ్యవసాయ వర్సిటీకి రూ.25 కోట్లు కేటాయించారు.




## అసహాయులకు ఆసరా

**అసహాయులకు** అండగా ఉంటామని కేసీఆర్ ప్రభు త్వం మరోసారి స్పష్టంచేసింది. దివ్యాంగులు, ఆసరా లబ్ధిదారులకు ఇచ్చే పెన్షన్ల కోసం భారీగా నిధులు కేటాయించింది. ఎన్నికల హామీ ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి 57ఏండ్లు దాటినవారికి పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య ఐదారు లక్షల వరకు పెరుగనున్నది. ఆసరా పెన్షన్లకు గతబడ్జెట్‌లో రూ. 9,402 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.11,758 కోట్లకు పెంచారు. ఈ పథకంలో 39,41,976 మంది లబ్ధిదారులున్నారు. ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులు, వృద్ధ కళాకారులకు రూ.3,016, ఆసరా లబ్ధిదారులకు రూ.2,016 చొప్పున చెల్లిస్తున్నది. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, బోదకాలు బాధితులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు, నేత, గీత కార్మికులు 2,016 పెన్షన్ పొందుతున్నారు.

### వడ్డీలేని రుణాలు కొనసాగింపు

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చే పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించిన ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించింది. రూ. 1,200 కోట్లను వడ్డీలేని రుణాల కింద ఇవ్వనున్నట్లు ప్రకటించింది. సెర్ప్, స్త్రీనిధి రుణాలతోపాటు ఈ రుణాలు అదనంగా ఇవ్వనున్నారు. వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తున్నది. దాదాపు రూ. 2,100 కోట్లను వడ్డీ కింద మహిళలకు మంజూరుచేశారు.

# 80 లక్షల ఎకరాలకు జీవం

## తెలంగాణ సాగునీటి రంగ ప్రస్థానం అద్భుతం

**కాళేశ్వరంలో ఐదుదశల్లో విజయవంతంగా ఎత్తిపోత**

**మిషన్ కాకతీయతో అన్నదాతకు ఆర్థికపుష్టి**

**సామాజిక ఆర్థిక సర్వే- 2020 నివేదిక వెల్లడి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అనతికాలంలోనే తెలంగాణ సాగునీటిరంగం అద్భుత విజయాలను సొంతం చేసుకున్నది. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంతోపాటు రీడిజైనింగ్ ప్రాజెక్టులూ ఫలాలను అందిస్తుండటంతో తెలంగాణ ఆకుపచ్చ మాగాణంగా మారుతున్నదని సామాజిక, ఆర్థిక సర్వే- 2020 నివేదిక పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ నివేదికను విడుదలచేశారు. ఇందులో సాగునీటి రంగంలో రాష్ట్రం సాధించిన అద్భుత విజయాలను సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో 38 భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నది. వీటిలో 22 భారీ, 13 మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు, ఒక వరదకాల్వ, రెండు ఆధునీకరణ ప్రాజెక్టులు ఉన్నాయి. కొన్ని పూర్తిగా.. మరికొన్ని పాక్షికంగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో 70 లక్షల ఆయకట్టుతోపాటు, మరో పది లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన ఆరేండ్లలోనే 80 లక్షల ఎకరాలకు జీవం రికార్డు.

### రాష్ట్రం ఏర్పడ్డాక పూర్తయిన ప్రాజెక్టులు

**భారీ ప్రాజెక్టులు:** కోయిల్‌సాగర్, అలీసాగర్, గుత్ప, భక్త రామదాసు, సింగూరు ప్రాజెక్టు కాల్వలు

**మధ్యతరహా ప్రాజెక్టులు:** రాలివాగు, గొల్ల వాగు, మత్తడివాగు, గడ్డెన్న-సుద్దవాగు, చౌటుపల్లి హన్మంతరావు, కిన్నెరసాని, నాగార్జునసాగర్ ఆధునీకరణ ప్రాజెక్టు.

### ప్రపంచ యవనికపై మేటి ప్రాజెక్టు

ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ ఎత్తిపోతల ప్రాజెక్టుగా కీర్తికెక్కిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తాజా ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి వచ్చింది. నివేదికలో కాళేశ్వర ప్రస్థానాన్ని సమగ్రంగా వివరించారు. 45 లక్షల ఎకరాలకు జీవం పోసేలా సీఎం కేసీఆర్ రీడిజైనింగ్ చేసిన ఈ ప్రాజెక్టులో భాగంగా



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నందిమేడారం పంప్‌హౌస్ (ఫైల్)

గోదావరిజలాల్ని ఐదు దశల్లో విజయవంతంగా ఎత్తిపోసిన వివరాలను పొందుపరిచారు. గోదావరి నది నుంచి ఈ నెల 4వ తేదీ వరకు లక్ష్మీ పంపుహౌజ్ నుంచి 51.77, సరస్వతి పంపుహౌజ్ నుంచి 46.53, పార్వతి పంపుహౌజ్ నుంచి 44.06, నంది పంపుహౌజ్ నుంచి 59.94, గాయత్రి పంపుహౌజ్ నుంచి 57.64 టీఎంసీలు విజయవంతంగా ఎత్తిపోసినట్టు పేర్కొన్నారు.

### దిగుబడి పెంపు.. వ్యయం తగ్గింపు

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకం కూడా అద్భుత ఫలితాలు సాధించిందని సామాజిక, ఆర్థిక సర్వే – 2020 స్పష్టం చేసింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా రైతులు పొలాల్లోకి తరలించుకున్న పూడిక మట్టితో రసాయనిక ఎరువుల వాడకం 35–50 శాతానికి తగ్గిందని వెల్లడించింది. దీంతో రైతులు ఎకరాకు వెచ్చించే వ్యయంలో 27.6 శాతం ఆదా కావడంతోపాటు, పంటలను బట్టి ఎకరాకు రూ.3,700–7,500 వరకు వ్యయం తగ్గిందని పేర్కొన్నది. ఈ పథకం కింద మొత్తం నాలుగు విడుతల్లో 15లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగినట్టు వెల్లడించింది.



# పర్యాటకానికి ప్రాధాన్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రకృతి సంపద, సుందర ప్రదేశాలకు తెలంగాణ పెట్టింది పేరు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్శించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. ప్రకృతి అందాలను కాపాడటం, అదే సమయంలో ఎకో టూరిజంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నది. బోగతా వాటర్‌ఫాల్, అనంతగిరి హిల్స్, మంజీరా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, కుంటాల వాటర్‌ఫాల్స్, లక్నవరం లేక్, మల్లారం ఫారెస్ట్, మల్లెలతీర్థం వాటర్‌ఫాల్, పాకాల్ లేక్, పొచ్చెర వాటర్‌ఫాల్స్, టైగర్ ఫారెస్ట్ వంటివి ఎకో టూరిజం స్పాట్‌లుగా అభివృద్ధి చెందిన వాటిలో ఉన్నాయని సామాజిక ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించింది.



# రహదారులకు రాచఠీవి

- **72% పూర్తయిన డబుల్ లేన్ రోడ్ల విస్తరణ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్ విస్తరణ పురోగతిలో ఉన్నదని, తెలంగాణ ప్రభుత్వం ఆశించిన రీతిలో పనులు పూర్తిచేస్తున్నదని సామాజిక ఆర్థిక సర్వే నివేదిక స్పష్టంచేస్తున్నది. మండల ప్రధాన కేంద్రాల నుంచి జిల్లా ప్రధాన కేంద్రాల మధ్య గుర్తించిన 139 సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్ రోడ్లుగా విస్తరించే ప్రక్రియ వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తున్నది. రూ. 2,570 కోట్లతో జరుగుతున్న ఈ పనులు 72% పూర్తయ్యాయని తెలిపింది. జిల్లా, రాష్ట్ర, కోర్ రోడ్ నెట్‌వర్క్‌లో భాగంగా జరుగుతున్న డబుల్ లేన్ రోడ్ విస్తరణ పనులు 50% పూర్తికావచ్చాయి. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో గోదావరి, కృష్ణ నదుల మీద నిర్మించతలపెట్టిన వంతెనల్లో 74% పనులు పూర్తయ్యాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 550 వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించగా, వాటిలో 474 ఇప్పటికే పూర్తయ్యాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా రోడ్ల నిర్మాణం జరుగుతున్నది. 2014లో కాంక్రీట్ రోడ్లు 1,717 కిలోమీటర్లు ఉంటే 2019 నాటికి 3,654 కిలోమీటర్లకు పెరిగింది. బీటీ లేదా ఇతర రోడ్లతో మొత్తం 12,751 కుగానూ 11,206 పంచాయతీలు అనుసంధానమై ఉన్నాయి.

# ప్రపంచంతోనే పోటీ!

**బంగారు తెలంగాణవైపు వడివడిగా అడుగులు**

**సామాజిక ఆర్థిక సర్వే-2020లో వెల్లడి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సంపదను, తలసరి ఆదాయాన్ని ఏటేటా గణనీయంగా పెంచుకొంటూ ప్రగతిపథంలో పరుగులు తీస్తున్న తెలంగాణ ఇప్పుడు ఏకంగా ప్రపంచంతోనే పోటీపడుతున్నది. ఆర్థిక వృద్ధిరేటులో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగి బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నది. రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే – 2020లో ఈ విషయాలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. 2019 లో ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 2.4%, దేశ వృద్ధిరేటు 5%ఉండగా.. తెలంగాణలో 8.2 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. 'రైతుబంధు' లాంటి వినూత్న పథకాలతో ఏకంగా ఐక్యరాజ్య సమితి నుంచి ప్రశంసలు అందుకొన్న తెలంగాణ స్థిరమైన వృద్ధితో ప్రగతిపథంలో దూసుకెళ్తున్నట్టు సర్వే వెల్లడించింది.2014లో రూ.5.05 లక్షల కోట్లుగా ఉన్న తెలంగాణ సంపద (జీఎస్డీపీ) ప్రస్తుతం రూ. 9.69 లక్షల కోట్లకు చేరింది. ప్రజల కొనుగోలుశక్తిని పెంచడం, విద్యుత్, సాగునీరు, పారిశ్రామిక రంగాల్లో మౌలికవసతులను మెరుగుపర్చడంతో వృద్ధి సాధ్యమైంది.

### విద్యుత్‌తో మొదలు


విద్యుత్ రంగాన్ని సమూలంగా సంస్కరించి అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్‌ను అందించడంతో పారిశ్రామికరంగం పుంజుకున్నది. టీఎస్‌ఐపాస్‌తో 11,857 పరిశ్రమలు రావడంతో 13.08 లక్షల మందికి ఉపాధి లభించింది. రూ.80,500 కోట్లతో రూపుదిద్దుకొన్న కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రం సమూలంగా మారిపోయింది. తెలంగాణ ఇప్పుడు కోటి ఎకరాలకు సాగునీటిని అందించే దిశగా సాగుతున్నది.

### ఆరేండ్లుగా అదే నిలకడ

ప్రస్తుతం దేశీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ రాష్ట్రంలో వృద్ధిరేటు నిలకడగా కొనసాగుతున్నది. గత ఆరేండ్లలో తెలంగాణ జీఎస్డీపీ సగటు వృద్ధిరేటు 9.25 శాతంగా నమోదవగా.. దేశ జీడీపీ సగటు 6.97 శాతానికే పరిమితమైంది. తెలంగాణ తలసరి ఆదాయం కూడా ఏటేటా పెరుగుతున్నది. ప్రస్తుత ధరల వద్ద ఈ ఆర్థిక సంవత్సరం (2019–20)లో రాష్ట్ర తలసరి ఆదాయం 11.6 శాతం వృద్ధిచెంది రూ.2.28,216కు పెరుగగా.. దేశ తలసరి ఆదాయం మాత్రం కేవలం 6.3 శాతం వృద్ధితో రూ.1,34,432కు పరిమితమైంది.

### సామాజిక సంక్షేమంతో సత్ఫలితాలు

ప్రజా సంక్షేమంతోపాటు విద్య, ఆరోగ్యరంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం సత్ఫలితాలను ఇస్తున్నది. ఆహార భద్రత, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కంటి వెలుగు, కేసీఆర్ కిట్లు, ఆరోగ్య లక్ష్మి, పౌష్టికాహారం లాంటి పథకాలు రాష్ట్రంలో మానవవనరులను పెంపొందిస్తున్నాయి. 2013లో 92గా ఉన్న మాతృ మరణాల రేటు (ఎంఎంఆర్) 2017లో 76కు తగ్గింది. కేసీఆర్ కిట్ల వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల శాతం 31 శాతం నుంచి 60 శాతానికి పెరిగింది. పట్టణ, గ్రామీణ ప్రగతికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం స్థానిక సంస్థలకు నెలనెలా భారీగా నిధులు కేటాయిస్తున్నది. కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చి ప్రజల చేతుల్లో పాలన ఉంచింది. షీటీమ్స్, సీసీ కెమెరాల ఏర్పాటుతో మహిళలు, పిల్లలకు పటిష్ఠ భద్రత కల్పించడంతోపాటు హైదరాబాద్‌ను అత్యంత సురక్షిత నగరంగా తీర్చిదిద్దింది. దీంతో ఇప్పుడు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు హైదరాబాద్ వేదికగా నిలుస్తున్నది. అన్ని రంగాల్లో పురోగతిని మదించి తెలంగాణకు నీతి ఆయోగ్ మూడో ర్యాంకును ఇవ్వడం వృద్ధిలో మన రాష్ట్రం దూసుకుపోతున్నదని స్పష్టం చేస్తున్నది.




## సంపూర్ణ ప్రతిఫలనం.. 'నివేదిక' ముఖచిత్రం

**అద్భుతంగా తీర్చిదిద్దిన ఏలె లక్ష్మణ్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన 'సామాజిక ఆర్థిక సర్వే నివేదిక'కు కవర్‌పేజీ.. స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ రూపొందించిన ముఖచిత్రం రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, ప్రజలకు అందుతున్న సంపూర్ణ ఫలాలను ప్రతిబింబి స్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిని ఎత్తిపోస్తున్న పంపులు, జలకళ సంతరించు కున్న కాల్వలు, ఉత్సాహంగా నాట్లేస్తున్న మహిళలు, పవర్ ప్రాజెక్టులు, ఇంటింటికీ సురక్షిత నీరు అందిస్తున్న మిషన్ భగీరథ, నిరుపేదలకు నీడనిచ్చే డబుల్ బెడ్ రూంలు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, కంటివెలుగు, బాలింతల సంరక్షణ, గొర్రెల పంపిణీ, హరితహారం.. ఈ పథకాలన్నింటి రూపకర్త సీఎం కేసీఆర్ చిత్రాలతో కూడిన కవర్‌పేజీని ఎంతో అద్భుతంగా రూపొందించారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిని కవర్‌పేజీ కండ్లకు కడుతున్నది.

# పరిశ్రమ.. ఉపాధి ధీమా

- **జాతీయ సగటు కంటే అధిక అవకాశాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పారిశ్రామికరంగం జాతీయ సగటు కంటే ఘణమైన వృద్ధిరేటును సాధించింది. 2014–17 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు 6% ఉండగా, జాతీయ సగటు 3.6 శాతమే నమోదైంది. రాష్ట్రంలో 2009–10లో 7,729 పరిశ్రమలు వస్తే.. 2016–17లో 12, 476 పరిశ్రమలొచ్చాయని, ఇది గతంలో కంటే 61% అధికమని సామాజిక ఆర్థికసర్వే పేర్కొన్నది. ఉత్పత్తి విలువ భారీగా పెరిగిందని, 2015–16లో రూ.2,03,547 కోట్లు ఉండగా, అది 2016–17కు రూ.2,24,348 కోట్లకు చేరిందని తెలిపింది. ఏడాదిలోనే 10.22 శాతం పెరిగినట్టు వెల్లడించింది. ఉత్పత్తి యూనిట్ల గ్రాస్ వాల్యూయాడెడ్ 13.9 శాతం పెరుగగా, అదే సమయంలో జాతీయసగటు 8.3 శాతం మాత్రమే ఉన్నదని పేర్కొన్నది. పరిశ్రమల స్థాపనకు తెలంగాణలో వెచ్చించిన ఫిక్స్‌డ్ క్యాపిటల్.. 14.4 శాతం ఉండగా, జాతీయ సగటు 13.5 శాతమేనని సర్వే వెల్లడించింది.



# సంక్షేమం అద్భుతం

- **సామాజిక ఆర్థిక సర్వే-2020 ప్రశంస**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సంక్షేమపథకాలు అద్భుతంగా ఉన్నాయని సామాజిక ఆర్థికసర్వే–2020 ప్రశంసించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని కొనియాడింది. పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూ. 1,00,116 అందించడాన్ని అభినందించింది. షాదీముబారక్ కింద 26,914 మంది మైనార్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 263.07 కోట్లు ఇచ్చిందని చెప్పింది. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధినిధి (ఎస్సీఎస్డీఎఫ్), ఎస్టీ ప్రత్యేకఅభివృద్ధి నిధి (ఎస్టీఎస్డీఎఫ్) కింద వారికి రూ.5 లక్షల ఆర్థిక చేయూతనందించడం ప్రశంసనీయమని సర్వే ప్రత్యేకంగా ప్రస్తావించింది. దళితులకు భూపంపిణీ పథకం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓన్ యువర్ కార్ పేరిటి కార్ల అందజేయడం ప్రశంసనీయమని పేర్కొన్నది. స్టడీ సర్కిళ్ల ద్వారా నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ, గిరిజన రైతులకు శిక్షణ అందించి ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రోత్సహించడం తదితర అంశాలను సర్వే మెచ్చుకున్నది.



# మూలస్తంభంలా విద్యుత్

- **కొరత నుంచి మిగులు దిశగా పరుగులు**
- **సామాజిక ఆర్థిక సర్వే వెల్లడి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉండటానికి మూలస్తంభంలా విద్యుత్ రంగం నిలబడింది. రాష్ట్రం ఏర్పడేనాటికి 2,700 మెగావాట్ల విద్యుత్ కొరతతో ఉండగా.. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేశారు. ఫలితంగా దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనివిధంగా వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఖ్యాతిని గడించింది. ఆరేండ్లలో 16,261 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యానికి చేరుకొన్నది. దీనితోపాటు రూ.39,233 కోట్ల వ్యయంతో భద్రాద్రి (1,080 మెగావాట్లు), యాదాద్రి (4,000 మెగావాట్లు) థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నది. విద్యుత్ కొరతతో మొదలైన తెలంగాణ ప్రస్థానం.. మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా సాగుతున్నది. ఈ విషయాన్ని సామాజిక ఆర్థిక సర్వే స్పష్టం చేసింది.

### మెరుగుపడిన గ్రిడ్ నిర్వహణ

గ్రిడ్ నిర్వహణ కోసం 2018 జనవరిలో నాగార్జునసాగర్ జల విద్యుత్ కేంద్రంలో రివర్సిబుల్ పంపింగ్‌ను ప్రారంభించారు. దీంతో ఆఫ్ పీక్ సమయంలో తక్కువ ధరకు నీటిని రివర్స్ పంపింగ్ చేసుకొని గరిష్ఠ డిమాండ్ ఉన్న సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తి చేపట్టడం ద్వారా రాష్ట్రానికి ఆర్థిక లాభంతోపాటు గ్రిడ్‌ను సమర్థంగా నిర్వహిస్తున్నది. 2019 డిసెంబరు నాటికి 1.53 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. వీటికి 24 గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరాకు వీలుగా 112 ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 833తోపాటు 2.54 లక్షల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటుచేశారు.



### అందుబాటులో సోలార్ పాలసీ

తెలంగాణ వచ్చేనాటికి కేవలం 74 మెగావాట్ల సౌరవిద్యుత్ అందుబాటులో ఉండగా.. 2019 నాటికి దీనిని 3,645 మెగావాట్లకు చేర్చారు. ఇందుకోసం సోలార్ పాలసీ–2015ను తయారుచేసి ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. 2020–21 నాటికి సౌరవిద్యుత్ 5,000 మెగావాట్లకు చేరేలా ముందుకు సాగుతున్నారు. కేంద్రం ప్రారంభించిన ఉదయ్ స్కీంలో చేరడం వల్ల తెలంగాణ డిస్కంలపై గణనీయమైన ఆర్థిక భారం తగ్గింది. 2030 నాటికి ప్రజారవాణాలో 100%, వ్యక్తిగత వాహనాల్లో 40% ఎలక్ట్రికల్ వెహికిల్స్ ఉండనున్నాయనే అంచనాలకు అనుగుణంగా ట్రాన్స్‌కో చార్జింగ్ ఏజెన్సీలను ఏర్పాటుచేస్తున్నది.

## తుది దశకు ఎమ్మెల్యేల కార్యాలయాలు

- **పురోగతిలో సిటీ పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్ బిల్డింగ్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కోసం నిర్మిస్తున్న రెసిడెన్స్ కం ఆఫీస్ పనులు తుది దశకు చేరుకొన్నాయి. ఒక్కో నియోజకవర్గంలో రూ. కోటి చొప్పున మొత్తం 119 ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్మాణాలను ప్రతిపాదించారు. 77 నియోజకవర్గాల్లో నిర్మాణం పనులు పూర్తికాగా, 19 నియోజకవర్గాల్లో పురోగతిలో ఉన్నాయి. మరో 8 నియోజకవర్గాల్లో స్థలం కేటాయించకపోవటం, ఇతర వివాదాలతో పనులు ప్రారంభదశలోనే ఉన్నాయి. హైదరాబాద్ నగరం పరిధిలోని 15 మంది ఎమ్మెల్యేలకు హైదరగూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కార్యాలయాలు కేటాయించాలని నిర్ణయించారు. లుంబినీ పార్క్, ట్యాంక్‌బండ్ సమీపంలో రూ.80 కోట్లతో నిర్మిస్తున్న అమరవీరుల స్మృతిచిహ్నం నిర్మాణం పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. హైదర్‌గూడలో రూ.166 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న 120 ఫ్లాట్ల నిర్మాణం పూర్తికావొచ్చింది. రూ.23 కోట్లతో లక్డీకాపూల్‌లో నిర్మిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం భవనం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. చార్మినార్ వద్ద ఉన్న నిజాం నిజామియాలో రూ.14.65 కోట్లతో ఆడిటోరియం నిర్మాణం పూర్తయింది. రూ.350 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్ భవనం పనులు పురోగతిలో ఉన్నాయి. బోరబండలో రూ.21 కోట్లతో ఏర్పాటుచేస్తున్న దళిత్ స్టడీ సెంటర్ నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి.



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో ఎమెల్మేలు నరేందర్, రోహిత్‌రెడ్డి, ఆనంద్, రవిశంకర్, చిన్నయ్య

# జనరంజక బడ్జెట్

- **మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యేల హర్షం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇది జనరంజక బడ్జెట్ అని, రాష్ట్ర పురోగతికి బాటలువేస్తుందని పలువురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఒక సామాజిక ఇంజినీరులా ఆలోచించి, అన్నివర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ బడ్జెట్‌కు రూపకల్పన చేశారని కొనియాడారు. అసెంబ్లీ, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గువ్వల బాలరాజు, నన్నపనేని నరేందర్, పైలట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, సుంకె రవిశంకర్, నోముల నర్సింహయ్య మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కేంద్రం సహకరించకపోయినా, ఆర్థికమాంద్యం ఉన్నా ఏ రంగంలోనూ కోత విధించకపోవడం గొప్ప విషయమన్నారు. సంక్షేమ, వ్యవసాయరంగాలకు పెద్దపీట వేశారని హర్షంవ్యక్తంచేశారు. పేద, మధ్య తరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, అన్నివర్గాలకూ ఈ బడ్జెట్ అనుకూలంగా ఉన్నదని పేర్కొన్నారు.



# మతి భ్రమించి ఆరోపణలు

- **ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ నేతలు మతిభ్రమించి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆరోపణల్లో వాస్తవంలేదన్నారు. ఆదివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డి తానే కాబోయే పీసీసీ అధ్యక్షుడినని ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవి కోసమే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



103 ఏండ్ల వయసున్న మన్‌కౌర్‌కు నారీ శక్తి అవార్డు అందిస్తున్న రాష్ట్రపతి కోవింద్

# 15 మందికి 'నారీ శక్తి' అవార్డులు

**మహిళా దినోత్సవం సందర్భంగా అందజేసిన రాష్ట్రపతి కోవింద్**

**న్యూఢిల్లీ:** మహిళా సాధికారతకు కృషి చేసిన 15 మంది మహిళలు నారీ శక్తి అవార్డులు అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్రపతి కోవింద్ వీరికి ఈ అవార్డులను అందజేశారు. చండీగఢ్ 'అద్భుత మహిళ', 103 ఏండ్ల మన్ కౌర్ వందేండ్లు దాటిన ప్రపంచ పరుగుల రాణిగా రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పడాల భూదేవి పోడు భూముల సాగుతో గిరిజన మహిళలకు చేయూతనిస్తున్నారు. జార్ఖండ్ 'మహిళా టార్జన్'చమి ముర్మ పర్యావరణ హితానికి కృషిచేస్తున్నారు. నిల్జా వాంగ్మో సంప్రదాయ లడక్ వంటకాల్లో శిక్షణ ఇస్తున్నారు. రష్మిఉర్ధ్వర్డే ఆటోమోటివ్‌పరిశోధనల్లో రాణించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన తషి, నుమ్గ్షి మాలిక్ ఎవరెస్ట్ వంటి పర్వతాలు అధిరోహించిన తొలి మహిళాకవలలుగా ఖ్యాతి పొందారు. కౌషికి చక్రవర్తి భారతీయ శాస్త్రీయ సంగీతంలో ఎనలేని కృషిచేశారు. తొలి మహిళా ఫైటర్ పైలట్లు అవని చతుర్వేది, భావనా కాంత్, మోహన సింగ్, మలివయసులో చదువుకున్న కేరళకు చెందిన భగీరథీ అమ్మ (105), కర్త్యాయిని అమ్మ (98), కశ్మీర్‌కు చెందిన ఆరిఫా జాన్ కూడా అవార్డులు అందుకున్నారు.



మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి బినా వరకు నడిచే గూడ్స్ రైలును నడుపుతున్న మహిళా లోకో పైలట్ నూతన్ కుమారి

## మహిళా సిబ్బందితో రైళ్లు, విమాన సర్వీసుల నిర్వహణ

**న్యూఢిల్లీ/ కోయంబత్తూర్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం కొన్ని రూట్లలో రైళ్లు, విమాన సర్వీసులను పూర్తిగా మహిళా సిబ్బంది నడిపారు. ఎయిర్ ఇండియాకు చెందిన మహిళా సిబ్బంది ఆదివారం ఢిల్లీ–శాన్‌ఫ్రాన్సిస్కో రూట్‌తోపాటు 8 అంతర్జాతీయ, 44 దేశీయ రూట్లలో విజయవంతంగా విమానాలను నడిపారు. మరోవైపు తమిళనాడులోని కోయంబత్తూర్–కేఎస్ఆర్ బెంగళూరు మధ్య నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు కోయంబత్తూర్ నుంచి ఆదివారం ఉదయం 5.40 గంటలకు బయలుదేరింది. ఈ ఎక్స్‌ప్రెస్‌లో సిబ్బంది అంతా మహిళలే.



## బయో డీగ్రేడబుల్ బ్యాగుల్లో నాప్కిన్లు

**పుణె:** సహజంగా ప్రకృతిలో కలిసిపోయే (బయో డీగ్రేడబుల్) బ్యాగుల్లో శానిటరీ నాప్‌కిన్లు రానున్నాయి. తయారీ సంస్థలు వచ్చే ఏడాది జనవరి నుంచి బయో డీగ్రేడబుల్ బ్యాగులు అందించడం తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా పుణెలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడుతూ.. వ్యర్థ పదార్థాలను సేకరించేవారిని 'స్వచ్ఛతా సేవక్'లుగా అభివర్ణించారు.

## మంత్రికి తెలియకుండా చానళ్లపై నిషేధమా?

**న్యూఢిల్లీ:** కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు తెలియకుండానే 2 మలయాళ చానళ్లపై నిషేధం విధించారని తెలిసి నిర్ఘాంతపోయామని న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అసోసియేషన్ (ఎన్బీఏ) తెలిపింది. ఇలా ఎందుకు జరిగిందన్న దానిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. సమాచార, ప్రసార శాఖ నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు ఎన్బీఏ అధ్యక్షుడు రజత్ శర్మ పేర్కొన్నారు.



క్యాన్సర్‌తో బాధపడుతున్న హైదరాబాదీ బాలుడు అబ్దుల్లా హుస్సేన్ దుబాయి రాజు షేక్ హమ్‌దన్‌ను కలుసుకోవాలని ఆకాంక్షించాడు. ఈ విషయం తెలుసుకున్న రాజు.. శుక్రవారం దుబాయిలో అబ్దుల్లాతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఇలా ఫొటో దిగారు.

# మహిళా శక్తికి నమో!

**ఏడుగురు 'నారీ శక్తి' గ్రహీతల చేతికి మోదీ సోషల్ మీడియా ఖాతాలు**

**ఒక రోజంతా వారే నిర్వహణ.. 'షీ ఇన్‌స్పైర్స్ అజ్' హ్యాష్‌ట్యాగ్‌తో వారి విజయాల ప్రస్తావన**

**న్యూఢిల్లీ, మార్చి 8:** ప్రధాని మోదీ సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ 'నారీ శక్తి' చేతికి చేరింది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక రోజంతా తన ఖాతాలను మహిళలకు అప్పగిస్తానని ప్రధాని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన 'నారీ శక్తి' పురస్కారాలు అందుకున్నవారిలో ఏడుగురిని ఆదివారం ఎంపికచేశారు. రోజంతా తన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నిర్వహణ బాధ్యత వారికే అప్పగిస్తున్నట్టు ట్వీట్ చేశారు. తాను 'సైనింగ్ ఆఫ్' చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆ ఏడుగురు.. తమ అభిప్రాయాలను, అనుభవాలను మోదీ ఖాతాల ద్వారా పంచుకున్నారు. 'షీ ఇన్‌స్పైర్స్ అజ్' (#SheInspiresUs) హ్యాష్ ట్యాగ్‌ను జత చేశారు.

**పోషకాహార లోపం నిర్మూలనకు పాటుపడండి**

దేశంలో పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు, నీటి సంరక్షణకు పాటుపడాలని నారీ శక్తి పురస్కార గ్రహీతలను ప్రధాని మోదీ కోరారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో ప్రధాని వారితో ముచ్చటించారు. వారు సాధించిన ఘనతలు విశ్వవిద్యాలయాలకు కేస్ స్టడీలుగా మారుతాయని చెప్పారు.

**స్నేహ మోహన్‌దాస్:** అన్నార్థుల పాలిట అన్నపూర్ణ. తన తల్లి స్ఫూర్తిగా 'ఫుడ్ బ్యాంక్ ఇండియా'ను ప్రారంభించారు. తమకు 20కి పైగా శాఖలున్నాయని, సామూహిక వంటలు (మాస్ కుకింగ్), కుకింగ్ మారథాన్, తల్లిపాలపై అవగాహన సదస్సులు నిర్వహించామని మోదీ ట్విట్టర్ ఖాతాలో స్నేహ పోస్ట్ చేశారు.

**మాళవిక అయ్యర్:** 13 ఏండ్ల వయసులో బాంబు పేలుడులో తీవ్రంగా గాయపడ్డారు. ఆమె రెండు చేతులు తెగిపోయాయి. 'ఓటమిని అంగీకరించొద్దు. మీ హద్దులను చెరిపేయండి. ధైర్యం, నమ్మకంతో ప్రపంచాన్ని ఎదుర్కోండి' అని ఆమె పేర్కొన్నారు.



ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో 'నారీ శక్తి' పురస్కార గ్రహీతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**ఆరిఫా జైన్:** కశ్మీర్‌కు చెందిన ఆరిఫా.. ఆ రాష్ట్ర సంప్రదాయ చేనేత ఉత్పత్తులకు, ఆధునికతను జోడించి 'నమ్దా' పేరుతో మార్కెట్ చేస్తున్నారు. స్థానిక మహిళల సాధికారతే లక్ష్యంగా కృషిచేస్తున్నారు. 'మహిళా కళాకారుల దుస్థితిని కండ్లారా చూశా. వారి బతుకులు బాగుచేసేందుకు యత్నిస్తున్నా' అని పేర్కొన్నారు.

**కల్పనా రమేశ్:** ఈమె జల సంరక్షణ ఉద్యమకారిణి. 'మీకు నచ్చిన అంశంలో.. భిన్నమార్గంలో పోరాడండి. అందరూ జల సంరక్షణలో భాగం కండి. నీటి పునర్వినియోగంపై అవగాహన పెంచుకోండి' అని కల్పన కోరారు.

**విజయ పవార్:** మహారాష్ట్రలోని బంజారాలకు చెందిన సంప్రదాయ వస్త్రాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారు విజయ పవార్. 'రెండు దశాబ్దాలుగా ఇదే పని చేస్తున్నా. నాతోపాటు ఇప్పుడు మరో వెయ్యి మంది మహిళలు కలిసి పనిచేస్తున్నారు' అని చెప్పారు.

**కళావతి దేవి:** కాన్పూర్‌కు చెందిన కళావతి.. నిధులు సేకరించి పరిసర గ్రామాల్లో నాలుగు వేలకుపైగా మరుగుదొడ్లను నిర్మించారు. 'మా ప్రాంతం రోత పుట్టించేదిగా ఉండేది. పరిశుభ్రతతో ఈ పరిస్థితిని మార్చొచ్చని నమ్మా. డబ్బు పోగేసి టాయిలెట్లు కట్టించాను' అని చెప్పారు.

**బీణాదేవి:** సంకల్ప బలానికి బీణాదేవి ప్రత్యక్ష ఉదాహరణ. ఆమె స్వస్థలం బీహార్‌లోని ముంగర్. పుట్టగొడుగుల పెంపకంలో వినూత్నమైన పద్ధతులను ఆవిష్కరించి, 1500 మంది మహిళలకు ఉపాధి కల్పించారు. గ్రామీణ మహిళలకు డిజిటల్ ఉపకరణాలపై అవగాహన పెంచారు. గ్రామ సర్పంచిగా అభివృద్ధి పనులు చేపట్టారు.

### ప్రశంసలు.. విమర్శలు

**ప్రధాని** తన సోషల్ మీడియా ఖాతాలను మహిళలకు అప్పగించడంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. హక్కుల కార్యకర్త మోనికా అరోరా స్పందిస్తూ.. 'మానవత్వానికి సేవ చేస్తున్న నిజమైన మహిళలకు దక్కిన గౌరవమిది' అని కొనియాడారు. మరోవైపు.. ఇది దేశ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చే కార్యక్రమమని సీపీఐ నేత అన్నె రాజా విమర్శించారు. పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా స్పందిస్తూ.. మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు ఆడుతున్న నాటకాల్ని ఇకనైనా విడిచిపెట్టాలని కేంద్రానికి సూచించారు. కశ్మీర్ తొలి మహిళా సీఎంని చట్టవిరుద్ధంగా జైలులో పెట్టారన్నారు.

# ఇటలీ దిగ్బంధం

**కరోనా కట్టడికి కఠిన చర్యలు.. కేరళలో మరో ఐదుగురికి వైరస్**

**రోమ్/తిరువనంతపురం:** ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఇటలీ కఠిన చర్యలు చేపడుతున్నది. ఉత్తర ఇటలీలోని చాలా ప్రాంతాల్లో ప్రజల కదలికలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నిర్దిష్ట కారణం లేనిదే రాకపోకలు సాగించవద్దని ఆదేశాలు జారీచేసింది. దీంతో దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు దిగ్బంధానికి గురయ్యారు. దేశ జనాభాలో ఇది దాదాపు నాలుగో వంతు. ఇటలీలో ఇప్పటివరకు కరోనాతో 366 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. చైనాలోని క్వాంజౌలో కరోనా బాధితుల కోసం ఏర్పాటుచేసిన క్వారంటైన్ హోటల్ శనివారం కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 10 మంది చనిపోయారు. కరోనా కారణంగా చైనాలో ఆదివారం 27 మంది, ఇరాన్‌లో 49 మంది మృత్యువాతపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధితో 3,595 మంది చనిపోగా.. 1,05,836 మందికి వైరస్ సోకింది. కేరళలో మరో ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో వైరస్ సోకిన వారి సంఖ్య 39కి పెరిగింది.

## ఢిల్లీలో ఆత్మాహుతి దాడులకు కుట్ర!

**ఐఎస్‌తో సంబంధాలున్న కశ్మీర్ జంట అరెస్ట్**



హీనా బషీర్ బేగ్, జహన్‌జేబ్ షమీ

**న్యూఢిల్లీ:** ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న కశ్మీర్ జంటను ఢిల్లీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారిని జహన్‌జేబ్ షమీ, హీనా బషీర్ బేగ్‌గా గుర్తించారు. జామియానగర్‌లో వీరిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. వీరు ఢిల్లీలో ఆత్మాహుతి దాడులకు కుట్రపన్నినట్లు చెప్పారు. అలాగే దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించేందుకు ముస్లిం యువతను ప్రేరేపిస్తున్నట్లు తెలిపారు. వీరిద్దరూ 'ఇండియన్ ముస్లిం యునైట్' పేరుతో సోషల్‌మీడియా ఫ్లాట్‌ఫామ్ నిర్వహిస్తున్నారని అన్నారు. సీఏఏ, జాతీయ పౌర జాబితా(ఎన్నార్సీ)కు వ్యతిరేకంగా మద్దతు కూడగడుతున్నారని వెల్లడించారు. ఈ జంటకు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఐఎస్ విభాగంతోనూ సంబంధాలున్నట్లు చెప్పారు. సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక ఆందోళనల్లో ఐఎస్ కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. సీఏఏ వ్యతిరేక నిరసనల వెనుక ఐఎస్ హస్తం ఉన్నదని కేంద్రం పదే పదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

## పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు

**బికనేర్:** పాత కక్షలు అగ్గి రాజేశాయి. రాజస్థాన్‌లోని బికనేర్ జిల్లాలోని నోఖా పట్టణం సమీపంలో జీపులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులను అడ్డగించిన దుండగులు వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా, మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. పాత కక్షలే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

---

**వాణిజ్య**

# ఇంటి బడ్జెట్.. ఇల్లాలిదే

- ఆర్థిక నిర్ణయాల్లో మహిళలదే పైచేయి
- పొదుపు, కష్టార్జితాలపై అవగాహన ఎక్కువే
- పెట్టుబడుల్లో మగువల దూకుడు
- తాజా సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 8:** ఒకప్పుడు వంటింటి కుందేలుగా అభివర్ణించబడిన మహిళలు.. ఇప్పుడు మొత్తం ఇంటి బాధ్యతల్నే తలకెత్తుకుంటున్నారు. కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో ఇల్లాలిదే పైచేయిగా నిలుస్తున్నది. పొదుపు, కష్టార్జితాలపై వారిలో పెరిగిన అవగాహన.. ఇంటికి ఆర్థిక మంత్రులుగా చేసేసింది. పురుషులతో ఏ విషయంలోనూ తక్కువ కాదని నిరూపించుకుంటున్న మగువలు.. అటు సంపాదన, ఇటు పెట్టుబడుల్లోనూ దూసుకుపోతున్నారు మరి. ఆన్‌లైన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ స్క్రిప్‌బాక్స్ చేసిన అధ్యయనంలో పొదుపు, సంపాదన, పెట్టుబడులు, ఆర్థిక నిర్ణయాల్లో గృహిణుల హవా నడుస్తున్నట్లు తేలింది. తమ కష్టార్జితాన్ని ఎలా కాపాడుకోవాలి, దాన్ని ఎలా దాచుకోవాలన్న దానిపై 68 శాతం మందికి మంచి అవగాహన ఉందని సర్వే స్పష్టం చేసింది. కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లోనూ వారికి ఎంతో ప్రాధాన్యత పెరిగిందని, మగవారితో పోల్చితే వారి నిర్ణయాలే ఎక్కువని చెప్పింది. కేవలం 10 శాతం మందే మగవారికి ఆర్థిక నిర్ణయాలను వదిలేస్తున్నారు. గత నెలలో జరిగిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 600లకుపైగా మహిళలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

**బోర్డుల్లో ప్రాధాన్యం**

కంపెనీల బోర్డుల్లోనూ మహిళల ప్రాతినిథ్యం పెరుగుతున్నది. దేశంలోని చాలా సంస్థలు తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో స్త్రీల ప్రాధాన్యతను గుర్తించాయి. మైహైరింగ్‌క్లబ్.కామ్, సర్కారీ–నౌక్రీ.ఇన్ఫో నిర్వహించిన 'ఉమెన్ ఆన్ బోర్డ్ 2020' అధ్యయనంలో భారత్ 12వ స్థానంలో నిలిచింది. భారత్‌సహా 36 దేశాల్లోని 7,824 స్టాక్ మార్కెట్ నమోదిత సంస్థల్లో సర్వేను చేపట్టారు. దేశంలో 628 కంపెనీలు సర్వేలో పాల్గొనగా, గతేడాది కంటే ఈసారి బోర్డులలో మహిళా డైరెక్టర్లను 14% పెంచామని చెప్పాయి.



**ధైర్యంగా పెట్టుబడులు**

**నెలసరి** పొదుపులపై క్రమశిక్షణతో ముందుకెళ్తున్న మహిళలు.. స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌ల్లోనూ పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తుండటం గమనార్హం. 82% మంది తమ పెట్టుబడుల లక్ష్యాల సాధన కోసం స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటున్నారు. 43% మంది స్త్రీలు సంప్రదాయ పెట్టుబడులైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ల వైపు మొగ్గుతున్నారు. బంగారం పెట్టుబడులకూ 25% మంది సై కొడుతున్నారని ఇన్వెస్ట్‌మెంట్ వేదిక గ్రో తెలిపింది. 26వేల మంది మహిళలతో ఈ సంస్థ సర్వేను చేపట్టింది. రిటైర్మెంట్ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, పిల్లల ఉన్నత విద్య, వివాహాల కోసం పొదుపు చేస్తున్నారని పేర్కొన్నది.

# కపూర్‌కు సంకెళ్లు

**యెస్ బ్యాంక్ కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు • ఈ నెల 11దాకా కస్టడీ**

**ముంబై/న్యూఢిల్లీ, మార్చి 8:**

యెస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ఆదివారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో కపూర్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మనీ లాండరింగ్ ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఈడీ.. శుక్రవారం నుంచే కపూర్ నివాసం, కార్యాలయాల్లో ముమ్మర సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కపూర్‌ను అరెస్టు చేయగా, ఆదివారం ముంబైలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణకు కపూర్ సహకరించడం లేదని చెప్పడంతో ఈ నెల 11 వరకు కోర్టు ఆయనకు కస్టడీని విధించింది. కపూర్ కుటుంబ సభ్యులు నడిపిస్తున్న కొన్ని సంస్థలు, వాటి వెనుకనున్న వారి ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు ఈ సందర్భంగా కోర్టుకు ఈడీ తెలియజేసింది. మరోవైపు ఈడీ విచారణకు కపూర్ పూర్తిగా సహకరిస్తున్నారని, అయినా అరెస్టు చేశారని ఆయన తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.

**20కిపైగా షెల్ కంపెనీలు**

రాణా కపూర్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి 20కిపైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసినట్లు ఈడీ గుర్తించింది. ముడుపులను స్వీకరించడం, ఆపై వచ్చిన సొమ్మును అక్రమాస్తుల్లో పెట్టుబడిగా పెట్టడం వీటి పనని తెలుస్తున్నది. ఇలా రూ.2వేల కోట్ల ఆస్తుల్ని కొనగా, వీటి విలువ ఇప్పుడు రూ.5వేల కోట్ల పైనే ఉన్నట్లు సమాచారం. బ్రిటన్‌లోనూ రెండు ఆస్తులను కొనుగోలు చేసినట్లు ఈడీ వర్గాలు అంటున్నాయి. బ్యాంక్ నుంచి రుణాలను పొందడానికి కార్పొరేట్ సంస్థలు ఈ షెల్ కంపెనీలకు ముడుపులను తరలించేవంటున్నారు. డీహెచ్ఎఫ్ఎల్.. డూఇట్ అర్బన్ వెంచర్స్‌లో రూ.600 కోట్ల పెట్టుబడుల్ని పెట్టినట్లు వినిపిస్తున్నది. ఇది రాణా కపూర్ భార్య, కూతుర్ల ఆధ్వర్యంలో నడుస్తున్నది. యెస్ బ్యాంక్ నుంచి రూ.3,700 కోట్ల రుణాలను తీసుకుని డీహెచ్ఎఫ్ఎల్ ఎగవేసిన సంగతి తెలిసిందే. మొత్తానికి షెల్ కంపెనీలు, ఖరీదైన పెయింటింగ్స్, కోట్లాది ఆస్తులపై ఈడీ కన్నేసింది.

**2వేల కోట్ల ఆస్తులు పోగేసిన కుటుంబం**



ఆదివారం ముంబైలోని ప్రత్యేక కోర్టుకు యెస్ బ్యాంకు వ్యవస్థాపకుడు రాణా కపూర్‌ను తీసుకెళ్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు

**• రంగంలోకి సీబీఐ**

యెస్ బ్యాంక్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను సీబీఐ సేకరిస్తున్నట్లు ఆదివారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీబీఐ విచారణ అత్యంత రహస్యంగా జరుగుతున్నదని, దాడులకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పాయి. అయితే ప్రాథమిక విచారణ ఆధారంగా కేసు నమోదు చేశారా? లేదంటే ఎఫ్ఐఆర్ ఆధారంగా ఫైల్ చేశారా? అన్నది తెలియాల్సి ఉన్నది. మరోవైపు యెస్ బ్యాంక్ ఆధారిత యూపీఐ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. అంతర్జాతీయ ప్రయాణీకులు, విద్యార్థులు వినియోగిస్తున్న ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డ్ సేవలు స్తంభించిపోయాయి. కాగా, ఏటీఎంలలో నగదును అందుబాటులోకి తెచ్చామని కస్టమర్లు తీసుకోవచ్చని యెస్ బ్యాంక్ వర్గాలు తెలిపాయి.

**లండన్‌కి ఉడాయిస్తుంటే..?**

రాణా కపూర్ కుమార్తె రోషిణి కపూర్.. ఆదివారం లండన్‌కు వెళ్లే విమానం ఎక్కబోతుండగా ముంబై విమానాశ్రయంలో అధికారులు అడ్డుకున్నారు. కపూర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అల్లుడికి లుకౌట్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో రోషిణి కపూర్ విదేశీ ప్రయాణానికి బ్రేకులు పడ్డాయి.



## ఒత్తిడిలో మార్కెట్లు!

**ఈ వారం ట్రేడింగ్‌పై విశ్లేషకులు**

**రేపు మార్కెట్లకు సెలవు**

**న్యూఢిల్లీ, మార్చి 8:** ఆర్థిక మాంద్యం, కరోనా వైరస్, యెస్ బ్యాంక్ ఆర్థిక సంక్షోభంతో గత వారం భారీ నష్టాల్లో కూరుకుపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఈవారంలోనూ మరింత ఒత్తిడికి గురికావచ్చునని దలాల్‌స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. మంగళవారం హోలీ పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ఈవారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకు పరిమితంకానున్నది. ఈవారంలోనే విడుదల కానున్న పారిశ్రామిక ప్రగతి గణాంకాలు, రిటైల్, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయని మార్కెట్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. గురువారం ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలకానుండగా, ఆ మరుసటిరోజే టోకు ధరల సూచీ విడుదలకానున్నది. వరుసగా రెండోవారంలోనూ మార్కెట్లు మరింత పతనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అత్యంత వేగంగా కరోనా వైరస్ విస్తరిస్తుండటం, యెస్ బ్యాంక్ సంక్షోభం మొత్తం బ్యాంకింగ్, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రస్థాయి ప్రభావం చూపుతున్నట్లు జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంకావడంతో దేశీయ ఈక్విటీ, డెబిట్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ ట్రెండ్ ప్రస్తుతం వారంలోనూ కొనసాగవచ్చునని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లతోపాటు డాలర్–రూపీ ఎక్స్ఛేంజ్ రేటు కూడా ఈక్విటీలపై ప్రభావం చూపనున్నాయి. గతవారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 720.67 పాయింట్లు లేదా 1.88 శాతం నష్టపోయింది.



### ఎఫ్‌పీఐలు యూటర్న్

**వరుసగా** ఆరు నెలలపాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లో భారీగా నిధులు కుమ్మరించిన విదేశీ మదుపరులు ఒక్కసారిగా వెనక్కి తీసుకున్నారు. కరోనా వైరస్ మరిన్ని దేశాలకు పాకుతుండటంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈ నెల తొలి ఐదు ట్రేడింగ్‌ల్లోనే ఏకంగా రూ.13,157 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు ఎఫ్‌పీఐలు. డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు మార్చి 2 నుంచి 6 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.8,997.46 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయిన ఎఫ్‌పీఐలు..డెబిట్ సెగ్మెంట్ నుంచి కూడా రూ.4,159.66 కోట్లను ఉపసంహరించుకున్నారు. మొత్తంగా రూ.13,157.12 కోట్ల నిధులను తరలించుకుపోయారు. గతేడాది సెప్టెంబర్ నుంచి వరుసగా ఆరు నెలలుగా పెట్టుబడులకు మొగ్గుచూపిన ఎఫ్‌పీఐలు తాజాగా వెనక్కితగ్గారు. చైనాలో అల్లకల్లోలం సృష్టించిన కరోనా వైరస్ అమెరికాతోపాటు భారత్‌కు వ్యాపించడంతో అంతర్జాతీయ మార్కెట్లు పాతాళంలోకి పడిపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఈక్విటీల నుంచి ఉపసంహరించుకొని పసిడి వైపు మళ్లించారని గ్రోవ్ కో–ఫౌండర్, సీవోవో హర్ష జైన్ తెలిపారు. మరోవైపు ఆర్థిక మందగమన పరిస్థితులు వారిలో ఆందోళనను పెంచాయన్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వు అత్యవసరంగా అరశాతం వడ్డీరేట్లను తగ్గించడం, అలాగే దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటం, యెస్ బ్యాంక్ ఆర్థిక సంక్షోభంతో ఇప్పట్లో పెట్టుబడులు పెరిగే అవకాశాలేమి కనిపించడం లేదన్నారు.

### గల్ఫ్ షేర్లు ఢమాల్

**గల్ఫ్** దేశాల స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. ఇంధన ఉత్పత్తి తగ్గుదలకు సంబంధించి ఒపెక్, సభ్యదేశాల మధ్య అధికారిక ఒప్పందం కుదరకపోవడంతో ఆదివారం సౌదీ స్టాకులు కుప్పకూలాయి. శుక్రవారం బ్యారెల్ క్రూడాయిల్ ధర నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో సౌదీ అరేబియా స్టాక్ మార్కెట్లు ప్రారంభమైన నిమిషంలోనే 7.7 శాతం పతనం చెందాయి. వీటిలో ఇంధన దిగ్గజం సౌదీ అరామ్కో ఐపీవో ధర 32 రియాల్స్ (8.5 డాలర్లు) నుంచి 31.98 రియాల్స్‌కు పడిపోయింది. దుబాయి ఫైనాన్షియల్ మార్కెట్ 8.5 శాతం తగ్గగా, అబుదాబీ 7 శాతం, ఖతార్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 3.5 శాతం, కువైట్ బోర్స్ రెండు శాతం కోల్పోయాయి.

శివైక్యం చెందిన మాతా మాణికేశ్వరి పార్థివదేహాన్ని చూసేందుకు ఆదివారం తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కర్ణాటకలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు రాజుకుమార్, అమ్రయ్యగౌడ, బైరప్ప, ఉమేష్‌జాదవ్, బస్వారాజప్ప, తిప్పన్న, ఎమ్మెల్సీలు బీజీపాటిల్, యాద్గీర్ కలెక్టర్ శరత్ తదితరులు దర్శించుకున్నారు. మాణికేశ్వరి మాతా అంతిమ సంస్కారాలను సోమవారం యానగుంది ఆశ్రమంలోనే నిర్వహించనున్నారు.

- నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ



## గవర్నర్ హోలీ శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.



## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మహబుబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచలో ఆదివారం కల్లు గీత కార్మికులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాను సీఎం కేసీఆర్ రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచడంపై గౌడ కులస్థులు హర్షం వ్యక్తంచేశారు. - నర్సింహులపేట





ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతి దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

## అప్రమత్తతతోనే కరోనా నియంత్రణ

**మంత్రి ఈటల రాజేందర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేరళలో కొత్తగా ఐదు కరోనా కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సంబంధిత విభాగాలను ఆదేశించారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతి దవాఖానను మంత్రి ఆదివారం సందర్శించారు. దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఆయా దవాఖానల్లో ఏర్పాటుచేస్తున్న ఐసోలేషన్ వార్డులను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. ఛాతి దవాఖానలో 55 పడకల ఐసోలేషన్ వార్డును రెండు రోజుల్లో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇటీవల కేరళ రాష్ట్రాన్ని సందర్శించిన దవాఖాన సూపరింటెండెంట్ మహబూబ్‌ఖాన్‌తో అక్కడి ఉష్ణోగ్రతలు, వైరస్ వ్యాప్తి గురించి అడిగి తెలుసుకున్నారు. ముందస్తుచర్యల్లో భాగంగా జిల్లాకేంద్రాల్లో కూడా ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. అనంతరం ప్రైవేటు దవాఖానాల్లో ప్రదర్శించేందుకు కరోనా మార్గదర్శకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ కే చంద్రశేఖర్‌రావు, చీఫ్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి, ఆర్ఎంఓలు వినోద్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**గాంధీలో 17మందికి కరోనా పరీక్షలు**

విదేశాలకు వెళ్లివచ్చిన 17మందికి ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం గాంధీ దవాఖానలో కొవిడ్-19 పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వీరిని ఐసోలేషన్‌వార్డులో వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. పరీక్షల రిపోర్టులు సోమవారం వస్తాయని దవాఖాన అధికారులు తెలిపారు. కాగా ఇప్పటికే ఐసోలేషన్‌వార్డులో ఉన్న 19మంది అనుమానితులకు సంబంధించిన మెడికల్ రిపోర్టుల్లో నెగెటివ్ రావడంతో వారిని శనివారం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యాధికారులు చెప్పారు.

# గాలివాన బీభత్సం

## పలు జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్లు

- మక్కజొన్న, వరి పంటలకు నష్టం
- సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటు.. యువకుడి మృతి

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం తర్వాత కురిసిన వర్షానికి చాలాచోట్ల మక్కజొన్న, వరి తదితర పంటలను నష్టంవాటిల్లింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటుకు ఓ యువకుడు మరణించాడు. కరీంనగర్ జిల్లాకేంద్రంతోపాటు కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం, చొప్పదండి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. పలు గ్రామాల్లో ఇండ్లు, షెడ్లపై రేకులు ఎగిరిపోయాయి. అక్కడక్కడా చెట్లు విరిగిపడ్డాయి. రామడుగు, గంగాధర, వీణవంకలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మానకొండూర్ మండలం గంగిపల్లి, శంకరపట్నం మండలంలో కన్నాపూర్‌లో వడగండ్లు కురవడంతో మక్కజొన్న, వరి పంటకు నష్టం వాటిల్లింది.

**తడిసిన కందులు..**

ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. స్థానిక మార్కెట్ యార్డులో విక్రయించేందుకు తీసుకొచ్చిన కందులు తడిసిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని కుమ్మరోనిపల్లి, తిర్మలాపూర్ మాచారం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంతోపాటు మండలంలోని కాట్రియాల పర్వతాపూర్, ఝాన్సీలింగాపూర్ గ్రామాల్లో భారీ వర్షానికి స్తంభాలు ధ్వంసం అయ్యాయి. మక్కజొన్న నేలకొరిగింది.

✦ నిజామాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో పది నిమిషాలపాటు భారీగా వర్షం కురువగా.. జక్రాన్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల్లో స్వల్పంగా పడింది. బోధన్ మండలం సాలూర, కల్దుర్కి, పెగడాపల్లి ఓ మోస్తరు వాన పడింది. కోటగిరి మండలం సోంపూర్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్టు పడటంతో ఓ ఇంటి గోడ కూలింది. ఎడపల్లి మండలంలో అరగంటపాటు వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరగ్గా, రేకులషెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, గాంధారి మండలాలతోపాటు బాన్సువాడలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది.



కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో అకాల వర్షంతో నేలవాలిన మక్కజొన్న

**పిడుగుపాటుకు యువకుడి మృతి**

రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని ఓ అద్దె ఇంటిలో ఉంటున్న బొప్పాపూర్‌కు చెందిన మహ్మద్ అస్లాం(20) బంగ్లాపైకి ఎక్కి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో పిడుగుపడి మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో బాలుడికి గాయాలయ్యాయి.

**మరో మూడ్రోజులు వర్షసూచన**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, దానికి పరిసర ప్రాంతాల్లో 0.9 కి.మీ. ఎత్తున ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, కోస్తా కర్ణాటక నుంచి ఉత్తర తమిళనాడు వరకు 1.5 కి.మీ. ఎత్తున ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆదివారం గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావాలతో రాగల మూడ్రోజులు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

**బోధన్‌లో అత్యధికం..**

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అత్యధికంగా 3.9 సెం.మీ., కరీంనగర్ జిల్లాలో 3.0సెం.మీ., మెదక్ జిల్లా రామాయంపేటలో 2.9 సెం.మీ., యాదాద్రి భువనగిరి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 2.7 సెం.మీ., రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.2 సెం.మీ., గ్రేటర్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో 1.7 సెం.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది.

## ప్రశాంతంగా గ్రూప్-4 కంప్యూటర్ పరీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రూప్-4 సర్వీసెస్ పోస్టులకు కంప్యూటర్ ప్రొఫీషియన్సీ పరీక్షను 26 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్టు టీఎస్‌పీఎస్సీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. మొత్తం 7,468 మంది అభ్యర్థులకు 6,195 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపింది.

## మిక్సీలో బంగారం!

- శంషాబాద్ విమానాశ్రయంలో 932 గ్రాములు స్వాధీనం

**శంషాబాద్:** మిక్సర్‌గ్రైండర్‌లో స్మగ్లింగ్ చేస్తున్న బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం దుబాయ్ నుంచి ఎఫ్‌జెడ్ 435 విమానంలో వచ్చిన ప్రేమ్‌చంద్‌గుప్తా కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా మిక్సర్‌గ్రైండర్‌లో బంగారాన్ని గుర్తించారు. పూర్తిగా విడదీసి 932 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## చిన్నారి కిడ్నాప్


**మహాముత్తారం:** ఇంటిముందు ఆడుకుంటున్న ఏడాది బాలుడిని గుర్తుతెలియని వ్య క్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సిం గంపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కల్లుగిరి దుర్గేష్-పద్మల ఏడాది వయస్సున బాలుడిని తాతమ్మకు అప్పగించి ప నులకు వెళ్లారు. రోడ్డుకు దగ్గరగా ఇల్లు ఉండటంతో సాయంత్రం 4:30 గంటల సమయంలో తాతమ్మ వాకిట్లో బాలుడిని ఆడిస్తూ లోనికి వెళ్లింది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన దుండగులు బాలుడిని ఎత్తుకెళ్లారు. బయటకు వచ్చి చూడగా బాబు కనిపించకపోవడంతో వెంటనే బాలుడి తల్లిదండ్రులు సమాచారం ఇవ్వగా వారు మహాముత్తారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై చల్లా రాజు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

## మహిళపై గ్యాంగ్‌రేప్

**ఖిలావరంగల్:** మహిళా దినోత్సవం రోజున వరంగల్‌లో ఆదివారం రాత్రి ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ ఘటన కలకలం రేపింది. భర్త చనిపోయిన 52 ఏళ్ల అభాగ్యురాలిపై నలుగురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడినట్టు తెలిసింది. రక్తస్రావంతో అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉన్న బాధితురాలిని ఓ వ్యక్తి ఆటోలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎంజీఎం దవాఖానకు వెళ్లి అత్యాచారం ఘటనపై వివరాలు సేకరించారు. బాధిత మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొంటున్నాయి. కాగా, మహిళకు బలవంతంగా మద్యం తాగించి సామూహిక లైంగికదాడికి పాల్పడి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

# మహిళలు.. కార్యసాధకులు

- రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్
- మహిళలను గౌరవించడంలో ఆదర్శం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- రవీంద్రభారతిలో 30 మంది మహిళాప్రముఖులకు సన్మానం





రవీంద్రభారతిలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని తదితరులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** శ్రమించేతత్వం ఉన్న మహిళలు ఏ రంగంలోనైనా కార్యసాధకులు కాగలరని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజనశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహిళలు పురుషులతో సమానమని, ఏ రంగంలోనైనా దూసుకుపోగలరని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వివిధ రంగాలకు చెందిన 30 మంది మహిళలను సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మ హిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. బాలికలు, యువతుల విద్య, వైద్యం, ఆరోగ్యం కోసం పాటుపడుతున్నారని తెలిపారు.

**భారత సంస్కృతిలో మహిళలకు అత్యున్నత స్థానం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

భారత సంస్కృతిలో, జీవనవిధానంలో మహిళలకు అత్యున్నతస్థానం ఉన్నదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. స్త్రీలు గౌరవంపొందేచోట దేవతలుంటారని పెద్దలు చెప్పేవారని అన్నారు. ఈ విషయంలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా ఉన్నదని చెప్పారు. తెలంగాణలో షీటీమ్స్ అద్భుతంగా పనిచేస్తున్నాయని కిషన్‌రెడ్డి ప్రశంసించారు.

**మహిళలకు పెద్దన్నగా కేసీఆర్: శ్రీనివాస్ గౌడ్**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మహిళలు, యువతుల పట్ల పెద్దన్నగా వ్యవహరిస్తూ.. అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డులు, పురస్కారాలు ఇచ్చిన దాఖలా లేదన్నారు.

**మహిళల అభివృద్ధికి వందల కోట్లు : తలసాని**

స్త్రీ, శిశు సంక్షేమ విభాగానికి వందల కోట్ల నిధులు కేటాయించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. అంగన్‌వాడీలకు పదివేల జీతం ఒకేసారి పెంచి, వారి కండ్లల్లో సంతోషాన్ని నింపారన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ దివ్యదేవరాజన్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లి కాదు.. పులే

ఈ చిత్రంలో కనిపించేది పిల్లి అనుకుంటున్నారా..? అయితే తప్పులో కాలేసినట్టే. అది ముమ్మాటికి పులి పిల్లే. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం భవానీపేట శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం పిల్లుల మాదిరిగా ఉన్న రెండు జీవులను స్థానికులుచూసి అటవీ రేంజ్ అధికారి చంద్రకాంత్‌రెడ్డికి సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకొన్న ఆయన దానిని చిరుత పిల్లగా గుర్తించారు. శనివారం సాయంత్రం జన్మించి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని జూపార్కు సిబ్బంది వచ్చి చిరుత పిల్లను తీసుకెళ్లారు. తప్పించుకున్న మరో పిల్ల ఆచూకీ గుర్తించడానికి సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. - లింగంపేట



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ తదితరులు

## కోటలను రక్షించుకుందాం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**న్యూశాయంపేట:** రాచకొండ, దేవరకొండ కోటల పరిరక్షణతో భావితరాలకు చరిత్రను అందించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హన్మకొండ వెలమ సంక్షేమ భవనంలో ప్రముఖ రచయిత డాక్టర్ పేరాల సుధాకర్‌రావు రచించిన 'హిస్టరీ ఆఫ్ తెలుగు కింగ్ డమ్ రాచకొండ, దేవరకొండ' పుస్తకాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాచకొండ, దేవరకొండ కోటల్ని పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. భారత ఉపఖండాన్ని పాలించిన తొలి మహిళ రుద్రమదేవి అయితే, చరిత్రకారులు.. రజియా సుల్తానాను మొదటి పాలకురాలిగా పేర్కొని చరిత్రను వక్రీకరించారని అన్నారు. అనంతరం రచయిత డాక్టర్ పేరాల సుధాకర్‌రావును సన్మానించారు.

## ❖ 'నమస్తే తెలంగాణ' జర్నలిస్ట్‌కు అవార్డు





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నమస్తేతెలంగాణ' జర్నలిస్ట్ నాగపురి సౌమ్య 'లేడీ లెజెండ్ అవార్డ్స్-2020'ను అందుకున్నారు. బెక్కం టి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, అవార్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణించిన 99మంది మహిళలకు అవార్డులు అందజేశారు. అందులో సౌమ్య కూడా ఉన్నారు. - భద్రాచలం, నమస్తేతెలంగాణ

# మారుతీరావు బలవన్మరణం

## ప్రణయ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు

- కేసులతో మానసిక ఒత్తిడి
- తోడైన సుపారీ గ్యాంగ్ బ్లాక్‌మెయిల్!

**ఖైరతాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో ఆత్మహత్య**


**హైదరాబాద్‌సిటీబ్యూరో / ఖైరతాబాద్/ సుల్తాన్ బజార్/మిర్యాలగూడ, నమస్తేతెలంగాణ:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వ్యాపారవేత్త మారుతీరావు బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన కూతురు అమృత వర్షిణి కులాంతర వివాహాన్ని తట్టుకోలేకపోయాడు. 2018 సెప్టెంబర్ 14న జరిగిన అమృత భర్త ప్రణయ్ హత్యకేసులో మారుతీరావు నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో జైలుకు కూడా వెళ్లొచ్చాడు. ఇటీవల ఈ కేసు కోర్టులో ట్రయల్‌కు వచ్చింది. ప్రణయ్ హత్యానంతరం బంధువులతో మనస్పర్థలు.. సుపారీ గ్యాంగ్ ఒత్తిడితో కుంగిపోయిన మారుతీరావు శనివారం రాత్రి హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

**న్యాయవాదిని కలిసేందుకు వచ్చి..**

ప్రణయ్ హత్య కేసుకు సంబంధించి న్యాయవాదిని కలిసేందుకు శనివారం హైదరాబాద్‌కు వచ్చిన మారుతీరావు ఖైరతాబాద్‌లోని ఆర్యవైశ్యభవన్‌లో 306 సూట్‌ను అద్దెకు తీసుకున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో కారు డ్రైవర్ రాజేశ్‌తో కలిసి ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద గారెలు తెచ్చుకున్నాడు. రాజేశ్‌ను కారులోనే నిద్రించాలని చెప్పి, తాను గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు రాజేశ్ వెళ్లి తలుపు తట్టగా మారుతీరావు నుంచి సమాధానం రాలేదు. ఉదయం 7.30 గంటలకు మరోసారి పిలిచాడు. స్పందనలేకపోవడంతో మారుతీరావు భార్య గిరిజకు, పోలీసులకు సమాచారమిచ్చాడు. అక్కడికి చేరుకొన్న పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా.. మంచంమీద విగతజీవిగా కనిపించాడు. బెడ్‌పై సెల్‌ఫోన్, దవాఖానకు సంబంధించిన ప్రిస్క్రిప్షన్, కారు పత్రాలతోపాటు 'గిరిజా క్షమించు.. అమృతా, అమ్మ దగ్గరకు రా..' అని రాసి ఉన్న సూసైడ్ నోట్ లభించింది. బెడ్‌పైన వాంతి చేసుకున్న ఆనవాళ్లు ఉండటంతో క్లూస్‌టీం సభ్యులు వాటిని సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కాగా, పురుగుల మందు ఎక్కడి నుంచి తెచ్చుకున్నాడన్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**పరువుహత్యతో అభాసుపాలు..**

మారుతీరావు ఏకైక కుమార్తె అమృతవర్షిణి. అమృత 2018 మేలో మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటకు చెందిన ప్రణయ్ కుమార్‌ను ప్రేమించి హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెండ్లి చేసుకున్నారు. 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్‌ను కిరాయి వ్యక్తులు హత్య చేయగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మారుతీరావు సెప్టెంబర్ 15న పోలీసులకు లొంగిపోయాడు. ఏడు నెలలపాటు జైలులోనే ఉన్న అతను బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మధ్యవర్తుల ద్వారా తన బిడ్డను ఇంటికి పిలిపించుకునేందుకు యత్నించాడు.



మారుతీరావు (ఫైల్)

అందుకు అమృత అంగీకరించలేదు. గత డిసెంబర్‌లోనూ మరోమారు మధ్యవర్తుల ద్వారా ఒత్తిడి చేయగా అమృత పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రెండోసారి అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో సైతం మారుతీరావు 20రోజులు జైలులో ఉండి బెయిల్‌పై విడుదలయ్యాడు.

**వెంటాడిన కేసులు..**

ప్రణయ్ హత్య తరువాత జరిగిన పరిణామాల గురించి సైఫాబాద్ పోలీసులు మిర్యాలగూడ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. హత్య కేసులో నల్లగొండ పోలీసులు పక్కా ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేయగా.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రత్యేక కోర్టులో విచారణ తుదిదశకు చేరుకున్నది. ఈ కేసులో తనకు శిక్షపడే అవకాశాలున్నాయనే భయంతో మారుతీరావు మానసికంగా కుంగిపోయాడు. ఇటీవల తన గోదాంలోనూ గుర్తుతెలియని మృతదేహం లభించడంతో పోలీసులు విచారిస్తున్నారు. ప్రణయ్ హత్య తరువాత కూతురితోపాటు దగ్గరి బంధువులు కూడా తనతో సరిగ్గా ఉండటం లేదనే ఆవేదనతో తీవ్ర ఒత్తిడికి గురైనట్టు సమాచారం.

**డబ్బుల కోసం హంతకుల ఒత్తిడి..**

ప్రణయ్ హత్య కేసులో నిందితుల నుంచి మారుతీరావు బ్లాక్‌మెయిలింగ్‌కు గురైనట్టు తెలుస్తున్నది. ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వకపోవడంతో సుపారీ గ్యాంగ్‌తో మారుతీరావుకు విభేదాలు వచ్చినట్టు సమాచారం. హత్యకేసులో ప్రధాన నిందితుడిగా మారుతీరావు ఉండగా.. సుభాష్‌శర్మ, హజ్గర్ అలీ, మహ్మద్‌బారీ, కరీం, శ్రవణ్, శివ నిందితులుగా ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు మారుతీరావును బెదిరించి, ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వకపోతే పోలీసులకు అప్రూవర్లుగా మారుతామని బెదిరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆందోళనకు గురైన మారుతీరావు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

**ఉస్మానియాలో పోస్టుమార్టం**

ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ సుధాకర్ నేతృత్వంలోని వైద్యుల బృందం మారుతీరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం ఆయన మృతదేహాన్ని భార్య గిరిజ, సోదరుడు శ్రావణ్‌కు అప్పగించారు. మారుతీరావు అంత్యక్రియలను మిర్యాలగూడలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమృత, మారుతీరావు ఇండ్ల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఈ విషయమై అమృత మాట్లాడుతూ.. ప్రణయ్‌ను చంపినందుకు పశ్చాత్తాపంతోనే మారుతీరావు ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని మీడియాతో అన్నారు.

## మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి మంత్రి సత్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా 11వ ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని పీ ముత్యసాయి ప్రియాంకను విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆదివారం సన్మానించారు. విద్యాసంస్థ ప్రోత్సాహకంగా ఇచ్చిన రూ.10 వేల చెక్కును కూడా మంత్రి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విద్యార్థినికి అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మాస్టర్‌మైండ్స్ యాజమాన్యాన్ని, బ్రాంచి జోనల్ అడ్మిన్ ఇంచార్జి ఎస్ఎం వలి, బ్రాంచి అకడమిక్ ప్రిన్సిపాల్ బాలాజీ నాగేంద్ర, సత్యంబాబు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

## ఎయిర్‌షోకు కరోనా ఎఫెక్ట్

- సామాన్యులకు నో ఎంట్రీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏటా హైదరాబాద్‌లోని బేగంపేట్ విమానాశ్రయంలో నిర్వహించే ఎయిర్‌షోపై ఈసారి కరోనా ప్రభావం పడింది. 'వింగ్స్ ఇండియా-2020' పేరిట ఈ నెల 12నుంచి 15వరకు నిర్వహించనున్న వైమానిక ప్రదర్శనకు సామాన్యులను అనుమతించరాదని నిర్ణయించారు. ఏరోస్పేస్ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలను మాత్రమే అనుమతించనున్నారు. విదేశీ ప్రతినిధులను కూడా తక్కువ సంఖ్యలో అనుమతించాలని నిర్ణయించారు. ఈ ప్రదర్శన కోసం బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో చేసిన ఏర్పాట్లపై కేంద్ర పౌరవిమానయానశాఖ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ కరోలా ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ నెల 13న సదస్సును రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. 14న కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పురి పాల్గొననున్నారు. ఈ సమావేశంలో సీఎస్ సోమేశ్‌కుమార్, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
# ఆట
10
[ కరీంనగర్ ]
సోమవారం 9 మార్చి 2020
WWW.NTNEWS.COM

# అయ్యో అమ్మాయిలు!

## టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఓటమి.. 85 పరుగులతో ఆస్ట్రేలియా విజయం.. ఐదోసారి కప్ కైవసం

**జూలై 9, 2019**

### ఐసీసీ వన్డే ప్రపంచకప్ సెమీస్..

లీగ్ దశలో విజృంభించిన టీమ్ఇండియా సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలైంది. లక్ష్యం పెద్దది కాకపోయినా.. ఒత్తిడికి చిత్తైన కోహ్లీ సేన లక్ష్యానికి 18 పరుగుల దూరంలో నిలిచిపోయి భారంగా ఇంటి బాటపట్టింది.


రోహిత్

**ఫిబ్రవరి 9, 2020**

### ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ ఫైనల్..

గ్రూప్‌లో అజేయంగా నిలచిన యువ భారత్.. క్వార్టర్స్‌లో ఆస్ట్రేలియాను, సెమీస్‌లో పాకిస్థాన్‌ను మట్టికరిపించి తుదిపోరుకు చేరింది. ఒక్క విజయం సాధిస్తే ట్రోఫీ సొంతమవుతుందనుకున్న తరుణంలో బంగ్లాదేశ్ చేతిలో ఓడి రిక్తహస్తాలతో వెనుదిరిగింది.


యశస్వి

**మార్చి 8, 2020**

### ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్..

ఓటమి ఎరుగకుండా గ్రూప్ దశను ముగించిన భారత జట్టు.. వర్షం కారణంగా సెమీఫైనల్ రద్దుకావడంతో నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇంకేముంది మరొక్క మ్యాచ్ నెగ్గితే విశ్వకిరీటం మనదే అనుకుంటే మరోమారు కూడా భారతీయులకు నిరాశే ఎదురైంది.


షఫాలీ






> మా జట్టుపై నాకు నమ్మకముంది. లీగ్ దశలో గొప్పగా ఆడాం. ఆటలో గెలుపోటములు సహజం. తిరిగి పుంజుకుంటాం. దురదృష్టవశాత్తు ఈరోజు మేం క్యాచ్‌లు జారవిడిచాం. భవిష్యత్తులో గొప్పగా రాణిస్తామనే నమ్మకముంది. షఫాలీకి ఇదే తొలి ప్రపంచకప్. జట్టు కోసం ఆమె ఎంతో పోరాడింది.
>
> -హర్మన్, భారత కెప్టెన్

**ప్రైజ్‌మనీ**

ఆస్ట్రేలియా 7.40 కోట్లు
భారత్ 3.70 కోట్లు

**మొన్న రోహిత్ రోదిస్తే.. నిన్న యశస్వి జైస్వాల్ వేదనకు గురయ్యాడు. తాజాగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు మన అమ్మాయిలు చరిత్ర తిరుగరాస్తారనుకుంటే.. అదీ సాధ్యపడలేదు. కలల కప్పును ముద్దాడాలనుకున్న హర్మన్ బృందం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. అదిరిపోయే విజయాలతో ఫైనల్ చేరిన టీమ్ఇండియా.. మొదట బౌలింగ్‌లో ఆకట్టుకోలేక.. ఆనక బ్యాటింగ్‌లోనూ మ్యాజిక్ చేయలేక.. ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకోలేక.. భారమైన గుండెలతో.. తడబడుతున్న అడుగులతో.. రన్నరప్‌తో సంతృప్తిపడింది.**

**మెల్‌బోర్న్:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో అజేయంగా ఫైనల్‌కు చేరిన భారత జట్టు.. తుదిపోరులో తడబడింది. ఆదివారం ఎంసీజీలో జరిగిన ఆఖరాటలో 85 పరుగుల తేడాతో ఓటమి పాలైన టీమ్ఇండియా రన్నరప్‌తో సరిపెట్టుకుంటే.. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఐదోసారి సగర్వంగా కప్పును ముద్దాడింది. ఓపెనర్లు ఎలీసా హేలీ (39 బంతుల్లో 75; 7 ఫోర్లు, 5 సిక్సర్లు), బెత్ మూనీ (54 బంతుల్లో 78 నాటౌట్; 10 ఫోర్లు) అర్ధశతకాలతో రెచ్చిపోవడంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లకు 184 పరుగులు చేసింది. పూనమ్ యాదవ్ (1/30) పెద్దగా ప్రభావం చూపలేకపోగా.. మరో స్పిన్నర్ దీప్తి శర్మ (2/38) ఫర్వాలేదనిపించింది. అనంతరం లక్ష్యఛేనలో భారత్ 19.1 ఓవర్లలో 99 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (33; 2 ఫోర్లు) టాప్‌స్కోరర్. ఆసీస్ బౌలర్లలో షుట్ (4/18), జెస్ జొనాసెన్ (3/20) విజృంభించారు. హేలీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', మూనీకి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి.


### ఆ రెండు క్యాచ్‌లు పట్టుంటే..

ఓపెనర్లిద్దరూ దంచి కొట్టడంతో ఆసీస్‌కు శుభారంభం దక్కింది. దీప్తి వేసిన తొలి ఓవర్ ఐదో బంతికి హేలీ క్యాచ్‌ను షఫాలీ వదిలేస్తే.. నాలుగో ఓవర్‌లో మూనీ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను రాజేశ్వరి నేలపాలు చేసింది. మొదట్లో మూనీ కాస్త సంయమనం పాటించినా.. హేలీ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. భార్య మ్యాచ్ చూసేందుకు దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగొచ్చిన స్టార్క్ స్టాండ్స్‌లో కూర్చొని ప్రోత్సహిస్తుంటే.. హేలీ భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. తొలి వికెట్‌కు 11.3 ఓవర్లలోనే 115 పరుగులు జోడించాక రాధ ఈ జోడీని విడదీసింది. ఆ తర్వాత లానింగ్ (16), గార్డ్నర్ (2), హైన్స్ (4), నికోలా (5) పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. క్రీజులో పాతుకుపోయిన మూనీ వరుస బౌండ్రీలతో జట్టుకు భారీ స్కోరు అందించింది.

### ఒకరి వెంట ఒకరు..

బ్యాటింగ్‌కు దిగకముందే సగం మ్యాచ్ ఓడిన భారత అమ్మాయిలకు తొలి ఓవర్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టోర్నీ ఆసాంతం రెచ్చిపోయి ఆడిన యువ ఓపెనర్ షఫాలీ వర్మ (2) అసలు పోరులో విఫలమైంది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తానియా (2) రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగితే.. జెమీమా (0) సున్నా చుట్టింది. ఆదుకుంటారనుకున్న సీనియర్లు స్మృతి మంధాన (11), హర్మన్‌ప్రీత్ కౌర్ (4) కూడా చేతులెత్తేయడంతో.. భారత జట్టు 40 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. దీప్తి, వేద (19), రిచా (18) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పరిమితమైంది.

## మెల్‌బోర్న్@86,174



మహిళల క్రికెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం ఎంసీజీలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను 86,174 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఐసీసీ మహిళల క్రికెట్‌లో ఇంత మంది అభిమానులు మైదానానికి తరలిరావడం ఇదే తొలిసారి.

### అచ్చం అలాగే..

ఫైనల్ మ్యాచ్ చూసిన అభిమానులకు పదిహేడేండ్ల క్రితం పురుషుల వన్డే ప్రపంచకప్ తుదిపోరు గుర్తుకు రాకమానదు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం (మార్చి 23, 2003).. పురుషుల క్రికెట్‌లో సౌరవ్ గంగూలీ నాయకత్వంలోని భారత జట్టు ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరింది. అప్పుడు కూడా ప్రత్యర్థి ఆస్ట్రేలియానే. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగిన రికీ పాంటింగ్ సేన.. అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ ఫైనల్ చేరితే.. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అద్వితీయ ప్రదర్శనతో టీమ్ఇండియా తుదిపోరుకు అర్హత సాధించింది. జొహాన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గంగూలీ.. ఆసీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించగా.. తాజా మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కంగారూలు కూడా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఆ మ్యాచ్‌లోనూ ఓపెనర్లు దంచికొట్టడంతో కంగారూలకు శుభారంభం దక్కగా.. ఆదివారం మ్యాచ్‌లోనూ ఓపెనర్లే విధ్వంసం సృష్టించారు. ఆ రోజు తొలి ఓవర్ వేసిన జహీర్ ఖాన్ 15 పరుగులు సమర్పించుకుంటే.. ఇప్పుడు దీప్తి శర్మ 14 రన్స్ ఇచ్చింది. టోర్నీ ఆసాంతం రాణించిన సచిన్ అప్పుడు తొలి ఓవర్‌లోనే ఔటైతే.. ఇప్పుడు షఫాలీ వర్మ మాస్టర్‌ను అనుసరించింది.

**5** ఆస్ట్రేలియా ప్రపంచకప్ నెగ్గడం ఇది ఐదోసారి. ఆరుసార్లు ఫైనల్ చేరిన ఆ జట్టు కేవలం ఒకే సారి తుదిపోరులో పరాజయం పాలైంది.

**1**

- పరుగుల పరంగా టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఇదే భారీ గెలుపు.
- మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఓ జట్టు ఓపెనర్లు 75 పరుగులకు పైగా చేయడం ఇదే తొలిసారి.
- ఐసీసీ టోర్నీ ఫైనల్లో వేగవంతమైన అర్ధశతకం బాదిన ప్లేయర్‌గా హార్దిక్ పాండ్య (32 బంతులో) రికార్డును హేలీ (30 బంతుల్లో) తిరగరాసింది.

**అత్యధిక పరుగులు** - మూనీ (ఆస్ట్రేలియా, 259)
**అత్యధిక వికెట్లు** - మేగన్ షుట్ (ఆస్ట్రేలియా, 13)




### స్కోరు బోర్డు

**ఆస్ట్రేలియా:** హేలీ (సి) వేద (బి) రాధ 75, మూనీ (నాటౌట్) 78, లానింగ్ (సి) శిఖ (బి) దీప్తి 16, గార్డ్నర్ (స్టంప్డ్) తానియా (బి) దీప్తి 2, హైన్స్ (బి) పూనమ్ 4, నికోలా (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 20 ఓవర్లలో 184/4. **వికెట్ల పతనం:** 1-115, 2-154, 3-156, 4-176, **బౌలింగ్:** దీప్తి 4-0-38-2, శిఖ 4-0-52-0, రాజేశ్వరి 4-0-29-0, పూనమ్ 4-0-30-1, రాధ 4-0-34-1.

**భారత్:** షఫాలి (సి) హేలీ (బి) షుట్ 2, మంధాన (సి) నికోలా (బి) మొలినెక్స్ 11, తానియా (రిటైర్డ్‌హర్ట్) 2, జెమీమా (సి) నికోలా (బి) జెస్ జొనాసెన్ 0, హర్మన్ (సి) గార్డ్నర్ (బి) జెస్ జాన్సన్ 4, దీప్తి (సి) మూనీ (బి) నికోలా 33, వేద (సి) జెస్ జొనాసెన్ (బి) డెలిస్సా 19, రిచా (సి) నికోలా (బి) షుట్ 18, శిఖ (సి) మూనీ (బి) షుట్ 2, రాధ (సి) మూనీ (బి) జెస్ జొనాసెన్ 1, పూనమ్ (సి) గార్డ్నర్ (బి) షుట్ 1, రాజేశ్వరి (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 5, **మొత్తం:** 19.1 ఓవర్లలో 99 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-2, 1-5*, 2-8, 3-18, 4-30, 5-58, 6-88, 7-92, 8-96, 9-97, 10-99, **బౌలింగ్:** షుట్ 3.1-0-18-4, జెస్ జొనాసెన్ 4-0-23-3, మొలినెక్స్ 4-0-21-1, డెలిస్సా 4-0-17-1, నికోలా 4-0-23-1.



### ఇక్కడైతే భార్యకు బానిస అనేటోళ్లు

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భార్య ఎలీసా హేలీ ఆటను చూసేందుకు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్.. దక్షిణాఫ్రికా సిరీస్ మధ్యలోనే స్వదేశానికి వచ్చేశాడు. ఈ విషయంపై భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సరదాగా స్పందించింది. స్టార్క్ చేసిన పనికి ఉపఖండంలోనైతే అతడిని భార్యకు బానిస అనేవారంటూ ట్వీట్ చేసింది. 'అతడు ఉపఖండానికి(భారత్, పాక్, బంగ్లాదేశ్) చెందిన వ్యక్తి(స్టార్క్) అయితే మరు క్షణంలోనే 'జోరూ కా గులాం' (భార్యకు బానిస) అని కచ్చితంగా అనేవారు. స్టార్క్ మంచి పనిచేశాడు' అని సానియా ట్వీట్ చేసింది.

### ధవన్, హార్దిక్, భువీ రీఎంట్రీ

**అహ్మదాబాద్:** గాయాల నుంచి కోలుకున్న ఓపెనర్ శిఖర్ ధవన్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, పేసర్ భువనేశ్వర్ కుమార్.. భారత జట్టులోకి మళ్లీ వచ్చేశారు. ఈనెల 12వ తేదీ నుంచి దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరుగనున్న మూడు వన్డేల సిరీస్‌కు వీరు ఎంపికయ్యారు. కొత్త చైర్మన్ సునీల్ జోషి నేతృత్వంలో ఆదివారం ఇక్కడ సమావేశమైన సెలెక్షన్ కమిటీ భారత జట్టును ఎంపిక చేసింది. కేదార్ జాదవ్ స్థానంలో శుభ్‌మన్ గిల్ జట్టులోకి రాగా రోహిత్ శర్మకు విశ్రాంతి నిచ్చారు.

### ముగ్గురికి టోక్యో బెర్తు

**అమన్(జోర్డాన్):** పూజరాణి(75కి), లోవ్లీనా బొర్గొహెయిన్(69కి), వికాస్ క్రిషన్ (69కి).. టోక్యో ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్నారు. ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో సెమీస్‌లోకి ప్రవేశించడం ద్వారా వీరు టోక్యో విశ్వక్రీడలకు అర్హత సాధించారు. ఆదివారం జరిగిన వేర్వేరు క్వార్టర్స్ బౌట్లలో విజయాలు సాధించారు. మరో క్వార్టర్స్‌లో సచిన్ 2-3తో చెన్ చేతిలో ఓడాడు.



హీరో వారినుంచి ప్రపంచపు ప్రముఖ బ్రాండ్స్
Splendor+ | Super Splendor | iSmart+ | Passion | Glamour | HF Deluxe | Maestro Edge 125 | Pleasure+ | Duet | Destini 125 | Xpulse 200T | Xpulse 200 | Xtreme 200R | Xtreme 200S


Authorised Dealers - Karimnagar: Bharadwaj Hero, Ph: 7799766341. Devesh Hero, Ph: 7799766346. Ramagundam: Siddi Shri Vinayaka Hero, Ph: 9817009247. Mancherial: Balaji Hero, Ph: 7799766326. Adilabad: Chandra Hero, Ph:7799766397.

Authorised Service Centres - Jagityal: Ravi Teja Motors, Ph: 98666 24312, 96039 67071. Siddipet: Master Motors, Ph: 99088 02229, 96521 12282. Sircilla: Arif Motors, Ph: 91337 86757. Metpalli: Harihar Enterprises, Ph: 9441873338, 8523803388. Korutla: Shri Rama Motors, Ph: 08725-254666, 99899 07676. Peddapalli: Shri Sai Maruti Motors, Ph: 98662 06602, 95020 73443. Nirmal: Sai Chandra Motors, Ph: 08734-242984 / 85209 12777. Kaghaznagar: Manish Motors, Ph: 9848849975. Bellampalli: R.K. Enterprises, Ph: 9849 302384.

Authorised Representative Dealers: Bhainsa: Tirumala Enterprises, Ph: 9440349120. Utnoor: Shri Chandra Motors, Ph: 9959876486. Ichoda: Ichoda Motors, Ph: 9440757883. Asifabad: Shivani Motors, Ph: 9440010306. Bodh: Mahalakshmi Motors, Ph: 9440037842. Manda: Manda Motors, Ph: 9701494879. Mandamarri: Jagadamba Motors, Ph: 9440922683. Tandur: Shri Vigneshwara Motors, Ph: 9440443676. Chennur: Karthikeya Motors, Ph: 9985589955. Lakshettipet: Shri Srinivasa Motors, Ph: 9246234143. Banswada: Shri Srinivasa Motors, Ph: 9705675700. Yellareddy: Shiva Sai Motors, Ph: 9440288498. Ramayampet: Shiva Motors, Ph: 9912475028. Dharpalli: Venkateshwara Motors, Ph: 9493244488. Lingampeta: Vigneshwar Motors, Ph: 9553465555. Dichpally: Narasimha Motors, Ph: 9966550026. Machareddy: Balaji Motors, Ph: 9494624242. Bikaner: Ganesh Motors, Ph: 9441134175. Choppadandi: Shri Sai Motors, Ph: 9848793898. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Sultanabad: Shri Sai Surya Motors, Ph: 9849473568. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Humnabad: Sahiti Motors, Ph: 9866260441. Yellareddypet: United Motors, Ph: 9951406077. Vemulawada: Siri Motors, Ph: 9000857772. Bejjanki: Narmada Motors, Ph: 9440825483. Mulkanoor: Sampath Motors, Ph: 7032826995. Manthani: Shivasankar Automobiles, Ph: 8074655686. Rayekal: Harika Motors, Ph: 9000188393. Gollapalli: Shri Amrutha Motor, Ph: 9989151651. Dharmaram: Shri Dhanya Motors, Ph: 9642020222. Dharmapuri: R R Motors, Ph: 9849004221. Armoor: Venkateshwara Motors, Ph: 9848522331. Bichkunda: Shri Lakshmi Motors, Ph: 9491740244. Bhingal: Shri Lakshmi Narasimha Motors, Ph: 9848258736. Kamarapalli: Harihara Motors, Ph: 9948555525. Nandipet: Shri Lakshmi Motors, Ph: 9963149399. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Gangadhar: R K Motors, Ph: 9394551432.

నమస్తే తెలంగాణ
# జిందగీ
సోమవారం 9 మార్చి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi

సక్సెస్ మంత్ర



ఒకప్పుడు మనం వాడే ప్రతి వస్తువును వృత్తి కళాకారులే తయారు చేసేవారు. కానీ ఆధునిక ప్రపంచంలో వారి కళకు ఆదరణ లేకపోవడంతో ఆయా వస్తువులకు కూడా ఆదరణ కరువైంది. మనదేశంలో మెట్రో నగరాల్లో, విదేశాల్లో నివసించేవారు.. కళాకారులను, వృత్తినిపుణులను, వారి కళా నైపుణ్యాన్ని తక్కువచేసి మాట్లాడుతుంటారు. యంత్రాలపై తయారైన వస్తువులను చూసిన కళ్లు నేడు వృత్తికళను చూడలేకపోతున్నాయి. దీంతో మనమంతా భారతీయ హస్తకళల ప్రాభవాన్ని, చారిత్రాత్మక శకాన్ని కోల్పోయాం. ఇవాళ్టి హస్త కళాకారులు గ్రామాల్లో జీవించలేని స్థితిలో ఉన్నారనే ప్రాథమిక విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు. పనికోసమే జీవితాలను ధారపోసే వారి గురించే మరిచిపోయాం. అలాంటి వారికోసం మూడు దశాబ్దాలుగా పనిచేస్తూ భారతీయ హస్తకళకు జీవం పోస్తున్నారామె.ఎంతోమంది కళాకారులకు చేయూత-గ్రామీణ భారత చేతివృత్తులను విశ్వవ్యాప్తం చేసేందుకు నిరంతర కృషి-ఉపాధినిచ్చే కళాత్మక వ్యాపారంతో భరోసా నిస్తున్న 'దస్తకార్' చైర్ పర్సన్ లైలా త్యాబ్జీ సక్సెస్‌మంత్ర.

## కళ ఉంది.. కానీ..
# అమ్మడం తెలియదని..

**ప్రతి మనిషిలో** ఏదో ఒక కళ ఉంటుంది. అయితే దాన్ని ఆచరణలో పెట్టినపుడే దాని ప్రయోజనం, ఫలాలు అందుతాయి. ఆ కళను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఇప్పుడు అలాంటి వ్యాపార పాఠాలనే చెబుతున్నారు ప్రముఖ హస్తకళాకారిణి లైలాత్యాబ్జీ. గ్రామీణ భారతానికి పునర్వైభవం తెచ్చేందుకు ఆమె ఎంచుకున్న వ్యాపార మార్గం హస్తకళలు. 'దస్తకార్' సంస్థ స్థాపన ద్వారా ఈ కళను పోషిస్తూ ఎంతోమంది చేతి వృత్తుల వారికి చేయూతనివ్వడమే కాకుండా.. వృత్తిగతంగా, వ్యక్తిగతంగా ఆత్మసంతృప్తిని పొందుతున్నానంటున్నారు లైలా. లైలాత్యాబ్జీ, మూడు దశాబ్దాల దస్తకార్ (హస్తకళల)కు నిలువెత్తు సాక్ష్యం. చేతివృత్తులు, హస్తకళాకారులు, వారి జీవితాల లోతుల్ని చాలా దగ్గరగా పరిశీలించారు లైలా. వారి అంతరంగాల్ని అధ్యయనం చేశారామె.

### సంతృప్తినిచ్చే వ్యాపారం

దస్తకార్ నేచర్ బజార్ ద్వారా లైలా అవసరమైన చిన్న చిన్న సలహాలను ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లకు అందిస్తున్నది. నువ్వు వ్యాపారవేత్తగా ఎదగాలని నిర్ణయించుకుంటే లేదా నీ వృత్తిని నువ్వు ఎన్నుకోవాలనుకుంటే.. హస్తకళారంగం ఎంతో మంచిది. ఇది ప్రత్యేకమైన అవకాశం ..ఇక్కడా పోటీగా ఎక్కువమంది వ్యాపారవేత్తలు వుండే అవకాశం లేదు. పైగా నీకు ఈ పనివల్ల రెండింతలు సంతృప్తి కూడా లభిస్తుంది. అవసరమైన వాళ్లకు ఉపాధిని కల్పిస్తున్నామనే భావన కలుగుతుంది. అంటూ 'దస్తకార్' ద్వారా హస్తకళాకారులకు కలిగే లాభాలను తెలిపారు లైలా త్యాబ్జీ. ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఇలాంటి రంగాన్ని ఎన్నుకోవాలని కూడా సూచిస్తున్నారు.

### దస్తకార్ స్థాపన

'గ్రామీణ భారతంలో 70 లక్షల మందికిపైగా హస్తకళాకారులున్నారు. దేశానికి వెన్నెముకగా ఉంటూ గ్రామీణ ఆర్థిక స్థితి బలోపేతానికి పరోక్షంగా వీరే ఆధారం. ఆర్థిక భద్రత విషయంలో మహిళలు ఇంకా ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు. సామాజిక, ఆర్థిక స్వేచ్ఛకోసం గ్రామీణ మహిళలు హస్తకళలపైనే ఆధారపడుతున్నారు. వాటికి గిరాకీ ఉంది. కానీ మార్కెట్ చేసే విషయంలోనే ఇబ్బందులు వస్తున్నాయి. అందుకే 1981లో 'దస్తకార్'ను స్థాపించాం. దీనివల్ల చేనేత, హస్తకళాకారులకు ఎంతో కొంత సాయం చేయాలనేది ప్రధాన ఉద్దేశం. మరీ ముఖ్యంగా మహిళలు తమ సంప్రదాయబద్ధమైన హస్తకళా నైపుణ్యంతో స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఈ పనిని ఆదాయ వనరుగా మార్చడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించగలుగుతారు' అంటారు లైలాత్యాబ్జీ.

### సంస్కృతిని గౌరవిస్తూ..

దస్తకార్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకూ కూడా హస్తకళల వైభవాన్ని చాటుతూనే ఉన్నారు. వృత్తి నిపుణులు, హస్తకళ పరిశ్రమను మరింత చైతన్యవంతం చేయాలనుకునే మహిళలకు లైలా త్యాబ్జీ సుపరిచితురాలే. సంప్రదాయ విలువలను కాపాడేలా వస్త్రాలను, వస్తువులను రూపొందించాలనే ఆమె ఆరాటాన్ని తన ఆహార్యం, జీవన విధానం ద్వారానే తెలుసుకోవచ్చు. ఎప్పుడూ చీర కట్టుతో నిండుదనంతో, భారతీయ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా కనబడతారు లైలాత్యాబ్జీ. 'హస్తకళలపై ఆధారపడి జీవితాలను ముందుకు నడిపే ఈ గ్రామీణ కళాకారులు తయారు చేసే ఉత్పత్తులను సరిగ్గా ఎవరూ మార్కెట్ చేయరు. వీళ్లెలా పనిచేయగలరు..? వీళ్ల అద్భుతమైన ప్రతిభను ప్రపంచానికి చూపించడానికి మనం ఎంతో వెన్నుదన్నుగా సాయం చేయాల్సిన అవసరముంది. అందుకే 'దస్తకార్'ను ఏర్పాటు చేసి నైపుణ్యవంతులను ఒక్కోచోటుకు చేర్చాలని నిర్ణయించుకున్నాను' అంటారు.

### చదువుకునే రోజుల్లోనే..

కాలేజీ రోజుల నుంచే లైలాత్యాబ్జీకి హస్తకళలు, తయారీ రంగంపై మంచి అభిరుచి ఏర్పడింది. జపాన్‌లో ఫైన్ ఆర్ట్స్ చదువుల్ని పూర్తి చేసిన తర్వాత ఆమె ఢిల్లీకి తిరిగొచ్చారు. అప్పట్లో స్వేచ్ఛగా పనిచేసే డిజైనర్లు ఆయా రంగంలో ముందుకు వెళ్లడం సులభంగా ఉండేది కాదు. ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఎన్నో లక్షల అవకాశాలు, వనరులు ఉండేవి. ఇంటీరియర్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్ , స్టేజ్ డిజైన్ పరిశ్రమలు బాగా పురోగతిని సాధించాయి. కానీ.. ఆమె మాత్రం సంప్రదాయ భారతీయ హస్త కళలకోసం పనిచేయడంపైనే మక్కువ పెంచుకున్నారు. దాంట్లోనే ఎంతో సంతృప్తి ఉందని భావించేవారు. గుజరాత్‌లోని కచ్‌లో పనిచేయడం ఆమె జీవితాన్నే మార్చేసింది. అక్కడ గ్రామీణ హస్తకళాకారులను కలిసి వారి సమస్యలను అర్థం చేసుకున్నారు లైలా.

### సమస్యలను అధిగమించి..

'హస్తకళా రంగంలో నిపుణులకు సాయంగా ప్రభుత్వ పాత్ర గురించి మాట్లాడాల్సి వస్తే.. నాకు కూడా ఎన్నో పెద్ద సమస్యలున్నాయి. అవి ప్రభుత్వ చొరవచూపి పరిష్కరించే వాటికంటే కూడా చాలా పెద్దవి. రెండు కోట్ల 30 లక్షలమంది అనధికారిక హస్తకళాకారులు దేశవ్యాప్తంగా ఉన్నారు. వేరే ఏ ఇతర దేశంలో కూడా ఇంతమంది చేతి వృత్తుల వారులేరు. మనం వీరిపైన పెట్టుబడి పెట్టాల్సిన అవసరముంది.. అంటూ ప్రభుత్వం చేయాల్సినదానికంటే.. ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ రంగాన్ని ఆదుకోవాల్సిన పనిని గుర్తుచేశారు లైలా. వాణిజ్యపరంగా ఫ్యాబ్ ఇండియా లాంటి సంస్థల విక్రయాలకు పూర్తి మద్దతిస్తున్నానంటున్నారు లైలాత్యాబ్జీ. ఎందుకంటే.. గ్రామీణ ప్రజలు తాము తయారు చేసిన హస్తకళలు, వస్త్రాలు ఇతర వస్తువులను అమ్ముకునేది ఎలాగో తెలీదు. వారికి తెలిసింది అందరూ మెచ్చేలా పనిచేయడం. పైగా సొంతంగా వ్యాపారం చేసేలా వాళ్లకు దుకాణాలు ఉండవు. కానీ.. అలాంటి ఉత్పత్తులను ఫ్యాబ్ ఇండియా మార్కెటింగ్ చేస్తుండటం ప్రశంసనీయమంటున్నారామె.

### కుటుంబమంతా..

'గ్రామాల్లో కళాకారుల వృత్తిపని అనేది కుటుంబమంతా కలిసి చేసేది. కొన్ని ప్రత్యేకమైన పనుల్ని మగవాళ్లు చేస్తారు. కొన్నింటిని మాత్రమే ఆడవాళ్లు చేయగలరు. అలాగని ఇది ఏ ఒక్కరో చేయాలనే లింగభేదం, పక్షపాతమున్న పరిశ్రమ కాదు. హస్తకళా రంగాల్లో పనిచేసేవారి విషయంలో.. ఆడవారికి కూడా విచక్షణ, సూక్ష్మ బుద్ధి ఉంటాయి. వాళ్లకేదో ఏరోనాటికల్ ఇంజినీర్లు, యుద్ధం చేసే పైలెట్లకు ఉండాల్సినంత తెలివితేటలు అవసరం లేదు. వారు చేసే పనిపట్ల అవగాహన, అంకితభావం ఉంటే చాలు. మంచి ఉత్పత్తులు వారినుంచి వస్తాయనడంలో సందేహం లేదు' అని అంటారు లైలా.





## అంధులకు ఫొటోగ్రఫీ

**కళ్లు లేనివారంటే సమాజానికి చిన్న చూపు. వారికి ఏమీ కనిపించదు. ఇక వారేం చేయగలరన్నవారికి తలుచుకుంటే ఏదైనా చేయగలరని నిరూపిస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఫొటోగ్రఫీలో అంధులను ప్రోత్సహించేందుకు వారికి శిక్షణ ఇస్తున్నది మహేశ్వరి.**





**ఒకరికి శిక్షణ** ఇవ్వాలంటే ఆ వృత్తిపై మంచి పట్టుండాలి. అది కనిపించేవారికి అయితే సరే. మరి అంధులకు నేర్పించాలంటే. ఎలాంటి శిక్షణ ఇవ్వాలి. అది కూడా ఫొటోగ్రఫీ నేర్పాలంటే. కళ్లు ఉన్నవారికి ఇమాజినేషన్ ఒకలా ఉంటుంది. కళ్లు లేనివారు ఎలా ఆలోచిస్తారో కళ్లు ఉన్నవారికి ఎలా తెలుస్తుంది? కెమెరా పట్టుకొని ఎంత దూరం నిలబడి ఫొటో తీయాలి. కెమెరా సెట్టింగ్స్. ఇవన్నీ వారికి అర్థమయ్యేలా చెప్పాలంటే.. సాక్షాత్తు ఆ దేవుడే దిగిరావాలేమో! అవసరం లేదు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన రిచా మహేశ్వరి ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నది. ఆమె యంగ్ ఫొటోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్, పారిశ్రామికవేత్త. 2008లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో చేరిన తర్వాత సృజనాత్మకత వైపుకు రావాలని రిచా భావించింది. ఫొటోగ్రఫీ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఢిల్లీలో 'రిచా మహేశ్వరి ఫిల్మ్స్ అండ్ ఫొటోగ్రఫీ' స్టూడియోని నిర్మించింది. అంధత్వంతో ఉండి ఫొటోగ్రఫీకి నోచుకొని వారికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైంది. వారు ఏదైనా విషయాన్ని తాకుతారు, ఆపై వింటారు. ఒక ఫ్రేమ్ ఎలా ఉండాలో మానసికంగా అంచనా వేస్తారు. తాను చెప్పిన విషయాన్ని సరైన పద్ధతిలో ఆచరిస్తున్నారని రిచా సంతోషం వ్యక్తం చేసింది. దీనికి ముందు రిచా సొసైటీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్(ఎస్‌పీసీఏ), సమర్పాన్ ఫౌండేషన్ వంటి పలు ఎన్జీఓలతో కలిసి పనిచేసింది. అలాంటి ఒక ప్రాజెక్ట్ 'నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్' ఆధ్వర్యంలో అంధులకు బోధిస్తున్నది. 2014లో రిచా అంధత్వ అవగాహనపై ప్రచారం చేసింది. ఇలా రిచా ఇప్పటికి 49 దేశాలను చుట్టింది. వెళ్లిన ప్రతిచోటా భారత జెండాను ఎగురవేస్తున్నది.

## ఆరోగ్యానికి ఐదు చిట్కాలు



**చాలామంది ఆరోగ్యం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఎన్నో ఆహార పదార్థాలు తీసుకుంటుంటారు. అయినప్పటికీ తరచూ జబ్బు బారిన పడుతూనే ఉంటారు. ఈ ఐదు చిట్కాలు పాటిస్తే అనారోగ్యాల్ని దూరం చేసుకోవచ్చు.**

- దగ్గినా, తుమ్మినా చేతుల్ని అడ్డు పెట్టుకుంటాం. ఆ తర్వాత చేతుల్ని తుడిచేసుకుంటే సరిపోదు. అలా అడ్డుపెట్టుకున్న ప్రతిసారీ సబ్బునీటితో చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి.
- ఒక స్పూన్ కొత్తిమీర రసానికి ఒక కప్పు మజ్జిగ చేర్చి తాగితే అజీర్ణం, వాంతులు, వెక్కిళ్లు వంటి సమస్యలు తగ్గుతాయి. దీనివల్ల పళ్లు, చిగుళ్లు కూడా బలంగా తయారవుతాయి.
- క్రిములు చేతులపైనే కాదు.. నోట్లోనూ ఉంటాయి. అందుకని రోజూ రెండు సార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్టుతో పళ్లు తోముకోవాలి. నాణ్యమైన టూత్‌బ్రష్‌ను మాత్రమే వాడాలి.
- స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నవారు ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఒక స్పూన్ తేనె తీసుకుంటే మంచిది.
- ఎక్కువగా కూర్చొని పనిచేసేవారు కనీసం రోజుకో అరటిపండు అయినా తీసుకోవాలి. తాజా కూరగాయల్ని రోజూ వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

## చిన్నారుల బాగుకోసం..

**మార్కెట్‌లో లభించే జామ్‌లు రసాయనాలతో తయారవుతున్నాయి. వీటిని తిని చిన్నారులు పలు రుగ్మతల బారిన పడుతున్నారు. ఇదే విషయాన్ని గమనించిన ఓ తల్లి సహజసిద్ధమైన జామ్‌లను తయారు చేసేపనిలో పడింది. వీటి ద్వారా చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నది.**



**ముంబైకి** చెందిన సౌమి కుమార్తె జామ్‌లు తిన్నప్పుడల్లా అనారోగ్య సమస్యలు తలెత్తేవి. అవి తిన్న సమయంలోనే ఎందుకు ఇలా జరుగుతుందో ఆరా తీసేందుకు వైద్యుణ్ణి సంప్రదించింది. అప్పుడు తెలిసింది ఆ చిన్నారి తినే జామ్‌లో రసాయనాలు ఎక్కువగా ఉండడం వల్ల పలు వ్యాధులకు గురవుతున్నట్లు తేలింది. తన కుమార్తెలా మరెవరూ బాధపడకూడదనుకున్నది సౌమి. అందుకోసం సహజసిద్ధమైన జామ్‌లను రూపొందించేందుకు సిద్ధమైంది. సౌమి చిన్నతనంలో వాళ్ల అమ్మమ్మ పలురకాల పండ్లతో ఎటువంటి రసాయనాలు లేకుండానే జామ్ తయారు చేసేది. అదే పద్ధతిలో సౌమి కూడా జామ్‌లను తయారు చేయడం మొదలుపెట్టింది. స్ట్రాబెర్రీలతో రూపొందించిన జామ్‌ను తన స్నేహితులకు, దగ్గరి బంధువులకూ పంపింది. వారు సౌమి తయారు చేసిన జామ్‌లు ఎంతో రుచిగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. ఆమెను మరిన్ని ఫ్లేవర్స్ తయారు చేయమని, వాటిని తామే కొనుగోలు చేస్తామంటూ ప్రోత్సహించారు. అలా సౌమి రూపొందించిన జామ్‌లకు రోజురోజుకూ ఆదరణ పెరిగింది. ఊహించనంతగా ఆర్డర్లు పెరిగాయి. అదే సమయంలో మనమే ఓ కంపెనీ ప్రారంభిస్తే ఎలా ఉంటుందని సౌమి భర్త సలహా ఇచ్చాడు. ఇద్దరూ కలిసి మార్కెట్‌లో తమ ఉత్పత్తులు ఎంతమేర అమ్ముడవుతాయనే దానిపై పరిశోధన చేశారు. సహజసిద్ధమైన విధానంలో తయారైన జామ్‌లు అందుబాటులో లేవని తెలుసుకున్నారు. ఆ సమయంలోనే 'యుమ్మియం' పేరుతో కంపెనీని ప్రారంభించింది. సౌమి భర్త సహకారంతో ఇంట్లోనే ఎనిమిది రకాల పండ్ల జామ్‌లను తయారు చేయడం మొదలు పెట్టింది. ఆమె ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం సౌమి 10వేల బాటిళ్లను విక్రయించింది. వ్యాపార ధోరణితో కాకుండా చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఆమె సంకల్పాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

వేసవిలో దొరికే పుచ్చకాయ తింటే కడుపు చల్లగా ఉండటమే కాదు. అందం రెట్టింపు అవుతుంది. పుచ్చకాయతో పొందే ఆరోగ్యం, కలిగే అందం గురించి తెలుసుకోవాలంటే ఈ కింది చిట్కాలు పాటించాలి.

## వేసవిలో పుచ్చకాయ్.. ఎంతో హాయ్

### అందం

- వేసవిలో చర్మం ఎంతో పొడిబారిపోయినట్టుగా మారిపోతుంది. మందంగా తయరై చర్మం కాలిపోతున్నట్టుగా ఉంటుంది. వీటికి చెక్ పెట్టాలనుకుంటే పుచ్చకాయతో ఫేస్‌మాస్కులు ఎంతగానో ఉపయోగపడుతాయి.
- ఇందులోని 90 శాతం నీరు చర్మాన్ని తేమగా ఉంచేందుకు తోడ్పడుతుంది.
- పుచ్చకాయ రసం, కీర గుజ్జును సమపాళ్లలో కలిపి ముఖానికి రాసుకోవాలి. అరగంట తర్వాత శుభ్రమైన నీటితో కడిగేయాలి. ఇక అంతే.. చర్మం నిగారించడమే కాకుండా చర్మాన్ని కాపాడుతుంది.



### ఆరోగ్యం

- డయాబెటిస్ ఉన్నవారు నిత్యం పుచ్చకాయ విత్తనాలు తింటుంటే.. షుగర్ అదుపులో ఉంటుంది.
- హైబీపీ ఉన్నవారు పుచ్చకాయ విత్తనాలు తింటే బీపీ తగ్గుతుంది. బీపీ అదుపులోకి వస్తుంది.
- పుచ్చకాయ విత్తనాలను రోజూ తినడం వల్ల కండరాలు దృఢంగా మారతాయి.
- మెదడు పనితీరు మెరుగ్గా ఉండాలంటే పుచ్చకాయ విత్తనాలను రోజూ తినాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- కంటిచూపును మెరుగుపరిచే అద్భుతమైన ఔషధ గుణాలు పుచ్చకాయ విత్తనాల్లో ఉంటాయని, విత్తనాలు నిత్యం తింటుంటే.. నేత్ర సమస్యలు పోతాయని సైంటిస్టులు చెబుతున్నారు.
- పుచ్చకాయ తినడం వల్ల అంగస్తంభన సమస్యలు రావని పరిశోధనలు చెబుతున్నాయి. పుచ్చకాయలోని సిట్రులైన్, అర్గినైన్ పదార్థాల వల్ల ఇది సాధ్యపడుతుంది. ఇవి నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి.

## ఆమెకు అండగా సహేలి

అమెజాన్ కేర్స్ ట్రైనింగ్. ఇది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నది. అన్ని వ్యాపారాల్లో మెళకువలు నేర్పుతున్నది. వీరి ప్రొడక్ట్‌ని 'అమెజాన్ సహేలి ప్రోగ్రామ్' ద్వారా అమ్ముతున్నారు. దీనిద్వారా శిక్షణ పొందిన వారిలో ముగ్గురి గురించి వివరాలు.



### హైదరాబాద్ స్రవంతి

**తెలంగాణలోని** శంషాబాద్‌కు చెందిన స్రవంతి 10వ తరగతి వరకు చదువుకున్నది. 17 ఏండ్లకి పెండ్లి. ఇద్దరు పిల్లలు. ఆ తర్వాత భర్త మరణం. అంతా ఆమె తలరాత అనుకున్నది. ఇంటి బాధ్యత ఆమెపై ఉంది. గొల్లపల్లి గ్రామంలోని అమెజాన్ కేర్స్ కమ్యునిటీలో కుట్టుమిషన్, మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ వర్క్ నేర్చుకున్నది. యూట్యూబ్, ఫ్యాషన్ మ్యాగజైన్లు చూసి కొన్ని టెక్నిక్స్‌ను పుస్తకంలో రాసిపెట్టుకొని సొంతంగా ప్రయోగాలు చేస్తుంటుంది. శిక్షణ పొందిన తర్వాత ఇతర మహిళలకు ట్రైనింగ్ ఇచ్చేందుకు ఆఫర్ వచ్చింది. 33 నెలల్లో సుమారు 300 మందికి ట్రైనింగ్ ఇచ్చింది. 30 మంది మహిళలతో అమెజాన్ ఇండియా ఇచ్చిన శాటిన్ బ్యాగ్స్ ఆర్డర్‌ను పూర్తి చేసింది. వారంతా ఆయా గ్రామాలో సొంతంగా కుట్టుమిషన్ పెట్టుకొని ఉపాధిని పొందుతున్నారు. స్రవంతి నెలకు 15 వేల వరకు సంపాదించి పిల్లలకు మంచి చదువు చెప్పిస్తున్నది. భవిష్యత్తులో ఆమె టీమ్ విస్తరింపజేసే ఆలోచనలో ఉంది. అమెజాన్‌కు మరిన్ని ఆర్డర్లు అందజేయాలనుకుంటున్నది.

### క్యాంటిన్ వ్యాపారం



**గంగా సొనవాలి.** ముంబైకి చెందిన ఆమె, భర్త జీతంపై ఆధారపడాలనుకోలేదు. సొంతంగా వ్యాపారం మొదలుపెడదామంటే అవగాహన లేదు. అమెజాన్ కేర్స్ కమ్యునిటీలో చేరింది. క్యాటరింగ్ వ్యాపారంపై శిక్షణ తీసుకున్నది. తర్వాత బిజినెస్ మొదలుపెట్టడానికి లోన్ తీసుకున్నది. సెల్ఫ్-హెల్ప్ గ్రూపు నుంచి సహాయం పొంది 2017లో వాహులి గ్రామంలో స్టార్ట్ చేసింది. అమెజాన్ ఉద్యోగులకు ఫుడ్ సర్వ్ చేసే ఉద్యోగం వచ్చింది. బ్రేక్‌ఫాస్ట్ కోసం పోహ, ఉప్మా, వడ, ఇడ్లీ. మధ్యాహ్న భోజనానికి చపాతీ, నాన్‌వెజ్ ఐటమ్స్, స్నాక్స్ అన్నీ అందిస్తున్నది. నెలకు రూ. 10 వేల వరకు సంపాదిస్తున్నది. ఈవెంట్ల నుంచి మరిన్ని ఆర్డర్లు రావాలని కోరుకుంటున్నది గంగ.

### భర్తకు సాయంగా..

బెంగళూరుకు చెందిన శోభ 10వ తరగతి వరకు చదువుకున్నది. ఇద్దరు పిల్లలు, భర్తకు ప్రైవేట్ ఉద్యోగం. చాలీచాలని జీతం. భర్తకు చేదోడుగా ఉందామనుకున్నది. అప్పుడే అమెజాన్ కమ్యూనిటీ సెంటర్ గురించి తెలిసి మూడు నెలలు ట్రైనింగ్ తీసుకున్నది. హస్తకళలలో మెళకువలు నేర్చుకున్నది. కోర్సు పూర్తయ్యాక బెంగళూరులోని సమేతనహల్లి గ్రామ పంచాయతీలో ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా అవకాశం వచ్చింది. గ్రామంలోని మహిళలకు శిక్షణ ఇస్తున్నది శోభ. ఇప్పుడామె నెలకు రూ. 15 వేలు సంపాదిస్తున్నది. టైలరింగ్ మెటీరియల్స్ కూడా అమ్ముతున్నది. చదువుకు దూరమైన పిల్లల్ని మంచి స్కూల్‌లో చేర్పించింది.



నమస్తే తెలంగాణ
నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 9 మార్చి 2020

నానాటికీ దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్న వార్తల నడుమ, కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ చల్లని కబురు చెప్పింది. వచ్చే ఏడాది మార్చి నాటికి అక్షరాలా లక్షా నలభై వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు కమిషన్ చైర్మన్ బ్రజ్ రాజ్ శర్మ ప్రకటించారు. ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసిన వారితో పాటు, ఈ ఏడాది పట్టా పుచ్చుకోనున్న అభ్యర్థులు కూడా ప్రణాళిక ప్రకారం చదివి విజయం సాధించవచ్చు. ఈ ఏడాది మార్చిలో డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసి, మరుసటి ఏడాది మార్చిలో ఉద్యోగంలో చేరాలంటే ఒకింత కష్టపడక తప్పదు. ఉజ్వలమైన భవితనిచ్చే కేంద్ర ప్రభుత్వ రంగ కొలువులు సిద్ధంగా ఉన్నాయి. అందిపుచ్చుకోవడమే తరువాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వేర్వేరు డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాలను భర్తీ చేస్తుంది. అందులో ముఖ్యమైనవి. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (డిగ్రీ అభ్యర్థులకు), కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ (ఇంటర్మీడియట్ అర్హత) కంబైన్డ్ మల్టీ టాస్కింగ్‌ఫోర్స్ (పదో తరగతి ఉత్తీర్ణత). ఒక్కో లెవల్ పరీక్ష విధానాన్ని పరిశీలిద్దాం..



# ఏడాదిలోగా ఎస్సెస్సీ నుంచి

# లక్షన్నర కొలువులు

- **కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరీక్ష:** ఇందులో మూడు దశలు ఉంటాయి. అవి టైర్-1, టైర్-2, టైర్-3 సిలబస్‌ను పరిశీలిస్తే...
- **టైర్-1:** రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది)
- **టైర్-2:** మెయిన్ (రాతపరీక్ష- ఆబ్జెక్టివ్ పద్ధతిలోనే ఉంటుంది)
- **టైర్-3:** వ్యక్తిత్వ పరీక్ష /ఇంటర్వ్యూ లేదా స్కిల్ టెస్ట్ (సీపీవోలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని ఆశించే అభ్యర్థులకు ఫిజికల్ పరీక్ష ఉంటుంది (టైర్-1 ఫలితాల తర్వాత ఈ పరీక్ష ఉంటుంది).
- మొత్తం పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు మాత్రమే. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కులు తీసివేస్తారు.

**టైర్ 1: (ఇందులో నాలుగు అంశాలు ఉంటాయి)**

| భాగం | సబ్జెక్ట్ | ప్రశ్నల సంఖ్య | గరిష్ట మార్కులు |
|---|---|---|---|
| ఎ | జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ | 25 | 50 |
| బి | జనరల్ అవేర్‌నెస్ | 25 | 50 |
| సి | న్యూమరికల్ ఆప్టిట్యూడ్ | 25 | 50 |
| డి | ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ | 25 | 50 |

- **ప్రిపరేషన్ విధానం:** ఈ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులను రెండు కేటగిరీలుగా విభజించవచ్చు. 2020లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేయనున్న (అంటే ఇదే ఏడాది), ఇదివరకు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు. షెడ్యూల్‌ను పరిశీలిస్తే గ్రాడ్యుయేషన్ లెవల్ పరీక్ష నోటిఫికేషన్ సెప్టెంబర్ 15న రానుంది. దరఖాస్తుకు చివరితేదీ అక్టోబర్ 10. అంటే పరీక్ష నవంబర్ లేదా డిసెంబర్‌లో ఉండవచ్చు. నవంబర్‌లో ఉందనుకొని సిద్ధం కావడం వల్ల నష్టమేమీలేదు. దీనికి అనుసరించాల్సిన వ్యూహం..
- **న్యూమరికల్ ఆప్టిట్యూడ్:** దీనిలో సాధ్యమైనంత తొందరగా ప్రాథమిక అంశాలు పూర్తిచేయాలి. ఇందులో అర్థమెటిక్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలు గుర్తించడానికి కనీసం ఒక నిమిషం సమయం కూడా ఉండదు. కాబట్టి వేగంగా సమాధానం గుర్తించేలా ప్రిపరేషన్ ఉండాలి. కాన్సెప్ట్‌పై పట్టు పెంచుకుంటేనే అది సాధ్యమవుతుంది. అలాగే క్రమం తప్పకుండా బోడ్‌మాస్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి. లెక్కలను ఎంతవేగంగా సూక్ష్మీకరిస్తామనే అంశం చాలా కీలకం.అగర్వాల్ అర్థమెటిక్ లేదా ఇతర ప్రచురణలను చదవాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. టైర్-1కు సంబంధించి కీలక విభాగం. తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసుకోవచ్చు. ఈ ఏడాది డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు, తమ డిగ్రీ సబ్జెక్ట్‌లో అంశాలు ఎలాగు వస్తాయి. కాబట్టి, వేరే వాటిపై దృష్టి సారించాలి.
- **రీజనింగ్:** ఈ విభాగంలో ఆల్ఫాబెట్ బేస్‌డ్ పరీక్ష, ర్యాంకింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, పజిల్స్, సిలాజిసం తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి కూడా ప్రశ్నలు వస్తాయి. వీటికి పెద్దగా ప్రాథమిక అంశాలు సిద్ధం కావాల్సిన అవసరం లేదు. నేరుగా పరీక్ష రాయడం మంచిది. అలాగే సమాధానాలను కూడా పరిశీలించాలి. వీటిని ఎంత ఎక్కువ ప్రాక్టీస్ చేస్తే అంత పట్టు వస్తుంది.
- **ఇంగ్లిష్:** పాఠశాల స్థాయి నుంచి ఉన్న అంశమే ఇది. అయితే పోటీ పరీక్షల్లో భిన్నంగా ఉంటుంది. కేవలం గ్రామర్ బాగా వచ్చినంత మాత్రాన మార్కులు రావు. ఎక్కువ ప్రశ్నలు యూసేజ్‌పై ఉంటాయి. అంటే వివిధ భాషాభాగాలను, పదాలను ఎలా ఉపయోగిస్తున్నాం అనేది కీలకం. నిత్యం ఆంగ్ల దినపత్రికలు చదువుతూ అందులో వచ్చే కొత్త పదాలకు సందర్భోచితంగా అర్థం తెలుసుకోవాలి. అలాగే ఆయా పదాలతో ఉన్న నుడికారాలు, సామెతలను తెలుసుకోవాలి.
- **టైర్ 2 పరీక్ష విధానం:** టైర్-1లో ఉత్తీర్ణత సాధించినవారికే ఈ పరీక్ష ఉంటుంది. ఇది కూడా ఆబ్జెక్టివ్ తరహా పరీక్షే. అయితే ఇందులో కేవలం అర్థమెటిక్, ఇంగ్లిష్ మాత్రమే ఉంటాయి. ప్రతి విభాగం నుంచి 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. మొత్తం పరీక్ష 400 మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు. ఈ విభాగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు టైర్-1లోనే సిద్ధమై ఉంటారు. ఆ పరీక్ష బాగా రాసినవారు ఫలితాల కోసం ఎదురుచూడకుండా, నేరుగా మాక్‌పరీక్షలు రాయాలి. క్వాంటిటేటివ్ ఎబిలిటీ కాన్సెప్ట్స్‌పై పట్టు ఉంటుంది. కాబట్టి టైర్-2 పరీక్షకు షార్ట్‌కట్స్ నేర్చుకోవచ్చు.
- **టైర్ 3:** ఇది డిస్క్రిప్టివ్ పరీక్ష. ఎస్సే, ప్రిసైస్, లెటర్ రైటింగ్ తదితర అంశాలు ఉంటాయి. పరీక్ష తేదీ నాటికి వార్తల్లో నిలిచిన అంశాలకు సంబంధించి ఎస్సేలు సిద్ధమైతే సరిపోతుంది. ఉదాహరణకు ఇప్పుడు ఈ పరీక్ష నిర్వహిస్తే రాదగ్గ ఎస్సేలు.. 1. కరోనా మూలంగా ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం 2. దేశంలో ప్రస్తుతం ప్రబలుతున్న నిరుద్యోగ సమస్య 3. పౌరసత్వ సవరణ చట్టం.. అయితే పరీక్ష నాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలను అభ్యర్థులు గుర్తించి, వాటికి సిద్ధమైతే సరిపోతుంది. లెటర్ రైటింగ్ తదితర అంశాలకు ఫార్మాట్ ప్రిపేర్ అయి, సాధ్యమైనంత తక్కువ పదాల్లో వ్యక్తం చేయాలి.

**నోట్-1:** గ్రాడ్యుయేషన్ స్థాయి పరీక్షలో స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్, కంపైలర్స్ పోస్టులకు సిద్ధమయ్యేవాళ్లకు మూడు పేపర్లు ఉంటాయి. అర్థమెటిక్ ఎబిలిటీ, ఇంగ్లిష్‌తో పాటు మూడో పేపర్‌లో కామర్స్/మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఎకనామిక్స్ తదితర పేపర్లు ఉంటాయి.

**నోట్-2:** సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్‌లో సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టులకు కేవలం ఇంగ్లిష్ లాంగ్వేజ్-కాంప్రహెన్షన్ మాత్రమే ఉంటుంది. 200 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి.

- నెగెటివ్ మార్క్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కులు తీసివేస్తారు
- టైర్-2 డిస్క్రిప్టివ్ పేపర్, కాగా టైర్-3 స్కిల్ టెస్ట్.
- **ఎంటీఎస్ (మల్టీటాస్కింగ్ స్టాఫ్ రిక్రూట్‌మెంట్):** ఇందులో కూడా రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ఆబ్జెక్టివ్ తరహాలో, రెండో పేపర్ డిస్క్రిప్టివ్ పద్ధతిలో ఉంటుంది. పేపర్-2 లో ఎస్సే, ప్రిసైస్, లెటర్ రైటింగ్‌లు ఉంటాయి. పేపర్-1లో ఉండే అంశాలు..

| భాగం | సబ్జెక్ట్ | ప్రశ్నల సంఖ్య | గరిష్ట మార్కులు |
|---|---|---|---|
| 1 | జనరల్ ఇంటెలిజెన్స్ రీజనింగ్ | 25 | 25 |
| 2. | న్యూమరికల్ ఆప్టిట్యూడ్ | 25 | 25 |
| 3. | జనరల్ ఇంగ్లిష్ | 50 | 50 |
| 4. | జనరల్ అవేర్‌నెస్ | 50 | 50 |

**పరీక్ష క్యాలెండర్**

| పరీక్ష | నోటిఫికేషన్ తేదీ | పరీక్ష తేదీ |
|---|---|---|
| కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష | 15-09-2020 | తర్వాత ప్రకటిస్తారు |
| కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ | 30-11-2020 | తర్వాత ప్రకటిస్తారు |
| మల్టీ టాస్కింగ్ (నాన్ టెక్నికల్) | 02-06-2020 | 26-10-2020 |

### స్టాఫ్ సెలక్షన్ కమిషన్ భర్తీ చేసే వివిధ డిపార్ట్‌మెంట్‌లు (గ్రాడ్యుయేట్ లెవల్)

- అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్
- ఇన్‌స్పెక్టర్ ఎగ్జామినర్ (సీబీఈసీ)
- ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ (సీబీడీటీ)
- అసిస్టెంట్ (విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ)
- సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ (సీబీఈసీ)
- ప్రివెంటివ్ ఆఫీసర్ (సీబీఈసీ)
- అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్
- అసిస్టెంట్ (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్)
- అసిస్టెంట్ (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్)
- అసిస్టెంట్ (రైల్వే మంత్రిత్వ శాఖ)
- అసిస్టెంట్ (ఇంటెలిజెన్స్ బ్యూరో)
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (సీఎస్ఎస్)
- సబ్ ఇన్‌స్పెక్టర్ (సీబీఐ)
- అసిస్టెంట్ (ఇతర మంత్రిత్వ శాఖలు)
- డివిజనల్ అకౌంటెంట్ (కాగ్)
- ఇన్‌స్పెక్టర్ (నార్కోటిక్స్)
- సబ్ ఇన్‌స్పెక్టర్ (నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ)
- స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్
- ఇన్‌స్పెక్టర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్)
- సబ్ ఇన్‌స్పెక్టర్ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్)
- ఆడిటర్ (కాగ్)
- ఆడిటర్ (సీజీడీఏ)
- ఆడిటర్ (సీజీఏ)
- ట్యాక్స్ అసిస్టెంట్ (సీబీఈసీ)
- ట్యాక్స్ అసిస్టెంట్ (సీబీడీటీ)
- అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్ (కాగ్)
- అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్ ఆఫీసెస్ (సీజీఏ, ఇతరాలు)
- సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- కంపైలర్ (రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా)

- ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టడానికి కారణం (ద్రవ్యోల్బణం పెరగడం, విదేశీ మారక నిల్వలు పూర్తిగా తరిగిపోవడం)
- ఇలా కొంచెం విశ్లేషణాత్మకంగా ఉంటాయి. అదే గ్రాడ్యుయేషన్ పరీక్షలో ఇదే అంశంపై అడిగే తీరు..
- ఆర్థిక సంస్కరణల మూలంగా రాజ్యాంగంలోని ఏ విధానం నుంచి భారత్ దూరం వెళుతున్నట్లు కనిపిస్తుంది (సామ్యవాదం)

**సీహెచ్ఎస్ఎల్ పరీక్ష విధానం**

ఇందులో కూడా టైర్-1, టైర్-2 దశలు ఉంటాయి.
టైర్-1 పరీక్ష విధానం

| భాగాలు | సబ్జెక్ట్ | ప్రశ్నల సంఖ్య | గరిష్ట మార్కులు |
|---|---|---|---|
| 1 | ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 25 | 50 |
| 2. | జనరల్ ఇంటెలిజెన్స్ | 25 | 50 |
| 3 | క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 25 | 50 |
| 4 | జనరల్ అవేర్‌నెస్ | 25 | 50 |

- పైవాటిని పరిశీలిస్తే అందరూ చదవాల్సింది ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలే. అయితే పరీక్ష స్థాయిని బట్టి ప్రశ్న కోణాల్లో మార్పు చేసుకోవాలి. సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్)కు సిద్ధమయ్యే అభ్యర్థులు కూడా చదవాల్సిన పుస్తకాలు ఇవే. మరింత విశ్లేషణాత్మకంగా ప్రశ్నలు ఆ పరీక్షలోఉంటాయి. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్ భాషలకు ఇదే విధానం వర్తిస్తుంది.

### ఎస్సెస్సీ భర్తీ చేసే శాఖలు (సీహెచ్ఎస్ఎల్)

- ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్
- బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్
- క్యాంటీన్ స్టోర్ డిపార్ట్‌మెంట్ (రక్షణ మంత్రిత్వ శాఖ)
- సీబీఐ
- సెంట్రల్ హిందీ డైరెక్టరేట్ (మానవ వనరుల అభివృద్ధి)
- సెంట్రల్ పాస్‌పోర్ట్ ఆఫీస్ (విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ)
- సెంట్రల్ విజిలెన్స్ కమిషన్
- కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్
- కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ కో ఆపరేషన్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ (బడ్జెట్ డివిజన్, ఆర్థిక మంత్రిత్వ శాఖ)
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (వాణిజ్య మంత్రిత్వ శాఖ)
- వైస్ ప్రెసిడెంట్ సెక్రటేరియట్
- నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ
- రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా

### ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదివే పద్ధతి

- సివిల్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్-1, 2 తదితర అత్యున్నత స్థాయి పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు జనరల్ స్టడీస్‌లో పట్టుకోసం తప్పక చదవాల్సిన పుస్తకాలు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ఆర్గనైజేషన్ ప్రచురించిన పుస్తకాలు. ఆరో తరగతి నుంచి 10+2 స్థాయి వరకు ఉండే పుస్తకాలను అధ్యయనం చేయాలి. అయితే దీనికి ఒక పద్ధతి ఉంది.
- మొదట ఆరో తరగతి, తర్వాత ఏడో తరగతి, ఆ తర్వాత ఎనిమిది.. ఇలా చదువుతూ వెళ్లడం సరికాదు. అంశలవారీగా ముందు విభజించుకోవాలి. ఉదాహరణకు భౌతిక శాస్త్రంలో కాంతి (లైట్) అన్న అంశాన్ని అన్ని తరగతుల్లో ముందు పూర్తి చేయాలి. అంటే ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు, కాంతి అన్న అంశంపై ఇచ్చిన సమాచారాన్ని అధ్యయనం చేసి సొంతంగా నోట్స్ చేసుకోవాలి. దీంతో ఆ అంశంపై పూర్తి పట్టు వస్తుంది. అన్ని సబ్జెక్టులకు ఇది వర్తిస్తుంది. ఈ పద్ధతిలో కాన్సెప్ట్‌పై బాగా పట్టు దొరుకుతుంది.

### స్థాయినిబట్టి ప్రశ్నించే తీరు

- ఎంటీఎస్ పరీక్షకు పదో తరగతి, సీహెచ్ఎస్ఎల్‌కు ఇంటర్, సీజీఎల్‌కు గ్రాడ్యుయేషన్ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- అయితే మూడు స్థాయి పరీక్షలకు ఒకే తరహాలో సిలబస్ ఉంది. జనరల్ అవేర్‌నెస్‌కు అందరూ చదవాల్సింది ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలే. అయితే పరీక్ష స్థాయిని బట్టి ప్రశ్నించే తీరు మారుతుంది. ఉదాహరణకు ఆర్థిక సంస్కరణలు అనే అంశం తీసుకుంటే వేర్వేరు పరీక్షల్లో ఎలా అడుగుతారో పరిశీలిద్దాం..
- **ఎంటీఎస్:** భారతదేశంలో ఆర్థిక సంస్కరణలను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు (1991)
- దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి (పీవీ నరసింహారావు)
- ఇలా నేరుగా ఎంటీఎస్‌లో ఉంటాయి. ఇదే అంశం నుంచి సీహెచ్ఎస్ఎల్‌లో వచ్చే ప్రశ్నలు..



వి.రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411

## విజ్ఞాన విపంచి



### ఇదీ ఫోనే

- ఏంటిది? బుల్లి రేడియోనా! కానీ పాతకాలంనాటి ల్యాండ్‌లైన్ ఫోన్లలో ఉన్నట్లు డయల్ ప్యాడ్ ఉంది. ఫోనా ఏంటి అని తికమక పడుతున్నారా? నిజమే ఇది ఫోనే.. న్యూయార్క్‌లో ఉండే జస్టిన్ హాప్ట్ అనే అంతరిక్ష శాస్త్రవేత్త దీన్ని తయారు చేశారు. స్మార్ట్‌ఫోన్ ఆమెకు అంతగా నచ్చలేదట. కొత్తగా తానే స్వయంగా ఓ ఫోన్ తయారుచేసుకుందామని మూడేండ్లు ప్రయత్నించి ఈ ఫోన్‌ను ఆవిష్కరించారు. ఈ ఫోన్ తయారీకి వాడిన వస్తువులన్నీ వాడిపడేసిన చెత్తేనట. ఈ ఫోన్ నాలుగు అంగుళాల పొడవు, మూడంగుళాల వెడల్పు, ఒక అంగుళం మందం ఉంది. బ్యాటరీ కూడా 30 గంటల టాక్‌టైమ్ కెపాసిటీ ఉందట. ఈ ఫోన్ ఫొటోలను ఆమె సోషల్‌మీడియాలో పెట్టగా భలేగా ఉందే ఈ ఫోన్ అంటూ ఎంతకు అమ్ముతారని అడుగుతున్నారట. మొదట ఆమె ఈ ఫోన్‌ను ఎవరికీ అమ్మటానికి ఇష్టపడలేదట. కానీ ఒక్క వారంలోనే 30 మంది ఫోన్లు చేసి తమకు అలాంటి ఫోన్ కావాలని బతిమాలుతున్నారట. దాంతో 130 అమెరికన్ డాలర్లకు అమ్ముతానని ఆమె రేటు కూడా ఫిక్స్ చేశారు. ఫోన్ బాగుంది కదా..!


## విశ్వదర్శనం



### ఆకాశమంత అద్దం

- ఇంట్లో నిలువెత్తు అద్దం ఉంటేనే చాలామంది దానిముందు నుంచి పక్కకు రారు. అలాంటిది ఒక బహిరంగ ప్రదేశంలో నిలబడి ఎటుచూసినా కనుచూపుమేర అద్దమే కనిపిస్తే, అందులో ఆకాశం అందాలన్నీ మన కాళ్లవద్దే ఉన్నట్లు కనిపిస్తే ఆ దృశ్యాన్ని చూడటానికి రెండు కళ్లూ చాలవు కదా. అలాంటి అద్దం బొలీవియాలో ఉంది. అద్దమంటే అద్దం కాదులెండి. అక్కడి ఇన్‌కాహువాసి దీవిలో కొన్ని లక్షల ఏండ్ల క్రితం ఓ సరస్సు ఉండేది. అందులోని నీరు పూర్తిగా ఆవిరికావడంతో ఉపరితలం మొత్తం ఉప్పు పేరుకుపోయి తెల్లగా అద్దంలా మారిపోయింది. ఆ తెల్లని ఉపరితలంపై ఆకాశంలోని మబ్బులు, పక్షులు ఎంతో అందంగా కనిపిస్తాయి. భూమి మీద అతిపెద్ద ఉప్పు ఉపరితలం ఇదే. మనదేశంలో కూడా ఇలాంటి ప్రదేశం ఉంది. గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి వెళితే చూడొచ్చు. కంటికి కనిపించేంత దూరం తెల్లగా పిండి ఆరబోసినట్లుగానే ఉంటుంది.

## మహానుభావులు



### చరకుడు

- భారతీయ వైద్యశాస్త్రానికి చరకుడు పితామహుడు. ఆయన రాసిన చరక సంహిత అనే వైద్య శాస్త్రగ్రంథంలో అనేక వ్యాధుల లక్షణాలు, వాటి నివారణ మార్గాలను సులభరీతిలో వివరించాడు. ఆరోగ్యంగా జీవించాలంటే జీర్ణక్రియ, జీవక్రియ, రోగనిరోధక శక్తి అనేవి అత్యంత ముఖ్యమని 2000 ఏండ్లకు పూర్వమే చెప్పారు. ఏదైనా వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవటంకంటే వ్యాధి రాకుండా చూసుకోవటమే ఉత్తమమని ఇప్పుడు చాలామంది వైద్యులు చెప్తున్నారు. ఈ సూచన మొదట చేసింది చరకుడే. ప్రస్తుతం బాగా వ్యాప్తిలో ఉన్న జెనెటిక్స్‌పై ఆనాడే చరకుడు చర్చించాడు. కనిష్క చక్రవర్తి ఆస్థానంలో ఆయన రాజవైద్యుడిగా ఉండేవాడు.

## Word Power



**Anonyms** = With a name that is known
**Adept** = Proficient, Skilled, expert
**Adherent** = Follower, Stickler
**Antedate** = To be built or former or to happen
**Anxiety** = Eagerness, misgivings, worry
**Appalling** = Terrific, terrifying, dreadful, horrible
**Adore** = Respect, idolise, worship, admire
**Affliction** = Distress, sorrow, sadness
**Alms** = Gratuity, donation, grant
**Astonish** = Astound, surprise, amaze
**Assent** = Agree, consent, acquiesce
**Audacious** = Bold, courageous, daring
**Apposite** = Apt, suitable, well chosen
**Aversion** = Dislike, detestation, hostility, hatred

epaper.ntnews.com

# చెలిమె

కరీంనగర్ | నమస్తే తెలంగాణ

సోమవారం 9 మార్చి 2020


## నడకను కత్తిరించినప్పుడు...

చూపు కంటిని మింగింది
అధికారం ఒంటరిదైనప్పుడు
తోడు నేనున్నానంటూ చీకటి జత కట్టింది
కుర్చీకి ఉన్న నాలుగు కాళ్ళు
అవి కదలకుండానే నన్ను భయపెడుతున్నవి;
నేను సహజంగానే
మనుషుల మధ్యకు నడిచి వచ్చాను
వాళ్ళు అలవాటుగానే నా మెడలు విరిచి
నా కాళ్ళకు సమాధి కట్టారు
నేను జనన వాక్యమై మళ్ళీ మొలకెత్తుతుంటే
ఎవరో నా ముఖం మీద
కులం జెండా విసిరి పోయారు
చీకటి తెల్ల రంగు వేసుకొని
నా భుజం మీద చెయ్యి వేసింది
చురుకుగా ఆలోచించాల్సిన నేను
ఇరుకు ఇరుకు ఆలోచనలతో
మడికట్టుకొని మాట్లాడుతున్నాను
ఇంతలో ఇంద్రధనుస్సుకు
ఏడు రంగుల బరువెందుకంటూ
రాజ్య శాసనం ప్రశ్నిస్తుంది
చంద్రుని మరకలు
వెన్నెలకు కూడా ఉన్నాయని
అది పదే పదే ప్రకటిస్తుంది
ఇప్పుడు నేనెవరన్నదే కాదు సమస్య
రేపటి నా శవం కూడా నాది కాదన్నది నిజం.

– ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
9849082693



# విశ్వ చైతన్య గీతం

ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు, సంగీత విద్వాంసులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య 'జాతి విపంచీగానం' అనే జాతీయ కావ్యాన్ని రచించి, సుప్రసిద్ధ కవి, విమర్శకులైన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య గారికి గత నెల ఒక విద్వత్‌సభలో ఆవిష్కరించి, అంకితం చేశారు. గత శతాబ్దపు తొలినాళ్ళలో దేశంలోను, ప్రపంచ దేశాలలోను ఏర్పడిన గందరగోళ పరిస్థితుల నుంచి దేశాన్ని, జాతిని, సంస్కృతిని, జ్ఞాన సంపదను సంరక్షించుకునే లక్ష్యంతో ఎందరో మహాకవులు జాతీయ చైతన్యాన్ని కీర్తిస్తూ గొప్ప రచనలు చేశారు.


**బంకించంద్రుడు**, రవీంద్రుని వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని గురజాడ, రాయప్రోలు, విశ్వనాథ వంటి కవులు దేశభక్తి గీతాలు రాశారు. ఆనాడవి ప్రజల నాలుకలపై నాట్యం చేసినవి. 'శ్రీలు పొంగిన జీవగడ్డయి, పాలువారిన భాగ్యసీమయి వ్రాలినది యీ భరత ఖండము. భక్తి పాడర తమ్ముడా! వేదశాఖలు వెలిసెనిచ్చట, ఉపనిషన్మధువు లొలికె నిచ్చట, బాదరాయణ పరమ ఋషులకు, పాదు సుమ్మిది చెల్లెలా!' వంటి గేయాలానాడు ప్రజలను ఉత్రూతలూగించినవి. ప్రజలను స్వాతంత్ర్య సముపార్జనకు పురికొల్పి ఉపకరించినవి. ఇది గత చరిత్ర. దాదాపు ఒక శతాబ్దం గడచింది. మరల ఈనాడు ప్రజలను, యువతను, విద్యావంతులను మేలుకొలిపి జాతి చైతన్యాన్ని పునఃఆవిష్కరించవలసిన ఆవశ్యకత ఏర్పడినది. ఈ అవసరాన్ని గుర్తించిన కాలమే వీరభద్రయ్యగారి కలం నుంచి జాతి విపంచీగానమై ఆవిష్కృతమైంది.

**'శతాబ్దాల ఈ కృషి ఫలితాన్ని**
**భవ్య కవితావేశ వీణియపై గానంగా**
**వినిపిస్తున్న శుభ ముహూర్తం ఇది'** అంటూ వీరభద్రయ్యగారు భరతజాతి గొప్పతనాన్ని తన ఈ కావ్యంలో వెల్లడిస్తారు.

**'ఎన్ని యుద్ధాలు ఎన్ని దండయాత్రలు,**
**ఎన్నెన్ని కొల్లగొట్టడాలు జరిగినా**
**సహనం కోల్పోకుండా –**
**రజస్తమస్సుల అనుక్షణం అణచివేస్తూ**
**కేవలం సత్యాన్నే భజించి**
**లోకానికి ఆదర్శాన్నిచ్చిన అద్భుత జాతి**
**భరతజాతి..'** అని అంటారు కవి. సహనం భరత జాతికి గొప్ప గుణం. ఆ సహనత్వమే మన జాతి సంస్కృతికి ఔన్నత్యాన్ని తెచ్చిపెట్టింది. **'సహనౌభునక్తు.... సహవీర్యంకరవావహై'** అన్న ఉపనిషత్ సూక్తి కూడా అదే చెబుతున్నది. అందుకే కవిగారు ఈ కావ్యంలో..

**'యోగ సమాధిలో ఎన్ని నాళ్ళుండిందో**
**జాతి శరీరానికి శత్రుమూకలు తూట్లు పొడిచినా**
**తనలో తాను మునిగి పట్టించుకొననే లేదు..'** అంటారు. తనలక్ష్యం కోసం భౌతికం నుంచి ఆధ్యాత్మిక తీరానికి అంతర్ముఖ ప్రయాణించేసే లక్షణం కల్గిన భరతజాతికి గొప్ప సాధనం యోగ సమాధి. ఈ గుణమే ప్రపంచంలోని దేశాలన్నింటికి ఆదర్శమైందీనాడు. నిన్నటిదాకా సుప్తావస్థలో ఉన్న జాతిచైతన్యం ఇప్పుడు జాగ్రదవస్థలోకి వచ్చి అభ్యుదయంవైపు అడుగులు వేస్తుందంటూ..

**'తూర్పున సూర్యుడు ఫక్కున నవ్వాడు**
**గుట్టు తెలిసిపోయింది**
**జ్ఞాన సూర్యుడే మిగిలేడు!**
**జాతి చైతన్యం ఇక తిరోగామి అవనే అవదు..'** అని వీరభద్రయ్యగారు కవిగా కాలాన్ని శాసిస్తూ తన వాక్ శాసనం ద్వారా నేటి యువతకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. అలాగే జాతి భావనకు నిర్వచనం చెబుతాడు కవి ఇట్లా..




వీరభద్రయ్యగారి కలానికి రెండువైపులా పదునే. ఒకవైపు కవిత్వం, మరొకవైపు విమర్శ. ఇలా సృజన విమర్శనా శక్తుల మేళవింపు వీరి 'జాతి విపంచీగానం' కావ్యంలో కనపడుతుంది.

**'కష్టసుఖాలను చరిత్ర జాడీలో ఊరవేస్తే**
**క్రమంగా సిద్ధించే ఊరగాయే జాతి భావన..'** జాతి భావనకు ఇది ఒక అందమైన నిర్వచనం. అట్లే చరిత్రను గూర్చి నిర్వచిస్తూ..

**'చరిత్ర నిస్సారపు కాగితాలు పిండితే**
**కన్నీరే కారుస్తుంటాయవి**
**అవన్నీ కన్నీటి సముద్రాలే – ఉప్పునీళ్ళే!'** అలాగే చరిత్ర పుటలను పిండితే కన్నీటితో పాటు ద్వేషాగ్నుల సెగ కూడా తగులుతుందంటాడు కవి. ఈ కావ్యంలో కవి చరిత్రను ఒక జ్ఞాన భాండాగారంగా చూశాడు. అందుకే **'చరిత్ర అంటే మానవ జ్ఞాన పురోగతి'** అంటాడు కవి. అలాంటి చరిత్రలు నాయకులు విజ్ఞానవంతులై ఉంటే ఎలా ఉంటుందో వర్ణిస్తూ..

**'నాయకులు విజ్ఞానులవుతే**
**భూగోళం మీదున్న ప్రతి దేశమూ**
**ఒక యోగభూమే!'** కవిదృష్టిలో ఒక దేశం కేవలం కర్మభూమిగానే కాదు యోగభూమి అయి ఉండాలని కోరుకోవడం కనిపిస్తుంది. అట్లాంటి నాయకుల నాయకత్వంలో భారతజాతి సహస్రాబ్దాలకు పూర్వమే యోగ భూమిగా పరిణామం చెందిందని, ఇది కూడా ఈ జాతి విశిష్టతకు నిదర్శనమని ఈ కావ్యం చెబుతున్నది.

దేశాన్ని కేవలం రాజకీయ జాతిగా కాకుండా ఆధ్యాత్మిక భూఖండంగా పరిణమింపచేశారని చెబుతూ ఈ కావ్యంలో..

**'రాజకీయం నుంచి కూడా**
**ఆధ్యాత్మికాన్ని మొలిపించిన**
**మానుష దేహదారులైన అవతారాలు**
**వారు..'** అంటారు.

వీరభద్రయ్యగారి కలానికి రెండువైపులా పదునే. ఒకవైపు కవిత్వం, మరొకవైపు విమర్శ. ఇలా సృజన విమర్శనా శక్తుల మేళవింపు వీరి ఈ కావ్యంలో కనపడుతుంది.

జాతి సంస్కృతులను కాపాడేది కావ్యమని, అలాంటి కావ్యాలను సృజించే కవులు కళాకారులు దేవదూతలని వర్ణిస్తూ ఇలా అంటారు..

**'కవులు కళాకారులు దేవదూతలుగా**
**వర్తిస్తూ నాయకత్వం వహిస్తుంటారు.**
**జీవితానుభవాల బాణం నేలలోకి ప్రయోగిస్తే**
**చిమ్మిన కవితామృతమే కావ్య సరస్సులయినవి..'** ఇలాంటి వినూత్న భావచిత్రణతో ఉన్న కవితాపంక్తులు ఈ కావ్యానికి సౌందర్యస్ఫోరకంగా కనిపిస్తాయి. ఈ కావ్యంలో జాతిసంస్కృతులను ముందుకు నడిపే శక్తిపుంజంగా కావ్యాన్ని వర్ణించడంలో వీరభద్రయ్యగారి కవిత్వంలోని విమర్శనా శక్తి ప్రస్ఫుటం అవుతుంది.

ఈ దేశంలో జాతిచైతన్యానికి కృషి చేసిన త్యాగధనులైన మహానుభావులు ఉన్నట్లే మన జాతికి ద్రోహం తలపెట్టి, జాతికి నష్టం చేసే దుర్మార్గులు కూడా కొందరు ఉంటారని అలాంటివారు జాతి శత్రువులై 'బడా బద్మాష్'లుగా రూపొందుతున్నారంటారు కవి. తన వ్యంగ్యోక్తులతో వారి స్వభావాన్ని ఎండగట్టినాడు ఈ కావ్యంలో.

ఇంకా ఈ కావ్యంలో భరతజాతి ఆదర్శ లక్షణాలు అరవిందులు, అనీ బిసెంటు, నివేదితా, ఆల్కాట్ వంటి వారు భారత హైందవజాతి అమృతబిందువులన్నారు. జీవన మరణాల రహస్యాలను కనుగొన్న నచికేతాది మహర్షుల తపో బలమూ మొదలైన అనేక విశిష్టతలతో కూడుకొని ఉన్న భరత జాతి వేల ఏండ్లుగా తన వైభవాన్ని తన చైతన్యాన్ని చెక్కుచెదరనీకుండా ప్రపంచవ్యాప్తంగా ఎలా విస్తరించుకుంటూపోతోందో వివరిస్తూ ఆచార్య ముదిగొండ ఈ **'జాతి విపంచీగానం'** కావ్యాన్ని రూపొందించారు. అందుకే ఈ కావ్యం చివరలో..

**'చెదరిపోని దీక్షతో – లోకం ఆశ్చర్యపోయే**
**మహామహా సత్యాలను**
**పొరలు విప్పి ఆవిష్కరించిన**
**విలక్షణ విచిత్ర విశేష జాతి**
**... ... ...**
**తాను వికసిస్తూ పూదీపంలాగా**
**ప్రపంచోద్యానవనంలో**
**కాంతి వికాసాలను వెదజల్లు ఘనజాతి**
**ప్రకాశజాతి – భరతజాతి..'** అన్న కవితాపంక్తులు జాతి విశ్వచైతన్య గీతమై సహృదయ పాఠకుల మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

**– ఆచార్య కె. యాదగిరి**, 9390113169



## క..రోనా

గర్వమంతా సఫా గాలిలో
జావగారి పోయి పుర్రు కొట్టింది
గాబరా పాము పాకింది ప్రపంచ శరీరమంతా
ఒక్క దెబ్బకే ఒకే ఒక్క దెబ్బకే
కుప్పకూలిపోయింది గుట్టంత ఏనుగు
రాలింది పెళ్లలు పెళ్లలుగా, పెచ్చులు పెచ్చులుగా..

నిన్నటి దాకా ఉండేది పోటీ
సై ఆనేది సరఫరాలో ఏదైనా చీఫ్‌గా
ఇప్పుడు తన దేశం తలుపులు తానే మూసుకొని
చేసుకుంటూనే ఉంది శస్త్రాలకు అందని చికిత్స
పోయిన వారెందరో, ఉన్నవారెందరూ
లెక్కలు కాదులే పక్కా
ఎంత తలుపులు బిడాయించుకున్నా
వైరస్ పక్కా ఔర్ ఏక్ దక్కా
దేశం వెనుక దేశం కోవిడ్-19 హాలాహలంలో..

షేక్ షేక్.. ప్రపంచ షేర్ మార్కెట్లు
మాల్స్ హంగామాల మార్కెట్‌కూ గాయాలు
షేక్‌హ్యాండ్‌కూ చేతులు దూరం
మొదటి దెబ్బకు లబలబా మొత్తుకోగానే
మార్కెట్ కా..రోనా మొదలు..

ఇప్పుడు ప్రపంచమంతా కుగ్రామం కదా
వాట్సప్, ఫేస్‌బుక్‌లు పాకినట్లుగానే
కర్ర పెత్తనం చేస్తోంది కరోనా
చలి లేదు, ఎండ లేదు మంట పెట్టడానికి
దేశం ఏదైతేనేం, ప్రాంతం ఎక్కడుంటేనేం
లబోదిబో లబ లబ లబ
విపరీత బుద్ధులతో మొదలైన వినాశనం
ఇపుడు అణ్వస్త్రాలు ఆయుధాలవసరం లేదు
కంటికి కనిపించని వైరస్ చాలు
భస్మాసురహస్తం తనపై, అందరిపై..

ఇప్పుడిక చేతులు కడుక్కుందాం
కాళ్లు, మొఖాలు కడుక్కుందాం
మనల్ని మనమే కడిగేసుకుందాం
ముఖాలకు మాస్క్‌లేసుకుందాం
దగ్గినా తుమ్మినా దాచి దాచుకొని తుమ్ముదాం
ఎవరికి వారే ఒంటరితనంతో
బతుకుదాం భయం భయంగా
రోగం పలకరిస్తే ఊరడింపులుండవు
సానుభూతుల మాటలు సల్ల చిలుకవు
వెలేసినట్లుగా ఐసోలేషన్ వార్డుల్లో
బితుకు బితుకుమంటూ బిక్కచచ్చిన ముఖంతో..

పిట్టల కంటే బలహీనంగా మనుషులు
ఇపుడంతటా కరోనా రెడ్ అలర్ట్
శరీరమంతా మాస్కులు ధరించిన
ఒంటరితనాల వార్డులు రెడీ రెడీ
చావు రోగం కబురు చల్లగా చెప్పరు
ప్రపంచమంతా టాంటాం దండోరా
జాగ్రత్త పారా బడా హుషార్...

– కొమురవెల్లి అంజయ్య

# సాహితీ విందు

కథలన్నీ కంచికి చేరవు మన చుట్టూ ఉన్న జీవితాలే కథలుగా తిరుగుతూ ఉంటాయి. కథలాంటి జీవితం, జీవితం లాంటి కథ కళ్ళ ముందు జరిగిపోతూ ఉంటాయి. నిన్నటి సంఘటన నేడు జ్ఞాపకమై పుస్తకంలో అక్షరమైపోతుంది. సాహిత్యంలో కథకు ప్రత్యేకత ఉంది. అందులో జీవితంలో జరిగినవాటికి ఇంకా ప్రాముఖ్యం ఉండటంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

**ఇదంతా** ఎందుకంటే.. మనిషి జీవితమే కథగా మలిచిన సందర్భాలని ఒక చోట చేర్చి 'మృష్టాన్న భోజనం'గా పాఠకులకు అందించే ప్రయత్నంలో వచ్చిన పుస్తకమే **'మీల్స్ టికెట్'**. సాహితి ఆకలి గల పాఠకుల ఆకలి అంత త్వరగా తీరదు. అందునా కథల్ని ఇష్టపడే పాఠకులకైతే ఈ 'మీల్స్ టికెట్' దాన్నుంచి మినహాయించవచ్చు. ప్రముఖ నవలా రచయిత, కవి, కథకుడు అయిన ప్రభాకర్ జైని రచించిన ఈ 'మీల్స్ టికెట్' పాఠకుడికి నిజంగా ఫుల్ మీల్స్ అనొచ్చు. పద్దెనిమిది టికెట్‌లుగా విభజించబడిన ఈ పుస్తకంలో ప్రతి కథ మీ జీవితాల్లో జరిగేదే అంటాడు




ఈ కథలను ఒకేసారి కాకుండా ఒక్కో కథ చదువుతూ పోతే పాఠకుడు నిజంగా ఆస్వాదించగలుగుతాడు. జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, కష్టాలు, నష్టాలు ఎలా ఎదుర్కొవాలి, మారుతున్న సమాజానికి అనుగుణంగా ఎలా మార్చుకోవాలో ఈ కథల్లో ఉన్నది. బాల్యం అప్పుడు, ఇప్పుడు ఎలా ఉంది వంటి అంశాలన్నీ సమూలంగా విశ్లేషించి కథలో కూర్చారు ప్రభాకర్ జైని.

భార్య భర్తల అనురాగం వందేళ్ల దాకా కొనసాగేది. ఒకరికొకరు విడదీయలేంతగా పెనవేసుకున్న బంధం మృత్యువులో కూడా తోడై ఉంటే నిజమైన సోల్మేట్ అవుతారు. భర్తకు గుండెపోటు వచ్చిందని తెలిసిన మరుక్షణం సీతకు కూడా గుండెపోటు వచ్చి హాస్పిటల్‌లో పక్క పక్క బెడ్‌లో ఇద్దరు ఉంటే, భర్తకు స్పృహ వచ్చి భార్యను దీనస్థితిలో చూశాక మనసు నుంచి వచ్చిన మాటలు రికార్డు చేసి సీత చెవిలో వినిపించాక లేచి కన్నీళ్లు కార్చి చనిపోతుంది. ఒకే సమయంలో ఇద్దరు మృత్యువులో కూడా తోడై వెళ్ళిపోతే నిజమైన ప్రేమకు అనుబంధానికి చిహ్నామని చక్కగా మలిచారు 'సోల్‌మేట్' కథలో.

జీవితం చాలా చిన్నది. మనం ఈ లోకంలో ఉన్నంతవరకే అనుభవించాలి పరిపూర్ణంగా అని శాంతకు అన్నీ తెలియజేసి చివరి మజిలీకి రెడీగా ఉండిపోవడం మాటలు చెప్పినంత తేలిక కాదు. అందుకే శాంతతో తన అకౌంట్ వివరాలతో పాటు తన జీవితంలో జరిగిన క్షణాల్ని తలచుకొని వైరాగ్యంలో పడిపోతాడు. అయినా కూడా 'డోంట్ వర్రీ బీ హ్యాపీ'గా ఉండమంటాడు. ఆకాష్ గొప్ప ఇంటి బిడ్డ, కోట్ల ఆస్తికి వారసుడు. అందమైన భార్య. అయితే ఉన్నట్టుండి ఒక విషయంలో తండ్రితో తగాదా పడాల్సి వస్తుంది. దాంతో తండ్రి భార్య సమక్షంలో తిట్టాడని అవమానంతో వెళ్ళిపోతే, అది సహించలేని ఆకాష్‌భార్య మంజరి ఆత్మహత్య చేసుకుంటుంది. దాన్ని మరిచిపోవడానికి యాత్రలు చేస్తున్న సమయంలో రైలులో ఎదురైన అనుభవం అతని దృక్పథాన్ని మారుస్తుంది. యాదృచ్ఛికంగా ఒకరి ప్రేమ నుంచి మరొక ప్రేమలో మునిగిపోకముందే కళ్ళు తెరుస్తాడు. అదే 'అమృతపాదాలు' కథ. బ్యాంకు వేలంపాటలో తనవంతు వాటా వస్తే చాలు అనుకున్నవాడు, తన బంధువు నెల నెల తెచ్చే వేలంపాటలో వాటా కోసం ఎదురు చూసినవాడు, తన బంధువు కక్కుర్తి కలవాడని నిర్ణయించుకున్న వాడు ఒక ఆడ కూతురు జీవితాన్ని కాపాడటానికి ఏమి చేశాడు అనేదిమనసు 'వేలం బంగారం'లో కథను అద్భుతంగా మలిచారు. వ్యాపార దృక్పథమే కాదు మానవత్వం కూడా ఉందని నిరూపించారు.

'పాల ఐస్క్రీమ్ కథ' లో నాటి జనరేషన్‌కు, నేటి జనరేషన్‌కు ఉన్న తేడాను చక్కగా వ్యక్తీకరించారు. మనమరాలు పదో తరగతి పాస్ అయితే ఎలా ప్రత్యేకంగా జరుపుకున్నారు,అదే పదోతరగతి పాస్ అయినప్పుడు ఆ తాత బాల్యపు జ్ఞాపకం ఇప్పుడు ఎంత ఖరీదో 'పాల ఐస్క్రీమ్'లో చెప్పిన తీరు బాగుంది. ఒక డాక్టర్ అయి ఉండీ తనకు ఉన్న జబ్బు నలుగురికి తెలిస్తే ఎక్కడ తన ప్రాక్టీస్, పేరు చెడిపోతుందేమోనని దిగులుతో ఉబ్బసం రోగాన్ని ముదరపెట్టుకొని ఒక కాలరాత్రిని ఎలా అధిగమించగలిగాడో చెప్పేదే 'కాలరాత్రి' కథ.

మనిషి నిజాయితీతో ముందుకు సాగితే ఏ రంగాన్నైనా ఏలవచ్చు. వ్యాపారికి ఉండాల్సిన ముఖ్య లక్షణం నిబద్ధత, నిజాయితీ, నాణ్యత. ఒక రైతు తన పొలంలో పండించిన పంటను తరలించే క్రమంలో అవినీతి అధికారికి ఎలా సమాధానమిచ్చాడు? ఆ క్రమంలో అతనిలో వ్యాపారి ఎలా అభివృద్ధి చెందాడు. నలుగురికి దారి చూపి వ్యాపారి నిజాయితీగా వ్యాపారంచేస్తే ఆకాశాన్ని అందుకోవచ్చు అని చెప్పేదానికి ఉదాహరణ లంచంలేని వ్యాపారం. అర్హత కలవాడికి రావలసిన రాయితీలు ఎలా పక్కదారి పడుతున్నాయి, స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారికి కలిపించే రాయితీలను ఒక బద్ధకస్తుడు ఎలా దుర్వినియోగం చేసి, అత్యాశకు పోయి ఎలా దొరికిపోయాడో చక్కగా వివరించారు. నిజమైన స్వాతంత్ర్య సమరయోధులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు చివరికి ఎలా అధిగమించగలిగారన్నది తెలిపే కథనే 'ఫ్రీడమ్ ఫైటర్'.

ఇవి కొన్ని కథలు మాత్రమే. ఇంకా ఇందులో 'అలసితిని', 'నాయనా రావే', 'ప్రాప్తకాలజ్ఞానుడు', 'శాంతి పావురం', 'సర్దుకున్నారా' లాంటి మంచి కథలున్నాయి. ఈ కథలను ఒకేసారి కాకుండా ఒక్కో కథ చదువుతూ పోతే పాఠకుడు నిజంగా ఆస్వాదించగలుగుతాడు. జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, కష్టాలు, నష్టాలు ఎలా ఎదుర్కొవాలి, మారుతున్న సమాజానికి అనుగుణంగా ఎలా మార్చుకోవాలో ఈ కథల్లో ఉన్నది. బాల్యం అప్పుడు, ఇప్పుడు ఎలా ఉంది వంటి అంశాలన్నీ సమూలంగా విశ్లేషించి కథలో కూర్చారు. ప్రభాకర్ జైని కవి, నవలాకారుడే గాక మంచి కథ కుడని ఈ సంపుటి ద్వారా రుజువు చేసుకున్నాడు. తన చుట్టూ జరిగే వాటిని కథలుగా, కవిత్వంగా మలుస్తూ సృజనకారులు చైతన్యంతో ముందుకు సాగాలని తన అనుభవాలను అక్షరరూపంలో వెలువరించారు. తన సాహిత్య సృజన ద్వారా, కథల ద్వారా సమాజంలో ఆవిరి అవుతున్న మానవీయతను ఎత్తిచూపుతూ మనుషులు తమ గుండెల్లో తడి ఆరనీయరాదని చెప్పారు.

పలు వార్తాపత్రికల్లో వీరి కథలు ప్రచురితమయ్యాయి. **'మీల్స్ టికెట్'** పాఠకుల సాహితీ ఆకలిని తీరుస్తుందని ఆశిస్తున్నాను. ప్రభాకర్ జైని మరిన్ని మంచి కథల సంకలనాలు తీసుకురావాలని కోరుకుందాం.

**– పుష్యమీ సాగర్**, 9010350317

## ప్రకటనలు

### రచనలకు ఆహ్వానం

**ఉగాది** పర్వదినం పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు, జనరల్ విభాగాలకు 'నేను చూసిన తెలంగాణ' అంశంపై వేర్వేరుగా వచన కవితల పోటీల కోసం రచనలను ఆహ్వానిస్తున్నాం. కవితలు 20 లైన్లకు మించరాదు. రచనతో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, హామీ పత్రం జతచేయాలి. రచనలు 2020 ఏప్రిల్ 5వ తేదీలోగా అందేట్లు పంపాలి. చిరునామా: చదువు వెంకటర్‌రెడ్డి, గ్రామం, మండలం: కమాన్‌పూర్, జిల్లా పెద్దపల్లి–505188. వివరాలకు: 9182777409, 9989078568


**– చదువు వెంకట్‌రెడ్డి,**
**గుడికందుల భూమయ్య**

### 'మధురపద్మాలు' ఆవిష్కరణ సభ

జక్కాపూర బడిపిల్లల కవితలు 'మధురపద్మాలు' ఆవిష్కరణ సభ 2020 మార్చి 12న ఉదయం 11.30 గంటలకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జక్కాపూర్ ఆవరణలో జరుగుతుంది. రాళ్లబండి పద్మయ్య అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా దుర్గం పర్శరాములు, మాడుగుల మరళీధర శర్మ, కొమురవెల్లి అంజయ్య, కలకుంట్ల రంగాచారి, సత్తు యాదవరెడ్డి, తోట మధుసూధన్, గోపాలపురం భానుచందర్, పల్లె కనకాంబరం, కోడి రమేష్, ముదిగంటి రవీందర్‌రెడ్డి హాజరవు తారు. బైస దేవదాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

**– జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయ,**
**విద్యార్థిబృందం,జక్కాపురం,**
**మండలం: నారాయణరావుపేట, సిద్దిపేట జిల్లా.**

## కొత్త పుస్తకాలు



### కిషన్‌చందర్ కథలు

భారతీయ సృజనాత్మక సాహితీక్షేత్రంలో ప్రఖ్యాతుడు కిషన్ చందర్. ఆయన రచనలు భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, రష్యన్, డేనిష్, పోలిష్, జర్మన్, హంగేరియన్, చైనా భాషలలోకి అనువదింపబడ్డాయి. ఆయన రచనలు సమాజ స్వరూపానికి అద్దం పడుతాయి. మహోదాత్త శ్రమకూ, ప్రేమకూ నీరాజనమిస్తాయి.


**రచన:** కిషన్‌చందర్, అనువాదం:జ్ఞానవేంద్ర, వెల: రూ. 120
**ప్రతులకు:** నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జీఎస్ఐ పోస్ట్, హైదరాబాద్–68.

### పాలపిట్ట వినూత్న కవిత

సంఘజీవిగా ఉన్న మనిషి సామాజిక సంఘటనలకు, సంక్షోభాలకు స్పందించక తప్పని స్థితిలోంచి వచ్చిన కవితల సమాహారమే ఇది. ఇవ్వాళ విభిన్న పాయలుగా అనేకమంది కవిత్వం రాస్తున్నారు. తమ అంతర్లోకాల అలజడిని కవిత్వం చేస్తున్నారు. అలా చేసిన వందమంది కవుల స్పందనలే ఈ 'వినూత్న కవిత'.

**సంకలనం:** పాలపిట్ట, **వెల:**100,
**ప్రతులకు:** పాలపిట్ట బుక్స్, ఫోన్: 9848787284





### కొండపొలం


**పల్లెపరిసరాలలో** బతుకు వనరులు లభ్యం కానప్పుడు దగ్గర్లోని కొండల మీద ఆధారపడటం సహజం. ఉదయం వెళ్లి సాయంత్రం లోపల అటవీ ఉత్పత్తులను సేకరించుకొని వచ్చేవాళ్లు కొందరైతే, వారం పదిరోజుల పాటు అక్కడే కొండపొలం చేసి బతుకు దెరువు సాధించుకునే వాళ్లు మరి కొందరు. వారి జీవన సమరమే ఈ 'కొండపొలం' నవల.

**రచన:** సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి,
**వెల:** రూ. 200
**ప్రతులకు:** విశాలాంధ్ర, నవోదయ బుక్ హౌస్, అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు.

### నిసర్గ (సాహిత్య వ్యాసాలు)

**ఈ** సాహిత్య వ్యాసాలు వివిధ సందర్భాల్లో రాసినవి. దాటిపోయిన గొప్ప కవుల కృషిని విలువకట్టే ప్రయత్నం ఇది. విభిన్న దృక్పథాలు గల ఆధునిక కవుల పరామర్శలే ఇవన్నీ. వారంతా కవిత్వమే జీవితంగా జీవించిన వాళ్లు. ఎంతో కోల్పోతూ సమాజానికి వివేకం నేర్పిన వాళ్లు. ఆయా కవుల సృజన స్వరూప స్వభావాల్ని విడమర్చి చెప్పిన ప్రయత్నమే ఈ వ్యాస సంపుటం.

**రచన:** డాక్టర్ పాపినేని శివశంకర్, **వెల:** రూ. 110
**ప్రతులకు:** నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జీఎస్ఐ పోస్ట్, హైదరాబాద్–68.



## విలువల పరిరక్షణ కోసమే హెచ్‌బీటీ

నవతరానికి మంచి పుస్తకాలు అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ (హెచ్‌బీటీ) ఏర్పడింది. ఈ సంస్థ నలభై సంవత్సరాలు పూర్తిచేసుకొని పురోగమిస్తుండటం తెలుగు వారికి గర్వకారణం. సంస్థ ఏర్పడిన కొత్తలో అభ్యుదయవాదులైన మేధావులు ఎందరో ఈ సంస్థకు చేయూతనిచ్చారు. లాభాపేక్ష లేకుండా అతి తక్కువ ధరలకు గొప్ప రచనలను అందించిన ఘనత హెచ్‌బీటీకి దక్కుతుంది. ప్రజల సాంస్కృతిక చైతన్యానికి ఉపకరించే విధంగా ఉండే రచనలను ఎంపిక చేసి ప్రచురించడంలో, ఇతర భాషల నుంచి అనువదించి ప్రచురించడంలోనూ హెచ్‌బీటీకి ప్రత్యేకత ఉన్నది.

విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను మౌలికంగా రాయించడంతో పాటు అనువాదాలూ ప్రచురించింది. మత, ధార్మిక విషయాలకు సంబంధించిన రచనలూ స్త్రీవాద, దళిత వాదాలకు సంబంధించిన రచనలకు హెచ్‌బీటీ కేంద్రం. ఈ క్రమంలో ఎక్కడో వేదాలలో దాచిపెట్టిన విషయాలను కొత్త తరం వారు తెలుసుకోవాలనే తపనతో హెచ్‌బీటీ శ్రమించింది. ఎన్నో విలువైన పరిశోధనాత్మక రచనలను పాఠకులకు అందించింది. తెలుగు పాఠకలోకాన్ని చైతన్యపరిచేందుకు హెచ్‌బీటీ సాగించిన ప్రయాణంలో 'నలుపు' పత్రిక నిర్వహణ ఒక మైలురాయి. ఇది ప్రాంతీయ చైతన్యానికీ, దళిత వదానికీ అండదండలందించి గొప్ప చారిత్ర బాధ్యతను నెరవేర్చింది.

భిన్న నేపథ్యాల చదువరులను ఒక అనుకూల భావజాలంవైపు ఆకర్షించే రీతిలో హెచ్‌బీటీ ప్రచురణలు సాగిస్తున్నది. ఈ సంస్థ ప్రచురణ రంగంలో అసాధారణమైన కృషి చేస్తున్నదనటం నిర్వివాదాంశం. ప్రజాస్వామిక విలువల పరిరక్షణే ధ్యేయంగా భావి తరాన్ని సంఘటితంగా, సజీవంగా ఉంచడానికి హెచ్‌బీటీ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది. ఈ కృషి వెనుక అచంచలంగా దృఢమైన దీక్షతో నిలిచి ఉన్న గీతారామస్వామి గారికి పాఠకలోకం తరపున అభినందనలు.

**–విజయభారతి**


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 9 మార్చి 2020



సమంత

# సూపర్‌స్ట్రాంగ్ సమంత

**చూ**డచక్కటి రూపంతో నాజూకుగా, మెరుపుతీగలా కనిపిస్తుంది చెన్నై సోయగం సమంత. అయితే ఫిట్‌నెస్ విషయంలో మాత్రం ఈ అమ్మడు అందరు నాయికల కంటే ముందుంటుంది. సోషల్‌మీడియాలో తరచుగా తన వర్కవుట్స్ తాలూకు వీడియోల్ని పోస్ట్ చేస్తుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో తాజాగా పంచుకున్న ఓ వీడియోలో సమంత ఏకంగా వందకిలోల బరువుని ఎత్తి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. 'నిన్ను తిరిగి కలవడం ఆనందంగా ఉంది. వంద కిలోల సుమో డెడ్ లిఫ్ట్' అంటూ ఈ వీడియోకు కామెంట్‌ను జత చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. సన్నగా రివటలా కనిపించే ఈ సుందరిలో ఇంతటి బలమెక్కడిదో అంటూ నెటిజన్లు ఆశ్చర్యపడుతున్నారు. మరికొందరేమో 'నువ్వు సూపర్‌స్ట్రాంగ్' అంటూ కితాబిస్తున్నారు. ప్రస్తుతం సమంత తమిళంలో విఘ్నేష్‌శివన్ దర్శకత్వంలో 'కాత్తువక్కుల రెండు కాదల్' సినిమాలో నటిస్తోంది.



'ఉప్పెన' చిత్రంలో కృతిశెట్టి, వైష్ణవ్‌తేజ్



విజయ్ దేవరకొండ, పూరిజగన్నాథ్, ఛార్మి

# ముంబైలో ఫైటర్ పోరాటం

**విజయ్** దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. అనన్యపాండే కథానాయిక. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్, ధర్మా ప్రొడక్షన్స్ సంయుక్తంగా పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ముంబయిలో చిత్రీకరణ జరుగుతున్నది. ప్రధాన తారాగణంపై ముఖ్యఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 40రోజుల పాటు జరిగిన షూటింగ్‌లో కీలక ఎపిసోడ్స్‌తో పాటు భారీ యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. ఈ షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండతో పాటు రమ్యకృష్ణ, అనన్యపాండే, రోణిత్‌రాయ్, అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో విజయ్‌దేవరకొండ బాక్సర్‌గా కనిపించబోతున్నారు. ఇందుకోసం ఆయన థాయ్‌లాండ్‌కు వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రానికి 'ఫైటర్' వర్కింగ్ టైటిల్‌గా ప్రచారంలో ఉంది. విష్ణురెడ్డి, మకరంద్‌దేశ్‌పాండే, గెటప్‌శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: విష్ణుశర్మ, ఫైట్స్: కెచ్చా, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి, కరణ్‌జోహార్, అపూర్వ మోహతా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పూరిజగన్నాథ్.

# ప్రయోగాత్మక చిత్రంలో..



నాని

**వై**విధ్యతకు పెద్దపీట వేస్తూ సినిమాలు చేస్తుంటారు హీరో నాని. ప్రతి సినిమాలో హీరోగా తనను తాను నవ్యరీతిలో ఆవిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. తాజాగా ఆయన ప్రయోగాత్మక చిత్రాన్ని చేయబోతున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. సున్నితమైన కథాంశాలకు వినోదాన్ని జోడించి 'మెంటల్ మదిలో', 'బ్రోచెవారెవరురా' చిత్రాల్ని తెరకెక్కించి ప్రతిభను చాటుకున్న వివేక్ ఆత్రేయ నవ్యమైన పాయింట్‌తో నాని సినిమాను రూపొందించబోతున్నట్లు సమాచారం. గత సినిమాలకు పూర్తి భిన్నంగా పూర్తిస్థాయి వినోదభరిత కథాంశానికి సామాజిక అంశాన్ని కలబోసిన ఇతివృత్తం కావడంతో నాని ఇందులో నటించడానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీమూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుందని తెలుస్తున్నది.


# మిస్ ఇండియా కలలు



'మిస్ ఇండియా' చిత్రంలో కీర్తి సురేష్

'**ధై**ర్యంగా కలలు కంటూ తన లక్ష్యసాధన కోసం ప్రయాణించే ఓ యువతి కథేమిటో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటోంది కీర్తి సురేష్. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'మిస్ ఇండియా'. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు నిర్మిస్తున్నారు. నరేంద్రనాథ్ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదలకానుంది. మహిళ దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని కొత్త స్టిల్‌ను కీర్తిసురేష్ అభిమానులతో పంచుకున్నది. ఇందు లో కుర్తా, జీన్స్‌లో సంప్రదాయరీతిలో చిరునవ్వులు చిందిస్తూ ఆమె కనిపిస్తున్నది. జీవితం పట్ల సానుకూల దృక్పథమున్న యువతిగా కీర్తిసురేష్ పాత్ర స్ఫూర్తిదాయకంగా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. మహిళా ప్రధాన ఇతివృత్తానికి కుటుంబ విలువల్ని జోడిస్తూ ఆద్యంతం వినోద ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# మతాన్ని నమ్మను..నేను భారతీయుణ్ణి



అక్షయ్‌కుమార్

**దే**శవ్యాప్తంగా పౌరసత్వ సమరణ చట్టంపై ఆందోళనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్‌కుమార్ మతం, భారతీయత గురించి కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తాను నటించిన తాజా యాక్షన్ చిత్రం 'సూర్యవన్షి' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న అక్షయ్‌కుమార్ ఓ ఆంగ్ల పత్రికకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన తాను మతాన్ని విశ్వసించనని, భారతీయత అన్నదే తన మతమని చెప్పారు. ఇదే అంశాన్ని 'సూర్యవన్షి' చిత్రంలో ఆవిష్కరించామన్నారు. 'భారతీయుడిగా ఉండటమే నాకు ఇష్టం. మతం గురించి ఏమాత్రం ఆలోచించను. హిందూ, ముస్లిం, సిక్కు, పార్శీ..ఎవరైనా కావొచ్చు ప్రతి ఒక్కరూ భారతీయత అనే అద్దంలోంచే ఈ సమాజాన్ని వీక్షించాలి. మా సినిమాలో ఇదే అంశాన్ని తెలియజెప్పాం' అని అక్షయ్ తెలిపారు. యాదృచ్ఛికంగా ఈ సినిమాలో మతవిద్వేషాలకు సంబంధించిన ఇష్యూస్‌ను చర్చించడం జరిగిందని, ప్రస్తుతం దేశంలోని పరిస్థితులకు అద్దం పట్టే విధంగా సినిమా ఉంటుందని అక్షయ్‌కుమార్ చెప్పారు. రోహిత్‌శెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలకానుంది.

# మహా అన్వేషణ



'నిశ్శబ్దం' చిత్రంలో అంజలి

**అం**దమైన నాయికలు శక్తివంతమైన పోలీస్ అవతారాలెత్తడం కొత్తేమి కాదు. గతంలో అగ్రనాయికలెందరో పోలీస్ పాత్రల్లో మెప్పించారు. తాజాగా తెలుగందం అంజలి కెరీర్‌లో తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్‌అధికారిణి పాత్రను పోషిస్తోంది. వివరాల్లోకి వెళితే..అనుష్క కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్‌మధుకర్ దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. ఏప్రిల్ 2న విడుదలకానుంది. ఆదివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని అనుష్క, అంజలి, షాలినిపాండే లుక్స్‌ను విడుదల చేశారు. ఇందులో అంజలి అమెరికన్ పోలీస్ ఆఫీసర్ లుక్‌లో కనిపిస్తోంది. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అంజలి..మహా అనే అమెరికన్ క్రైమ్ డిటెక్టివ్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుందని, దెయ్యాల కొంపగా పేరుపొందిన ఓ విల్లాలో జరిగే భయానక ఘటనల రహస్యాన్ని ఆమె ఎలా ఛేదించిందన్నది ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుందని చిత్ర బృందం చెప్పింది. 'కెరీర్‌లో ఇప్పటివరకు చేయని ఓ వినూత్న పాత్ర ఇది. అంజలికి ప్రత్యేకగుర్తింపును తీసుకొస్తుంది' అని దర్శకుడు చెప్పారు. సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో అనుష్క మూగ, బధిర యువతి సాక్షి పాత్రలో కనిపించనుంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రూపొందుతున్న క్రాస్‌ఓవర్ చిత్రమిది. ఆర్.మాధవన్, అంజలి, మైఖేల్ మ్యాడ్‌సన్, షాలినిపాండే, సుబ్బరాజు, శ్రీనివాస్ అవసరాల తదితరులు ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు.

# నిర్మాత వెంకటరాజు కన్నుమూత



**సీనియర్** సినీ నిర్మాత సి. వెంకటరాజు ఆదివారం చెన్నైలో అనారోగ్యంతో కన్నుమూశారు. గీత చిత్ర ఇంటర్నేషనల్ పతాకంపై హీరో వెంకటేష్‌తో పవిత్రబంధం, పెళ్లిచేసుకుందాం, ఘర్షణ చిత్రాల్ని నిర్మించారాయన. జగపతిబాబుతో 'శ్రీమతి వెళ్లొస్తా' సినిమాను రూపొందించారు. కృష్ణవంశీ దర్శకత్వంలో ప్రభాస్‌తో 'చక్రం' చిత్రాన్ని నిర్మించారు. రాఘవేంద్రరావు, ముత్యాల సుబ్బయ్య వంటి అగ్ర దర్శకులతో పని చేశారు వెంకటరాజు. ఆయన అంత్యక్రియల్ని సోమవారం చెన్నైలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# పద్నాలుగేళ్ల తర్వాత సీక్వెల్



ధనుష్

**తొ**మ్మిదేళ్ల విరామం తర్వాత హీరో ధనుష్, దర్శకుడు సెల్వరాఘవన్ కలయికలో ఓ సినిమా రాబోతున్నది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన 'కాదన్ కొండేన్', 'పుదు పెట్టై, 'మయక్కాం ఎన్నా' చిత్రాలు పెద్ద విజయాల్ని సాధించాయి. తాజాగా సోదరుడు ధనుష్‌తో 'పుదుపెట్టై' సీక్వెల్‌ను తెరకెక్కించబోతున్నట్లు సెల్వరాఘవన్ ప్రకటించారు. ఓ గ్యాంగ్‌స్టర్ జీవితం నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకోనున్నట్లు సమాచారం. 'ధనుష్, నేను మళ్లీ కలిసి సినిమా చేయాలని నిర్ణయించుకున్న తర్వాత ఎలాంటి కథ ఎంచుకోవాలనే దానిపై చాలా చర్చించుకున్నాం. వాటిలో ఈ సీక్వెల్ సరైందనే నిర్ణయానికి వచ్చాం' అని సెల్వరాఘవన్ పేర్కొన్నారు. పద్నాలుగేళ్ల తర్వాత సీక్వెల్ రూపొందనుండటం కోలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

# డ్యాన్సింగ్ క్వీన్ పాత్రలో



కాజల్ అగర్వాల్

**టా**లీవుడ్‌లో ప్రస్తుతం రీమేక్ సినిమాల ట్రెండ్ కొనసాగుతోంది. ఇతర భాషల్లో విజయవంతమైన చిత్రాల్ని తెలుగులో రీమేక్ చేసేందుకు అగ్రనాయకానాయికలు ఆసక్తిని కనబరుస్తున్నారు. తాజాగా కాజల్ అగర్వాల్ ఓ రీమేక్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. 2012 ఏడాదిలో కొరియన్ భాషలో రూపొందిన 'డాన్సింగ్‌క్వీన్' చిత్రం పెద్ద విజయాన్ని సొం తం చేసుకున్నది. ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటించనున్నట్లు సమాచారం. పెళ్లైన ఓ జంట తమ కలల్ని ఎలా సాకారం చేసుకున్నారనే కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నది. లక్ష్యానికి వయసుతో సంబంధం లేదని, ఏ వయసులోనైనా స్వప్నాల్ని సాకారం చేసుకోవచ్చనే పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో అల్లరి నరేష్ హీరోగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సురేష్‌బాబు ఈ సినిమాను నిర్మించనున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రీమేక్‌కు సంబంధించి దర్శకుడిని ఎంపికచేసే పనిలో చిత్రబృం దం ఉన్నట్లు సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో 'మోసగాళ్లు' చిత్రంతో పాటు తమిళంలో శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్-2' చిత్రంలో నటిస్తోంది. హిందీలో నాలుగేళ్ల తర్వాత పునరాగమనం చేస్తూ 'ముంబయి సాగా' అనే చిత్రంలో నటిస్తోంది.



'ప్రేమపిపాసి' చిత్రంలోని పాటను విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్ యాదవ్

# నవతరం మనోభావాలతో..

'**నేటి** అభిరుచులకు తగిన సంగీతం, సాహిత్యంతో పాట బాగుంది. నవ్యతను నమ్మి చిత్రబృందం చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించాలి' అని అన్నారు సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షీవర్మ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ప్రేమపిపాసి'. పి.ఎస్.రామకృష్ణ నిర్మాత. మురళీరామస్వామి దర్శకుడు. ఈ చిత్రంలోని 'ఐఫోన్ లాంటి పిల్లంటూ' అనే పాటను మంత్రి శ్రీనివాస్‌యాదవ్ విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'యువతరం మనోభావాలకు దర్పణంలా ఉండే చిత్రమిది. నిజమైన ప్రేమ గొప్పతనాన్ని చాటిచెబుతుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు చక్కటి ఆదరణ లభిస్తున్నది. ఈ నెల 13న ఈ సినిమాను విడుదలచేయనున్నాం' అని తెలిపారు. జ్యోతిరాజ్‌పుత్, మమత శ్రీచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్స్, పాటలు: సురేష్ ఉపాధ్యాయ, అలరాజు.

# కాలేజీ ఉత్సవంలో..



సయ్యద్‌సోహైల్, ప్రశాంత్, ఆర్‌కే, కార్తీక్‌ఆనంద్

**కా**ర్తీక్‌ఆనంద్, డింపుల్‌హయతి, సయ్యద్‌సోహైల్, షాలిని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యురేక'. కార్తీక్ ఆనంద్ దర్శకుడు. ప్రశాంత్ తాత నిర్మాత. ఈ నెల 13న విడుదలకానుంది. 'కాలేజీ ఫెస్టివల్ నేపథ్యంలో సాగే కథాంశమిది. లవ్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలతో మెప్పిస్తుంది. ఓ కాలేజీ ఉత్సవంలో జరిగిన అనూహ్య సంఘటన ఎలాంటి పరిణామాలకు దారితీసిందన్నది ఆద్యంతం ఆసక్తికరంగా అనిపిస్తుంది. ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. యువతకు బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది' అని దర్శకుడు తెలిపారు. మిస్టరీ థ్రిల్లర్‌గా అందరిని ఆకట్టుకునే చిత్రమిదని నిర్మాత పేర్కొన్నారు. బ్రహ్మాజీ, రఘుబాబు, శివన్నారాయణ, వాసు, అభయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎన్.బి.విశ్వకాంత్, సంగీతం: నరేష్ కుమరన్, దర్శకత్వం: కార్తీక్ ఆనంద్.